


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 01 బుధవారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 106

Navabhoomi daily fallows..

# సమష్టి విజయాలు

- 2025లోనూ వికసిత్ భారత్ దిశగా అడుగులు
- ప్రగతి, ఐక్యత, వికసిత్ భారత్ ఇదే మా లక్ష్యం
- గత ఏడాదిగా సాధించిన విజయాల వీడియోను షేర్ చేసిన ప్రధాని మోదీ
- భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిన సంవత్సరం 2024



2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ప్రగతి, ఐక్యత, వికసిత్ భారత్ దిశగా వేసిన అడుగులను ఈ ఏడాది గుర్తుచేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశం ఈ ఏడాది కాలంలో సాధించిన విజయాలను వివరిస్తూ ఒక వీడియోను షేర్ చేశారు.
నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ తరుణంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను ప్రజలతో పంచుకున్నారు. సమష్టిగా కృషిచేసి 2024లో అనేక విజయాలు అందుకున్నామని, 2025లో మరింత కష్టపడి 'వికసిత్ భారత్' కలలను సాకారం చేసుకుందామని పేర్కొన్నారు. ప్రగతి, ఐక్యత, వికసిత్ భారత్ దిశగా వేసిన అడుగులను ఈ ఏడాది గుర్తుచేస్తుందన్నారు. దేశం ఈ ఏడాది కాలంలో సాధించిన విజయాలను వివరిస్తూ ఒక వీడియోను షేర్ చేశారు.

**పురోగతి, ఐక్యతా సంవత్సరం**

భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిన సంవత్సరం 2024 అని ప్రధాని తెలిపారు. గ్రామీణ విద్యుద్దీకరణ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, డిజిటల్ కెనెక్టివిటీ, లింగ సమానత్వం వంటి అంశాల్లో ఈ ఏడాది అసాధారణ ప్రగతిని సాధించామని అన్నారు. భారతదేశ విధానాలు, కార్యక్రమాలతో దేశంలో నిలకడైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా గ్రామీణ-పట్టణ అసమతౌల్యత తొలగిందని అన్నారు. గ్రామీణ




## తెలుగు ప్రజలకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు

- సీఎం చంద్రబాబునాయుడు
- అందరి ఆశలు నెరవేర్చేలా
- సర్కార్ అహర్నిశలు పని చేస్తోంది
- అందరి సహకారంతో రాష్ట్రాభివృద్ధి
- ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు నాంది
- పేదల భవిష్యత్తుకు భరోసా ఇస్తాం

2



## 21వ శతాబ్దపు ప్రపంచ అత్యుత్తమ నటుల జాబితాలో ఇర్ఫాన్‌కు చోటు

- అత్యుత్తమ నటుల జాబితా విడుదల
- ఇండియా నుంచి ఇర్ఫాన్ ఖాన్‌కు చోటు
- 2020 ఏప్రిల్ 29న మృతి చెందిన ఇర్ఫాన్ ఖాన్

2



లండన్-నవభూమిబ్యూరో

21వ శతాబ్దపు 60 మంది ఉత్తమ నటుల జాబితాను బ్రిటీష్ ఆన్ లైన్ మీడియా సంస్థ 'ది ఇండిపెండెంట్' విడుదల చేసింది. ప్రపంచంలోనే అత్యుత్తమ నటుల జాబితాలో ఇండియా నుంచి కేవలం ఒకే ఒకరికి చోటు దక్కింది. అమితాబ్, షారుక్, కమలహాసన్ లాంటి నటులకు కూడా ఈ జాబితాలో స్థానం దక్కలేదు. ఈ లోకంలోనే లేని ఇర్ఫాన్ ఖాన్ కు ఆ ఘనత దక్కింది. 60 మంది ఉత్తమ నటుల జాబితాలో ఇర్ఫాన్ ఖాన్ కు 41వ స్థానం

# 4న తెలంగాణ కేబినెట్ మీట్

- సచివాలయంలో 4న 4 గంటలకు మంత్రి వర్గ సమావేశం
- రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డు టూరిజం పాలసీపై చర్చించే అవకాశం
- కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చ
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేటుతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరాపై చర్చ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఇళ్ల నిర్మాణానికి సబ్సిడీ రేటుతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేసే అంశంపై చర్చ వచ్చే జనవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆ రోజున సాయంత్రం నాలుగు గంటలకు సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ కేబినెట్ సమావేశంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు

# రోహిత్ శర్మ టెస్టులకు గుడ్‌బై?

- మ్యాచ్ తర్వాత టెస్టులకు గుడ్ బై?
- పూర్తిగా ఫామ్ కోల్పోయిన అతడు ఆస్ట్రేలియాతో
- బోర్డర్-గావస్కర్ సిరీస్‌లో తీవ్రంగా విఫలం
- బ్యాటింగ్ వైఫల్యాల ప్రభావం రోహిత్ కెప్టెన్సీపైన



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

టీమ్ ఇండియా హిట్ మ్యాన్, టి20 ప్రపంచ కప్ అందించిన అతి కొద్దిమంది కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ క్రికెట్ నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. భారత క్రికెట్ లో ఓ శకం ముగియనుందా..? ప్రపంచ క్రికెట్ నుంచి ఓ స్టార్ బ్యాట్స్ మన్ కెరీర్ చాలిస్తున్నాడా..? తాజా పరిణామాలను చూస్తుంటే ఔననే అనిపిస్తోంది. టీమ్ ఇండియా హిట్ మ్యాన్, టి20 ప్రపంచ కప్ అందించిన అతి కొద్దిమంది కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ క్రికెట్ నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. ముందుగా టెస్టులకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. టెస్టు మ్యాచ్‌లకు రిటైర్మెంట్ పై రోహిత్ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా ఫామ్ కోల్పోయిన అతడు ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్ సిరీస్ లో తీవ్రంగా విఫలం అవుతున్నాడు. 3, 6,10, 3, 9.. ఇవీ అతడి గత ఐదు ఇన్నింగ్స్ స్కోర్లు. ఇటీవలి 10 ఇన్నింగ్స్‌లో ఒక్కసారి మాత్రమే 25 పరుగులు దాటాడు. దీన్నిబట్టే అతడి ఫామ్ ఏమిటో తెలిసిపోతోంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో 0-3తో ఓటమితోనే రోహిత్ టెస్టు కెరీర్ ముగిసిందనే సంకేతాలు వచ్చాయి. ఇక ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టులో గెలిచిన టీమ్ ఇండియాలో రోహిత్ సభ్యుడు కాదు. వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్నాడు. ఆ తర్వాత అతడు సారథ్యం వహించిన మూడు టెస్టుల్లో రెండింటిలో భారత్ ఓడిపోయింది. గులాబీ టెస్టులో అయితే రోహిత్ బంతులను ఎదుర్కొనడానికి గుటకలు మింగా డు. ఇక రోహిత్ తాజాగా ముగిసిన మెల్ బోర్న్ టెస్టులో ఓపెనర్ గా వచ్చి మరీ విఫలమ య్యాడు. పైగా అతడి కోసం కేఎల్ రాహుల్ ను వన్ డౌన్ లోకి పంపాల్సి వచ్చింది. యువ బ్యాటర్ శుబ్ మన్ గిల్‌ను పక్కన పెట్టారు. ఇలా జట్టు కూర్పంతా దెబ్బతింటోంది. ఆ 2 జట్లే ఫైనల్‌కు కెప్టెన్‌గానూ నిరాశాజనకం బ్యాటింగ్ వైఫల్యాల ప్రభావం రోహిత్ కెప్టెన్సీ పైనా పడుతోంది. మెల్ బోర్న్ బాక్సింగ్ డే టెస్టులో యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ కు 52వ ఓవర్ లో బంతి చేతికిచ్చాడు. మైదానంలో అతడి వ్యూహాలు విమర్శలకు దారితీస్తున్నాయి. దీంతోనే రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాలనే డిమాండ్లు బలంగా వస్తున్నాయి. ఆ మ్యాచ్ ఆఖరు? బోర్డర్- గావస్కర్ సిరీస్ లో జనవరి 3 నుంచి సిడ్నీలో చివరి, ఐదో టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్ తర్వాత రోహిత్ టెస్టులకు వీడ్కోలు పలకనున్నట్లు సమాచారం. దీనిపై బీసీసీఐ, సెలెక్టర్లు కూడా అతడితో మాట్లాడారట. అయితే, టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరితే ఆ మ్యాచ్ వరకు రిటైర్ కావొద్దని వారు కోరారట. ఒకవేళ రోహిత్ దీనికి ఒప్పుకొన్నా.. టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే చాన్స్ చాలా తక్కువగా ఉంది. ఫైనల్ కు అర్హత సాధించకుంటే మాత్రం రోహిత్ కు సిడ్నీ టెస్టే చివరిది కానుంది. -ఈ ఏడాది జూన్ లో టి20 ప్రపంచ కప్ విజయం అనంతరం పొట్టి ఫార్మాట్ కు రోహిత్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. -వన్డేల్లోనూ రోహిత్ మరెంతో కాలం కొనసాగే చాన్స్ లేదు. జూలైలో అతడి కెప్టెన్సీలోనే శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ను కోల్పోయింది. ఇక వచ్చే జనవరిలో ఇంగ్లండ్ తో భారత్ వన్డే సిరీస్ ఆడనుంది. ఆ సిరీస్ తో రోహిత్ వన్డేలకూ వీడ్కోలు పలుకుతాడమో?

# కేటీఆర్‌కు ఊరట!

- ఈ కార్ రేస్ వ్యవహారంలో తీర్పు వచ్చే వరకు అరెస్టు వద్దు
- కేటీఆర్ క్వాష్ పిటీషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశాలు
- కార్‌రేసు కేసులో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసిన కేటీఆర్
- క్వాష్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు..తీర్పు రిజర్వ్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫార్ములా ఇ కార్ రేస్ అవినీతి వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ కేసులో అరెస్ట్‌ను ఎదుర్కొంటోన్నారు మాజీ మంత్రి, భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. క్వాష్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల నుంచి వాదోపవాదాలను ఆలకించింది ఉన్నత న్యాయస్థానం. కొద్దిసేపటి కిందటే క్వాష్ పిటీషన్‌పై హియరింగ్ పూర్తయింది. తీర్పును రిజర్వ్ చేసింది హైకోర్టు. తుది తీర్పు వెలువడేంత వరకూ కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. హైదరాబాద్ ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ ఆయన క్వాష్ పిటీషన్ దాఖలు చేశారు. దీన్ని

# పేర్నికి హైకోర్టులో ఊరట

- పేర్నీ నాని అరెస్టు కాకుండా హైకోర్టు ఆదేశాలు
- ఇప్పటికే పేర్నీ నాని సతీమణి జయసుధకి వూరట
- రేషన్ బియ్యం మాయమైన కేసులో నాని ఏ6గా చేర్చిన పోలీసులు

2



అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో రేషన్ బియ్యం మాయం ఘటనలో చిక్కుకుని విలవిల్లాడుతున్న వైసీపీ మాజీ మంత్రి పేర్ని నానికి ఇవాళ ఊరట లభించింది. ఆయన భార్య పేర్ని జయసుధకు చెందిన గోడౌన్ లో పౌరసరఫరాలశాఖ నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో పోలీసులు ఆయన్ను ఏ6గా చేర్చారు. దీంతో ఆయన అరెస్టు తప్పదనే ప్రచారం జరిగింది. అయితే దీనిపై హైకోర్టును ఆశ్రయించిన ఆయనకు ఊరట లభించింది. రేషన్ బియ్యం మాయమైన ఘటనలో నేరుగా పేర్నినాని పాత్ర లేకపోయినా కుటుంబానికి చెందిన గోడౌన్ లో నిల్వ చేసిన బియ్యం కావడంతో పోలీసులు ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురు అరెస్టు అయ్యారు. ఇదే కేసులో పేర్ని భార్య జయసుధ అరెస్టు కాకుండా జిల్లా కోర్టు

# హైడ్రా రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

- కూల్చివేతలు చేపట్టిన ల్యాండ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ఎలా చెబుతున్నారన్న హైకోర్టు
- ఆధారాలు ఉన్నాయా? అని హైడ్రాను నిలదీసిన ధర్మాసనం
- న్యాయస్థానం. పిటిషనర్ వద్ద అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి కదా? హైడ్రాను నిలదీత
- ఇలాంటివి పునరావృతం అయితే సీరియస్ యాక్షన్ తప్పదు..
- హైడ్రా కమిషనర్‌కు హెచ్చరికలు జారీ చేసిన హైకోర్టు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు చేసింది చాలు.. ఇక ఆపండంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఖాజాగూడా చెరువులో హైడ్రా కూల్చివేతలపై అంశంపై హైకోర్టులో మంగళవారం నాడు విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాదనలు విన్న న్యాయమూర్తి.. హైడ్రా తీరుపై కన్నెర్ర జేశారు. కూల్చివేతలు చేపట్టిన ల్యాండ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది న్యాయస్థానం. ఆధారాలు ఉన్నాయా? అని హైడ్రాను నిలదీసింది. పిటిషనర్ వద్ద అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి కదా? అని హైడ్రాను ప్రశ్నించింది కోర్టు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి తేల్చకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని నిలదీసింది.
కమిషనర్‌కు చెప్పి కూల్చివేతలు ఆపివేయాలని ఆదేశించారు న్యాయమూర్తి. లేదంటే తాము ఎలా డీల్ చేయాలో అలా డీల్ చేస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటివి పునరావృతం అయితే కమిషనర్ రంగనాథ్‌పై సీరియస్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు న్యాయమూర్తి. ఇదే సమయంలో పిటిషనర్‌కు కూడా కీలక ఆదేశాలిచ్చింది హైకోర్టు ధర్మాసనం. పిటిషనర్ కూడా జీహెచ్ఎంసీ పర్మిషన్ లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయకూడదన్నారు. పిటిషనర్ వేసిన తాత్కాలిక ఫెన్సింగ్ కూడా 24 గంటల్లో పిటిషనరే తొలగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో హైడ్రా కూల్చివేతలు**

హైడ్రా మరోసారి అక్రమ నిర్మాణాల కూల్చివేతలను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడ భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లోని

# న్యూ ఇయర్ వేడుకలకు సీఎం రేవంత్, మంత్రులు దూరం..

- మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి నేపథ్యంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కి దూరంగా ఉండాలని నిర్ణయం
- పూలబొకేలు,శాలువాలు,స్వీట్‌బాక్సులు తీసుకురావొద్దని సీఎంఓ ఆదేశాలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** నూతన సంవత్సర వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దూరంగా ఉండనున్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి నేపథ్యంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. మన్మోహన్ సింగ్ మృతికి వారం రోజులు సంతాప దినాలను రేవంత్ సర్కార్ ప్రకటించిన విషయం తెలిసిందే. నూతన సంవత్సర సందర్భంగా పూల బొకేలు, శాలువాలు, స్వీట్ బాక్స్‌లు తీసుకురావద్దని పార్టీ శ్రేణులకు సీఎంఓ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

**రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో రైతు రాజ్యం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర రైతు సోదరులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతులు సుఖ సంతోషాలతో పాడి పంటలతో చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఆయిల్ పామ్ రైతులకు టన్ను పామాయిల్ గెలల ధర రూ.20,506లుగా స్థిరీకరించబడిందని అన్నారు. నూతన సంవత్సర కానుకగా జనవరి మొదటి తేదీ నుంచి పెరిగిన ధరలు అమలవుతాయని ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో రుణమాఫీతో రైతు రాజ్యం ల



## సౌండ్ పెంచితే.. మీ పని అవుట్..

**హైదరాబాద్-నవభూమి:** న్యూ ఇయర్ వేడుకల నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నిబంధనలు పాటించాలని, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రై కమిషనరేట్ సీపీలు సీవీ ఆనంద్, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు( హెచ్చరించారు. ఈ మేరకు నిర్వాహకులు పాటించాల్సిన నియమనిబంధనలను వెల్లడిం చారు.ఇన్సిడెంట్ ఫ్రీగా ఈవెంట్స్ నిర్వహించాలని అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్‌తో పాటు.. పార్కింగ్ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించి, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పబ్‌లు, క్లబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, 3 స్టార్ అంతకు మించిన హోటళ్లలో 45 డెసిబుల్స్ కన్నా.. తక్కువ సౌండ్ సిస్టం ఉండేలా చూసుకోవాలన్నారు.పబ్‌లు, క్లబ్బుల్లో..వేడుకలు నిర్వహించే పబ్బులు, క్లబ్‌లు, రిసార్టుల నిర్వాహకులు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, వినియోగించినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవెంట్స్‌కు తగ్గట్టుగా ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేడుకల్లో ఎలాంటి అశ్లీల నృత్యాలు, అసభ్య సంగీత విభావరులు నిర్వహించొద్దని సీపీలు హెచ్చరించారు.పార్టీకి పాస్‌లు ఉన్న దంపతులను, కుటుంబసభ్యులను మాత్రమే అనుమతించాలన్నారు. కెపాసిటీకి మించి పాస్‌లు జారీ చేసినట్లు తేలితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటా మన్నారు. వేడుకలు జరుగుతున్న ప్రాంతానికి మారణాయుధాలుగాని, లైసెన్స్‌డ్ గన్‌లు, తుపాకులు తీసుకురావొద్దని హెచ్చరించారు. ఏ మాత్రం నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## సీఎం రేవంత్ మొత్తం ఆస్తి ఎంతో తెలుసా..? ఏడీఆర్ నివేదికలో ఇంట్రెస్టింగ్ విషయాలు



**హైదరాబాద్-నవభూమి:** దేశంలో సంపన్న ముఖ్యమం త్రుల్లో తెలంగాణ సీఎం రేవంత్ ఏడో స్థానంలో నిలిచారు. ఆయన పేరిట రూ.30.04 కోట్ల విలువైన ఆస్తులున్నాయని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ఇక రూ.931 కోట్లతో ఏపీ సీఎం చంద్రబాబు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. కేవలం రూ.15 లక్షల ఆస్తితో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ జాబితాలో ఆఖరి స్థానంలో ఉన్నారు.దేశంలో సంపన్నులైన ముఖ్యమంత్రుల జాబితాను ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్) రీఫార్మ్స్ సంస్థ తన నివేదిక ద్వారా వెల్లడించింది. ఈ నివేదికలో ఇంట్రెస్టింగ్ విషయాలు వెలుగుచూశాయి. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే సంపన్న ముఖ్యమంత్రిగా మ్నెదటి స్థానంలో నిలిచారు. వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జి ఈ నివేదికలో ఆఖరి స్థానంలో నిలిచారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. తొలి స్థానంలో నిలిచిన చంద్రబాబు నాయుడు మ్నొత్తం ఆస్తి విలువ రూ.931 కోట్లు. చంద్రబాబుకు రూ. 10 కోట్ల అప్పు ఉన్నట్లు వెల్లడించారు. చివరి స్థానంలో నిలిచిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆస్తులు రూ.15 లక్షలు మాత్రమే.

%ఇక సంపన్నులైన ముఖ్యమంత్రుల జాబితాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏడో స్థానంలో నిలిచారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం రేవంత్ ఆస్తుల విలువ రూ.30.04 కోట్లుగా తెలిసింది. అదే సమయంలో రేవంత్ రెడ్డికి 1.3 కోట్లు అప్పులు కూడా ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇక పలువురు సీఎంలపై క్రిమినల్ కేసులు ఉండగా.. అందులో సీఎం రేవంత్ రెడ్డి టాప్‌లో ఉన్నారు. రేవంత్ రెడ్డిపై హయ్యెస్ట్‌గా 89 కేసులు ఉండగా.. అందులో 72 కేసులు సీరియస్ అఫెన్సెస్ కింద ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం సిద్ధ రామయ్యపై కూడా క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆస్తుల్లో చంద్రబాబు తర్వాత అరుణాచల్ ప్రదేశం సీఎం పేమా ఖాండు రెండో స్థానంలో నిలిచారు. ఖాండు ఆస్తి విలువ రూ. 330 కోట్లు. ఆ తర్వాత స్థానంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రూ.51 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు.ఆస్తులు తక్కువగా ఉన్న సీఎంలో చివరి స్థానంలో మమతా బెనర్జీ నిలవగా.. చివరి నుంచి రెండో స్థానంలో జమ్మూ సీఎం ఓమర్ అబ్దుల్లా నిలిచారు. ఆయన ఆస్తులు కేవలం రూ. 50 లక్షలు మాత్రమే. చివరి నుంచి మూడో స్థానంలో కేరళ సీఎం పినరయి విజయన్ నిలిచారు. ఆయన ఆస్తి రూ.1.19 కోట్లగా ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. కాగా, గత ఏడీఆర్ నివేదిక ప్రకారం దేశంలోనే సంపన్న ముఖ్యమంత్రుల్లో అప్పటి ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి నిలిచారు. ఆయన ఆస్తి రూ.500 కోట్లకు పైగా ఉన్నట్లు వెల్లడించారు. తాజాగా రిపోర్టులోనూ ఏపీ ముఖ్యమంత్రే తొలిస్థానంలో నిలిచారు. అయితే పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రూ. 15 లక్షలే ఉండటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు.. పథకం అమలు తేదీపై కీలక అప్డేట్




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 28 నుంచే పథకం ప్రారంభం అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో పథకం ప్రారంభం కావటంతో అర్హులైన కూలీలు డబ్బుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పథకం అమలు తేదీపై కీలక అప్డేట్ వచ్చింది.తెలంగాణ ప్రభుత్వం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేశారు. నాలుగు విడతల్లో దాదాపు 25 లక్షల మంది రైతుల ఖాతాల్లో 22 వేల కోట్లు జమ చేసారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీలకు ఈ డబ్బులు జమ చేస్తామని చెప్పారు.

డిసెంబరు 28న మొదటి విడతగా రూ. 6 వేలు చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల వెల్లడించారు. అయితే, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఈ కార్యక్రమం వాయిదా పడినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే మళ్లీ డబ్బులు ఎప్పుడు జమ చేస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి క్లారిటీ రాలేదు. దీంతో ఆ డబ్బుల కోసం రైతు కూలీలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు కూలీలకు ఇచ్చే నగదు తేదీపై కీలక అప్డేట్ వచ్చింది. జనవరి 3న తెలంగాణ క్యాబినెట్ భేటీ నిర్వహించే అవకాశముంది. ఈ భేటీలో రైతు భరోసా పథకంతో పాటుగా.. వ్యవసాయ కూలీలకు నగదు చెల్లింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.కేబినెట్‌లో చర్చించిన తర్వాత రైతు కూలీలకు ఇచ్చే నగదు జమ అమలు తేదీని ప్రకటించే అవకాశముంది. వివిధ కారణాలతో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ కానివారికి ఇటీవల సర్కార్ రూ.2,747 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిధులింకా కొందరు రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిసింది. వీరికి కూడా నగదు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక రైతు భరోసా విధివిధానాలు కూడా ఖరారు కావాల్సి ఉంది. సంక్రాంతి నుంచి పంట పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.రైతు భరోసా మార్గదర్శకాలపై రెండ్రోజుల క్రితం మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. గత ప్రభుత్వం ఎకరాకు ఒక సీజన్‌లో రూ.5 వేల చొప్పున రైతుబంధు డబ్బులు జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.7,500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే, ప్రస్తుతం ఎకరాకు రూ.ఆరు వేలు ఇచ్చి, క్రమంగా దీన్ని రూ.7500కు పెంచాలనే యోచనలో సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా 80 లక్షల ఎకరాలకు రైతుభరోసా చెల్లించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. రూ.ఆరువేల చొప్పున చెల్లించినా రూ.4,800 కోట్ల వరకు అవసరం ఉంటుంది ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

### మమ్మీ డాడీ సారీ.. నేను మోసపోయాను..

## కన్నీళ్లు పెట్టిస్తున్న ఓ కొడుకు చివరి మాటలు



**హైదరాబాద్-నవభూమి:** సైబర్ మోసాలకు మరో యువకుడు బలయ్యాడు. అధిక లాభాలు వస్తాయని చెప్పిన మాయమాటలు నమ్మి.. తల్లిదండ్రులకు తెలియకుండా డబ్బులు పెట్టిన ఆ యువకున్ని నిలువునా ముంచేశారు. తప్పటడుగు వేశానని తెలుసుకున్న ఆ అబ్బాయి.. తన ముఖాన్ని తల్లిదండ్రులకు చూపించలేక కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తన తప్పును ఓ లేఖలో రాసి.. తాను మోసపోయానని.. తనను క్షమించాలంటూ లెటర్ పెట్టి ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సారీ మమ్మీ.. సారీ డాడీ.. సారీ రిన్ను.. అందరూ బాగుండండి.. అంటూ ఓ విద్యార్థి రాసిన లెటర్ కన్నీళ్లు పెట్టిస్తోంది. ఉన్నత చదువులు చదివి.. మంచి ఉద్యోగం సంపాధించి గొప్ప స్థాయికి చేరుకుని తమను బాగా చూసుకుంటాడని ఎంతగానో ఆశించిన తల్లిదండ్రుల కలలు కల్లలు చేస్తూ.. చేతికి అందొచ్చిన కుమారుడు మధ్యలోనే తన ప్రయాణాన్ని ఆపేశాడు. డబ్బులు సంపాదించి తండ్రికి ఆర్థికంగా సాయమవుదామనుకున్నాడో.. లేక జల్సా చేద్దామనుకున్నాడో.. మొత్తానికి షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే మంచి లాభాలు వస్తాయని భావించి అందులో దిగాడు. కానీ.. అనుకున్నది ఒకటైతే.. అక్కడ జరిగింది మరొకటి. డబ్బులు వస్తాయనుకుంటే.. పెద్ద మొత్తం పెట్టి నిలువునా మోసపోయాడు. ఈ తప్పటడుగు వేసినందుకు తల్లిదండ్రులకు తన ముఖం చూపించలేకనో, తిడతారని భయపడో.. కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తన జీవితాన్ని ముగించే ముందు.. తల్లిదండ్రులకు తాను చేసిన తప్పును వివరించేందుకు లేఖ రాసిపెట్టగా.. అది వైరల్ అవుతోంది.కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన గుమ్మడి సృజన్, ఉమా దంపతుల పెద్ద కుమారుడు రిషి వర్ధన్. డిప్లొమా పూర్తి చేశాడు. పైచదువుల కోసం ప్రిపేర్ అవుతున్నాడు. చదువులో మెరుగ్గా ఉండే రిషి.. ఇటీవల తమ మొబైల్‌కు వచ్చిన టెలిగ్రామ్ మెసేజ్ ఓపెన్ చేశాడు. "మా కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు డబుల్ వస్తాయి. మాది గ్యారెంటీ." అన్నది ఆ మెసేజ్ సారాంశం. వాళ్ల మాటలు రిషిని కాస్త టెంప్ట్ చేశాయి. డబ్బులు డబుల్ అవుతాయంటే ఎవరికి మాత్రం ఆశుండదు. అందరిలాగే రిషి కూడా ఆశపడ్డాడు. మొదట 5000 పెట్టాడు. ఆ తర్వాత 6000 పెట్టాడు. ఎప్పటికప్పుడు ప్రాఫిట్ బాగానే చూపిస్తుండటంతో.. కాస్త ధైర్యం చేసి.. 25000, ఆ తర్వాత 65000 వరకు పెట్టాడు. ఈ క్రమంలో రిషికి 1,50,000 రూపాయల ప్రాఫిట్ కూడా చూపించారు.మనిషి ఆశకు హద్దు అనేది ఉండదు కదా.. అదే వాళ్ల పెట్టుబడి. మరిన్ని డబ్బులు పెడితే.. ఊహించని విధంగా లాభాలు వస్తాయంటూ ఊరించారు. వాళ్ల మాటలు నమ్మిన రిషి.. తాహతకు మించి డబ్బులు పెట్టాడు. అయితే.. మరిన్ని డబ్బులు పెడితే.. మరిన్ని డబ్బులు వస్తాయని మాయ మాటలు చెప్పారు. ఇది నమ్మి మరిన్ని డబ్బులు పెట్టాడు. ఆ తర్వాత.. రెండున్నర లక్షలు కడితే డబ్బులు రిఫండ్ చేసుకోవచ్చని ఓ టాస్క్ ఇచ్చారు. అప్పటికప్పుడు తన దగ్గర రెండున్నర లక్షలు లేకపోవటంలో ఎలా తీసుకురావాలని ఆలోచిస్తుండగానే.. కొద్ది నిమిషాల్లో అకౌంట్లో అప్పటికే డబ్బులు పూర్తిగా అయిపోయాయి. ప్రాఫిట్ డబ్బులే కాదు అసలు అందులో రిషి పెట్టిన ఒక్క రూపాయి కూడా విత్ డ్రా చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వలేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. దీంతో.. మోసపోయానని రిషి గుర్తించాడు. ఇన్ని రోజులు పెట్టిన డబ్బులు మొత్తాన్ని లాగేసుకున్నారు. అకౌంట్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇది గమనించిన రిషి.. తన తల్లిదండ్రులకు ఏం చెప్పాలన్న డైలమాలో పడిపోయాడు. అయితే.. అందులో పెట్టిన డబ్బులన్ని తన తల్లి, తండ్రికి సంబంధించిన అకౌంట్ల నుంచి వాళ్లకు తెలియకుండా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు రిషి. ఎలాగూ లాభాలు వస్తాయి కదా.. వాటితో కలిపి మొత్తం డబ్బులు ఇస్తే అందరూ హ్యాపీగా ఉండొచ్చనుకున్నాడు కానీ.. అంతా రివర్స్ జరిగింది. దీంతో.. తల్లిదండ్రులకు ఏం చెప్పాలి.. అసలు ఆ డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలి.. అన్న ప్రశ్నలతో తన బ్రెయిన్ ఒక్కసారిగా చిక్కులు పడిపోయిన దారంలా తయారైంది. దారులన్ని మూసుకుపోయినట్టు.. చుట్టూ శూన్యంలా అనిపించింది.దీంతో.. తాను ఆత్మహత్య చేసుకోవాలని డిసైడ్ చేసుకున్నాడు. తాను ఏం చేశాడన్నది పూర్తిగా ఓ లెటర్‌లో రాసి పెట్టి.. ఇందులో ఎవరి తప్పు లేదు.. నా చావుకి నేనే కారణం అంటూ లేఖలో రిషి రాసుకొచ్చాడు. అనంతరం.. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి వచ్చిన తమ్ముడు కిటికీలో నుంచి చూడటంతో తన అన్న ఉరికి వేలాడుతుండటం చూసి.. భయంతో కేకలు వేయటంతో ఇరుగుపొరుగు వచ్చి చూశారు. వెంటనే తలుపులు పగలగొట్టి ఆస్పత్రికి తరలించి బతికించాలని ప్రయత్నించారు. కానీ.. అప్పటికే రిషి ప్రాణాలు వదిలినట్టుగా వైద్యులు తెలిపారు.దీంతో.. చేతికి అందొచ్చిన కొడుకు విగతజీవిగా మారటం చూసి.. ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోధించారు. కాగా.. అమ్మ నాన్న నేను మోసపోయాను.. నా చావుకు ఎవరూ కారణం కాదు అంటూ రాసిన సూసైడ్ నోట్ చూసి.. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పవిత్రమైన అయ్యప్ప మాలలో ఉండి.. ఇంత ఘోరమేంటి స్వామి..!



**హైదరాబాద్-నవభూమి:** మాలధారణ చేస్తున్నామంటే.. మనకున్న చెడు అలవాట్లతో పాటు కామ, క్రోద, మద, మాశ్చర్యాలను దూరం చేసుకుని.. మనలోని దైవత్వాన్ని మేల్కొల్పి.. స్వచ్ఛమైని నిశ్చలమైన మనిషిగా మారాలనే ఉద్ధేశంతోనే. ఇందులో మాలధార ణకు ఎన్నో నియమాలు నిబంధనలు కూడా ఉంటాయి. చెడు అలవాట్ల జోలికి పోకుండా, మనసును నిర్మలంగా మార్చుకుని ఉండాలి. కానీ.. కొంత మంది తాము మాలలో ఉన్నామన్న విషయాన్ని మర్చిపోయి.. ఎన్నో దుర్మార్గపు పనులు చేస్తున్నారు. అందులో భాగంగానే ఓ స్వామి అత్యంత ఘోరానికి పాల్పడ్డాడు.మాలధారణం నియమాల తోర ణం.. జన్మ తారణం దుష్కర్మ వారణం.. శరణం శరణం శరణం శరణం.. అని అయ్యప్పస్వామి మాలధారణ గురించి ఎంతో గొప్పగా స్తుతిస్తుంటారు. అంటే.. మాల వేసుకోవట మనేది ఎన్నో నియామాలతో కూడుకున్న ఓ పవిత్ర యజ్ఞంలాంటింది. ఎన్నో చెడు కార్యాలను నివారింపజేసి జన్మను ధన్యం చేసుకునే అద్భుత కార్యం. అలాంటి అయ్యప్ప మాల ధరించిన ఓ స్వామి.. ఈ మాటలను తుంగలో తొక్కి ఆ మాలధారణ పవిత్రను భగ్నం చేస్తూ అత్యంత దారుణానికి పాల్పడ్డాడు. మాల ధరించిన స్వాములు చీమకు కూడా హాని తలపెట్టకూడదన్న నియమాన్ని మరిచి.. తన సొంత భార్యను అత్యంత కిరాతకంగా చంపేశాడు. ఈ ఘోరం.. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

ప్రతాప సింగారం గ్రామంలో భార్య నిహారిక (35)ను భర్త శ్రీకర్ రెడ్డి బండ రాయితో తలపై కొట్టి చంపేసిన ఘటన సర్వత్రా సంచలనంగా మారింది. ఈ ఘటన సోమవారం (డిసెంబర్ 30) అర్ధరాత్రి చోటుచేసుకుంది. శ్రీకర్ రెడ్డి ప్రస్తుతం అయ్యప్ప మాలలో ఉండగా.. ఇలాంటి ఘోరానికి పాల్పడటం శోచనీయం.బోడుప్పల్ టెలిఫోన్ కాలనీకి చెందిన నిహారికకు 2017లో ఖమ్మం జిల్లా తిరమలపాలెం మండలం కాకర్రై గ్రామానికి చెందిన బండారు శ్రీకర్ రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కూతురు ఉన్నారు. నిహారికకు తల్లిదండ్రులు ప్రతాప సింగారం గ్రామంలో ఓ ఇల్లు కొనిచ్చారు. ఈ ఇంటి విషయంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి.. ఇద్దరికీ పలుమార్లు ఘర్షణ జరిగింది. తన పుట్టింటి వాళ్లు ఇచ్చిన ఇల్లు అంటూ నిహారిక పదే పదే ప్రస్తావిస్తుండటం శ్రీకర్ రెడ్డికి నచ్చేది కాదు. దీంతో.. ప్రతిసారి ఇద్దరి మధ్య గొడవలు తలెత్తేవి.ఇదేక్రమంలో సోమవారం (డిసెంబర్ 30న) రాత్రి కూడా నిహారిక, శ్రీకర్ రెడ్డి మధ్య ఇంటి గురించి వాగ్వాదం చోటుచేసుకోగా.. అది కాస్త చిలికి చిలిక ఘర్షణగా మారింది. అయ్యప్ప మాలలో ఉన్న శ్రీకర్ రెడ్డి.. సహనం కోల్పోయేంత స్థాయికి ఆ గొడవ చేరుకుంది. దీంతో.. క్షణికావేశంలో భార్య నిహారిక తలపై బండ రాయితో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. భర్తపై భార్య డామినేషన్ వల్లే ఈ హత్యకు దారి తీసిందని పోలీసులు ప్రథమనికంగా నిర్ధారించినట్టు సమాచారం.

సాధారణ సమయాల్లో ఎలా ఉన్నా.. దేవుని మాల ధరించినప్పుడు మాత్రం మనుషులు చాలా నిష్ఠగా, ఓపకగా, సహనంగా, దైవ చింతనలో ఉంటారు. అది అంజనేయస్వామి మాల అయినా, అయ్యప్పమాల అయినా.. ఇంకా ఎలాంటి దైవానికి సంబంధించిన మాల అయినా ధరించినప్పుడు ఆ దీక్ష తీసుకున్నన్ని రోజులు.. ఎన్నో నియమాలు పాటించాల్సి ఉంటుంది. మాంసం, మద్యానికి దూరంగా ఉండాలి. అబద్దాలు చెప్పకూడాదు. ఎవ్వరినీ మోసం చేయకూడదు. నిజాయితీగా ఉండాలి. నిష్ఠతో ఉండాలి. ఎవరికీ మనసులో కూడా హాని తలపెట్టకూడదు. బ్రహ్మచర్యం పాటిస్తూ.. నిత్యం ఆ దైవనాస్మరణతో మనసు నింపుకోవాలి. మనసును మలినం లేకుండా చేసి.. మనలోని దైవత్వాన్ని మేల్కోల్పి.. స్వచ్ఛమైన మనిషిని ఆవిష్కరించే ప్రయత్నమే ఈ మొత్తం మాలధారణ నియమాల సారం. ఇంత పవిత్రమైన మాలలు ధరించి కూడా చాలా మంది.. నియమాలను పట్టించుకోకుండా.. తమలోని కోపావేశాలు, స్వార్థాలతో ఆ మాలకు ఉన్న పవిత్రతను భగ్నం చేస్తున్నారు కొందరు వ్యక్తులు.

## సమష్టి విజయాలు

(1వపేజీ తరువాయి)భారతంలోని ప్రజల స్థితిగతులను మెరుగుపరచడంపై ఈ ఏడాది ప్రధానంగా దృష్టిసారించామని అన్నారు. పీఎం జన్‌ధన్ యోజనతో సహా అనేక పథకాలు సానుకూల ఫలితాలనిచ్చాయని, 54 కోట్ల ఫస్ట్ టైమ్ బ్యాంక్ హోల్డర్లు ఫార్మల్ బ్యాంకింగ్ సిస్టంలోకి వచ్చారని చెప్పారు. పీఎం ఆవాస్ యోజనతో గ్రామీణ హౌసింగ్ ముఖచిత్రమే మారిపోయిందని, 3.2 కోట్లకుపైగా గృహాలు మంజూరుచేయగా, 2.7 కోట్ల గృహాలు పూర్తయ్యాయని వివరించారు. లబ్ధిదారులలో 74 శాతం మహిళలే ఉన్నారని చెప్పారు. గ్రామీణ విద్యుద్దీకరణతో గ్రామాల్లో పదేపదే పవర్ కట్స్‌కు తెరపడిందన్నారు.

దేశంలోని ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసిందని మోదీ అన్నారు. 6 లక్షల గ్రామాలకు 4జి కనెక్టివిటీ వచ్చిందన్నారు. 'ఇండియా గ్రోత్ స్టోరీ'లో గ్రామీణ భారతం ఇప్పుడు చురుకైన భాగస్వామ్యం కలిగి ఉందని చెప్పారు. విధాన నిర్ణయాలు, పాలనలో మహిళల పార్టిషిపేషన్ కూడా పెరిగిందని, శాసనసభలు, పంచాయతీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని, ఓటింగ్‌లో పాల్గొంటున్న మహిళల శాతం కూడా పెరిగిందన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌పేస్ (యూపీఐ) ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్టు చెప్పారు. 2017లో 400 మిలియన్ లావాదేవీలు జరగ్గా, 2024లో 170 బిలియన్ ట్రాన్సాక్షన్లు జరిగాయన్నారు. ఈ ఏడాది ఒక్క అక్టోబర్ మాసంలోనే రికార్డు స్థాయిలో 500 మిలియన్ ట్రాన్సాక్షన్లు జరిగినట్టు తెలిపారు.

పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం విషయంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రగతి సాధించామని, 2021లో ఒకే రోజు 25 మిలియన్ కోవిడ్-19 వ్యాక్సిన్లు వేశామని చెప్పారు. వ్యాక్సిన్ డిస్ట్రిబ్యూషన్‌లో కూడా గ్లోబల్ లీడర్‌గా భారత్ నిలిచిందని చెప్పారు. ఆపన్న దేశాలకు 300 మిలియన్ వాక్సిన్లు ఎగుమతి చేశామని తెలిపారు.

మౌలిక వసతులకల్పన ఊపందుకుందని, 66 ఏళ్లలో 91,000 కిలోమీటర్ల మేర హైవేలు నిర్మిస్తే, తమ ప్రభుత్వం గత పదేళ్లలో మరో 54,000 కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను విస్తరించిందని మోదీ తెలిపారు. ఆర్థిక వృద్ధి, కనెక్టివిటీ, వాణిజ్యం, ఉద్యోగ అవకాశాలు దేశవ్యాప్తంగా పెరగడానికి ఈ చర్యలు దోహదపడ్డాయని చెప్పారు. గత దశాబ్ద కాలంలో 1.5 లక్షలకు పైగా స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలతో మార్కెట్ నుంచి సానుకూల స్పందన రావడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల బేస్ పెరిగిదన్నారు. మ్యూచ్యువల్ ఫండ్స్ ద్వారా ఫైనాన్షియల్ మార్కెట్‌లో ప్రజల పార్టిసిపేషన్ పెరగడం కూడా ఇండియాస్ గ్రోత్ స్టోరీని, దీర్ఘ కాలిక అవకాశాలను ప్రతిబింబిస్తోందని అన్నారు. 'వికసిత్ భారత్' దిశగా 2025లోనూ మరింత ముందుకు అడుగులు వేయడం ద్వారా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం కలను సాకారం చేద్దామని ప్రధాని అభిలషించారు.

## 4న తెలంగాణ కేబినెట్ మీట్

(1వపేజీ తరువాయి)ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేటుతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలనే ప్రతిపాదనపై కేబినెట్ చర్చించే అవకాశముంది. అలాగే విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికపై చర్చించనున్నారు. యాదగిరిగుట్ట దేవాలయానికి టీటీడీ తరహా బోర్డును ఏర్పాటు చేసే దిశగా కేబినెట్ ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది.

## కేటీఆర్‌కు ఊరట!

(1వపేజీ తరువాయి)విచారణకు స్వీకరించింది హైకోర్టు. ఆయనకు ఊరట ఇచ్చింది. ఆయనను అరెస్ట్ చేయవద్దంటూ జారీ చేసిన ఉత్తర్వులను పొడిగించింది. ఈ గడువు నేటితో ముగిసిన నేపథ్యంలో మరోసారి క్వాష్ పిటీషన్‌పై విచారణ చేపట్టింది హైకోర్టు. అవినీతి నిరోధక విభాగం దాఖలు చేసిన కౌంటర్‌పై విచారించింది. వాదోపవాదాలను ఆలకించింది. ఏసీబీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, కేటీఆర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థ్ దవే వాదనలను వినిపించారు. ఫార్ములా ఈ- రేస్ నిర్వాహకులకు ఎవరి అనుమతులు లేకుండా 46 కోట్ల రూపాయలను పౌండ్ల రూపంలో హెచ్‌ఎండీఏ చెల్లించిందని అదనపు అడ్వొకేట్ జనరల్ వివరించారు. నిబంధనల మేరకు 10 కోట్ల రూపాయలకు మించి జరిగే లావాదేవీలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతులను తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.హెచ్‌ఎండీఏ మున్సిపల్ మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుందని, ఆ శాఖ మంత్రిగా ఈ చెల్లింపులకు కేటీఆర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే- అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించిన అర్వింద్ కుమార్‌పైనా కేసు నమోదైందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సిద్ధార్థ్ దవే తన వాదనలను వినిపించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని అన్నారు. అవినీతి జరిగినట్లు ఏసీబీ ఎక్కడే గానీ ఆధారాలను చూపించలేకపోయిందని చెప్పారు. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని న్యాయస్థానానికి అభ్యర్థించారు. అవినీతి జరగనందు వల్లే ఫార్ములా ఈ రేసింగ్ వ్యవహారంలో ఏసీబీ అధికారులు ఇప్పటివరకు కూడా ఏ ఒక్కరినీ అరెస్ట్ చేయలేదని అన్నారు. వాదోపవాదాలను విన్న అనంతరం హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తుది తీర్పు వెలువడేంత వరకూ కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది.

## హైడ్రా రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

(1వపేజీ తరువాయి)అక్రమ నిర్మాణాలను అధికారులు జేసీబీలతో కూల్చివేయిస్తున్నారు. ఈ చెరువు బఫర్ జోన్‌లోని రెండు ఎకరాల స్థలంలోని కొంత భాగంలో ఇటీవల ఆక్రమణదారులు రేకుల షెడ్లు నిర్మించారు.ఈ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం నాడు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి భగీరథమ్మ చెరువు వద్దకు చేరుకొని జేసీబీలతో నిర్మాణాలను కూల్చివేశారు.

## న్యూ ఇయర్ వేడుకలకు సీఎం రేవంత్, మంత్రులు దూరం..

(1వపేజీ తరువాయి)వచ్చిందని అన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌తో తెలంగాణ రైతాంగానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు. అత్యధిక ధాన్యం ఉత్పత్తితో యావత్ దేశానికి తెలంగాణ అన్నపూర్ణగా నిలిచిందని అన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే మార్గదర్శిగా మారబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## తెలుగు ప్రజలకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు

**అమరావతి-నవభూమి:**"2025లో మీకు ఆనందకర, ఆరోగ్యకరమైన జీవితం లభించాలని కోరుకుంటున్నాను. 2024లో మీరు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం... అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పనిచేస్తోంది. కేవలం 6 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలను ఆవిష్కృతం చేశాం.

పేదల భవిష్యత్ కు భరోసా ఇస్తూ పెన్షన్ల మొత్తాన్ని పెంచాం. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ధాన్యం సేకరణ డబ్బులు 48 గంటల్లోనే చెల్లించి రైతన్నలో సంతోషాన్ని నింపాం. ప్రయాణాలు సాఫీగా సాగాలని రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలు లేకుండా చేస్తున్నాం. నూతన పాలసీలతో మళ్లీ పెట్టుబడులు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు నాంది పలికాం. కొత్త సంక్షేమ పథకాలు, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు 2025 సంవత్సరం వేదిక కాబోతోంది. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారమే లక్ష్యంగా 10 సూత్రాల ప్రణాళిక అమలు చేస్తూ అటు ప్రజా సంక్షేమాన్ని, ఇటు రాష్ట్రాభివృద్ధిని మీ అందరి సహకారంతో చేసి చూపిస్తాం... మీ అందరికీ మరోసారి హ్యాపీ న్యూ ఇయర్ 2025" అంటూ చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## 21వ శతాబ్దపు ప్రపంచ అత్యుత్తమ నటుల జాబితాలో ఇర్ఫాన్‌కు చోటు

**అమరావతి-నవభూమి:**దక్కింది. 2020 ఏప్రిల్ 29న ఇర్ఫాన్ ఖాన్ మృతి చెందారు. న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్ అనే వ్యాధి కారణంగా ఆయన చనిపోయారు. ఈ వ్యాధికి చికిత్స కోసం ఇర్ఫాన్ ఖాన్ కొన్ని నెలల పాటు యూకేలో ఉన్నారు. ఆయన పూర్తిగా కోలుకుంటారని అందరూ భావించారు. యూకేలో చికిత్స తీసుకుని ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత ఆయన ముంబైలోని వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

తాను చివరగా నటించిన 'ఆంగ్రేజీ మీడియం' షూటింగ్ సమయంలో కూడా అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. దీంతో, కొన్ని రోజుల పాటు బ్రేక్ తీసుకుని... ఆ తర్వాత షూటింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన అనారోగ్యం నుంచి కోలుకోలేకపోయారు. చికిత్స పొందుతూనే 2020 ఏప్రిల్ 29న కన్నుమూశారు.

## పేర్నికి హైకోర్టులో ఊరట

(1వపేజీ తరువాయి)ఇప్పటికే ముందస్తు బెయిల్ కూడా ఇచ్చింది. దీంతో మిగిలిన పేర్నినాని అరెస్టు ఖాయమని అంతా భావించారు. అయితే హైకోర్టు మాత్రం ఆయన్ను సోమవారం వరకూ అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇచ్చింది. పవన్ చెడుగుడు ఎక్స్ ట్రా.." రేషన్ బియ్యం కేసులో పోలీసులు తనను ఏ6గా చేర్చిన నేపథ్యంలో పేర్నినాని ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. పేర్నినానిపై దుందుడుకు చర్యలు వద్దని పోలీసులకు సూచించింది. ఈ కేసులో వచ్చే సోమవారం విచారణ జరుపుతామని, అప్పటి వరకూ దూకుడు చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోలీసులు కూడా వచ్చే సోమవారం వరకూ వేచి చూడాల్సిన పరిస్థితి..

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
బుధవారం
01 । జనవరి । 2025

# అంతరిక్షంలో వ్యోమగాములకు 16 సార్లు న్యూఇయర్





న్యూఢిల్లీ-నవభూమి: విశ్వంపై కొత్త ఏడాది ప్రారంభమైంది. ఇప్పటికే కొన్ని దేశాలు 2025 ఏడాదికి ఘనంగా స్వాగతం పలికాయి. కిరిబాటి దీవి న్యూజిలాండ్ ప్రజలు కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టారు. అయితే, సాధారణంగా భూమ్మీద ఉన్న ప్రజలు కొత్త ఏడాదికి ఎన్నిసార్లు స్వాగతం పలుకుతారు..? ఒక్కసారే కద. అయితే, అంతరిక్షంలోని ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు మాత్రం 16 సార్లు ఈ అనుభూతిని సొంతం చేసుకుంటారట. అందుకు కారణం.. ఐఎస్ఎస్ గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతుండటమే.ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్) గంటకు 28,000 కిలో మీటర్ల వేగంతో తిరుగుతుంది. దీంతో 90 నిమిషాల్లో భూమి చుట్టూ ఒక రౌండ్ పూర్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి భూమిపై పగలు, 45 నిమిషాల తర్వాత రాత్రిని చూస్తారు. మరోవైపు ఐఎస్ఎస్ ఒక రోజులో భూమి చుట్టూ 16 సార్లు పరిభ్రమిస్తుంది. దీంతో అందులోని వ్యోమగాములు ప్రతి రోజు 16 సార్లు సూర్యోదయాన్ని, 16 సార్లు సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు కొత్త ఏడాదిని 16 సార్లు స్వాగతం పలుకుతారు. తద్వారా న్యూఇయర్‌ను 16 సార్లు సెలబ్రేట్ చేసుకునే అరుదైన అవకాశం వారికి లభిస్తుందన్నమాట.

# ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ మళ్లీ డౌన్.. నెలలో ఇది మూడోసారి..!



న్యూఢిల్లీ-నవభూమి: 'ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజమ్ కార్పొరేషన్ వెబ్‌సైట్ మరోసారి డౌనయ్యింది. మంగళవారం ఉదయం ఆశ్చర్యకరంగా తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలోనే వెబ్‌సైట్ మొరాయించింది. దాంతో యూజర్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌ను సరిదిద్దే పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల కొంతసేపు టికెట్ బుకింగ్‌లు, కాన్సిలేషన్‌లు చేయడం వీలుపడదని ప్రకటించారు.కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ డౌన్ అవడం ఈ నెలలో ఇదే తొలిసారి కాదు. ఇప్పటికే రెండు సార్లు ఈ సమస్య వచ్చింది. తాజాగా మూడోసారి సమస్య తలెత్తింది. డిసెంబర్ 26న ఏకంగా గంటన్నర పాటు బుకింగ్స్ నిలిచిపోయాయి. అంతకు ముందు డిసెంబర్ 9న కూడా వెబ్‌సైట్ రెండు గంటలపాటు సతాయించింది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా టూర్ ప్లాన్ చేసుకున్నవాళ్లు టికెట్ బుక్ చేసుకుందామంటే సమస్య తలెత్తింది.వెబ్‌సైట్ ట్రాకర్ డౌన్ డిటెక్టర్ ప్రకారం దాదాపు 47 శాతం మందికి వెబ్‌సైట్ యాక్సెస్ కాలేదు. 42 శాతం మందికి యాప్ ఓపెన్ కాలేదు. 10 శాతం మంది టికెట్ బుకింగ్ చేసుకోలేకపోయారు. ఉదయం 10 గంటల నుంచి యూజర్లు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దీనిపై రైల్వేశాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గతంలో రెండుసార్లు సైట్ డౌన్ అయినప్పుడు కూడా రైల్వే శాఖ ఎలాంటి స్పందన తెలుపలేదు.కాగా ఈ నెలలో మూడు సందర్భాల్లోనూ తత్కాల్ టికెట్లు ప్రారంభం కావడానికి సరిగ్గా 10 నిమిషాల ముందే ఉదయం 9.50 గంటలకు సైట్ డౌన్ కావడం గమనార్హం.

# కొత్త ఏడాది వేళ ఆలయాలకు పోటెత్తిన భక్తులు



న్యూఢిల్లీ-నవభూమి:2024 ఏడాది ముగింపు దశకు చేరింది. మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2025కు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు యావత్తు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇందులో భాగంగా కొత్త ఏడాది వేళ దేశంలోని ఆలయాలకు భక్తులుపోటెత్తారుఇవాళ తెల్లవారుజాము నుంచే దేశంలోని ప్రముఖ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ మందిరం కాశీ విశ్వనాథ ఆలయం, అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్, అస్సాంలోని కామాఖ్య ఆలయం, తమిళనాడులోని మధురై మీనాక్షి ఆలయం, ఢిల్లీ కన్నాట్ ప్రాంతంలోని హనుమాన్ టెంపుల్ సహా పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి.

# దేశంలోనే మొట్టమొదటి గాజు వంతెన ప్రారంభం.. ఎక్కడ ఉందో తెలుసా..?



న్యూఢిల్లీ-నవభూమి: దేశంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో తమిళనాడు రాష్ట్రం ఒకటి. అక్కడ ప్రకృతి అందాలతో పాటు ఎన్నో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. వీటిని చూసేందుకు దేశ నలుమూలల నుంచి ప్రజలు నిత్యం తమిళనాడుకు పోటెత్తుతుంటారు. ఈ నేపథ్యంలో పర్యాటకులను ఆకర్షించేందుకు అక్కడి ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను, మౌలిక వసతులను కల్పిస్తోంది. ఇందులో భాగంగానే దేశంలోనే మొట్టమొదటిసారిగా గ్లాస్ బ్రిడ్జ్ ను నిర్మించింది. బంగాళాఖాతం మధ్యన ఏర్పాటు చేసిన ఈ గాజు వంతెన ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించారు.

కన్యాకుమారి తీరంలో వివేకానంద స్మారక మండపానికి 77 మీటర్ల దూరంలో 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి జనవరి 1వ తేదీకి 25 ఏళ్లు పూర్తవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తమిళనాడు ప్రభుత్వం రెండు రోజులపాటు సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే వివేకానంద మండపం, తిరువళ్లువర్ విగ్రహాన్ని కలిపేలా దేశంలోనే మొదటిసారి సముద్రం మధ్యన ఈ గాజు వంతెనను తమిళనాడు ప్రభుత్వం నిర్మించింది.

# ఈ ఏడాదికి ఇదే చివరి సూర్యోదయం..



న్యూఢిల్లీ-నవభూమి:ఈ ఏడాది ముగింపు దశకు చేరింది. మరికొన్ని గంటల్లో 2024 ఏడాది కాలగర్భంలో కలిసిపోనుంది. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు యావత్తు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇక ఇదే సమయంలో ఈ ఏడాది చివరి సూర్యోదయం కొన్ని గంటల ముందే ఆవిష్కృతమైంది. ఈ అద్భుత దృశ్యాల్ని దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. దేశ వ్యాప్తంగా సముద్ర తీరాలు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో సూర్యుడు ఉదయిస్తున్న దృశ్యాలను ప్రజలు తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియోలు వైరల్ అవుతున్నాయి. నల్లని మబ్బులను చీల్చుకుంటూ ఎరుపెక్కిన సూర్యుడి సుందర దృశ్యాలను మీరూ చూసేయండి మరి.

# గతాన్ని మర్చిపోయి నన్ను క్షమించండి.. మణిపూర్ సీఎం అభ్యర్థన



న్యూఢిల్లీ-నవభూమి:2023 మే నెల నుంచి మణిపూర్‌లో జరుగుతున్న జాతి హింసపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించారు. గతంలో జరిగిన అన్నింటినీ మర్చిపోతూ ప్రజలు తనను క్షమించాలని కోరారు. ఇంఫాల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హింసాకాండను నిర్వహించడంపై ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణ జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది చాలా దురదృష్టకరంగా గడిచిందని సీఎం బిరేన్ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది మే 3వ తేదీ నుంచి నేటి వరకు జరుగుతున్న హింసాకాండకు ప్రజలకు క్షమాపణ తెలియజేయాలనుకుంటున్నట్లు వివరించారు. ఈ హింసాకాండ వల్ల అనేక మంది తమ ప్రియమైన వారిని కోల్పోయారని, మరికొందరు తమ ఇళ్లు వదిలిపెట్టి మరీ వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే ఈ అల్లర్లలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. దీనంతటికీ తాను చింతిస్తున్నట్లు సీఎం బిరేన్ సింగ్ వివరించారు. అయితే గత మూడు, నాలుగు నెలలుగా రాష్ట్రంలో శాంతి, భద్రతలు ఓ కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.

2023 మే 3వ తేదీ నుంచి కుకీ, మైతేయిల మధ్య ఘర్షణలు చెలరేగగా.. ఈ హింసాకాండలో మొత్తం 200 మందికి పైగా చనిపోయినట్లు సీఎం బిరేన్ సింగ్ తెలిపారు. అలాగే నిరాశ్రయులైన 2 వేల 58 మంది కుటుంబాలను ఇంఫాల్‌లోని పలు ప్రాంతాల్లో పునరావాసం కల్పించినట్లు చెప్పుకొచ్చారు. ముఖ్యంగా జాతీయ రహదారుల వెంట హింసను రికట్టేందుకు %NH-2, NH%-37 లపై వరుసగా అదనపు భద్రతా సిబ్బందిని ఉంచినట్లు పేర్కొన్నారు. నిరసనకారులు ప్రభుత్వం నుంచి దోచుకున్న 6 వేల ఆయుధాల నుంచి 3 వేల ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. అలాగే 625 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు.. మొత్తం 12 వేల 247 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అంతేకాకుండా మణిపూర్ ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ను 32 నుంచి 39 శాతానికి పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ ప్రకటించారు. అలాగే వివిధ పథకాల ద్వారా హింసాకాండలో ప్రభావితమైన నిర్వాసితులకు సాయం చేసేందుకు తమ సర్కారు ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. నివాసితులపై ప్రభావం చూపుతున్న అధిక విమాన ఛార్జీలను తగ్గించేందుకు పలు సేవలు ప్రారంభించినట్లు వివరించారు. ముఖ్యంగా విమాన ఛార్జీలు రూ.5 వేలు దాటితే మణిపూర్ ప్రభుత్వం ప్రయాణికులకు రాయితీలు కల్పిస్తుందని అన్నారు. ఇంఫాల్-గౌహతి, ఇంఫాల్-కోల్ కతా, ఇంఫాల్-దిమాపూర్ మార్గాల్లో వారానికి రెండుసార్లు విమాన

# భారత్ కంటే ముందుగా న్యూఇయర్ సెలబ్రేట్ చేసుకునే దేశాలేవో తెలుసా..?



న్యూఢిల్లీ-నవభూమి:కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. మరికొద్ది గంటల్లో న్యూఇయర్ వస్తుండటంతో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు రకరకాల ప్లాన్స్ చేసుకుంటున్నారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి ఎప్పుడు అవుతుందా? హ్యాపీ న్యూఇయర్ అని ఎప్పుడెప్పుడు చెప్పుకుంటామా? అని ఎదురుచూస్తున్నారు. అయితే అన్ని దేశాల్లో కొత్త ఏడాది ఒకేసారి రాదు. ఒక్కో దేశం ఒక్కో సమయంలో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతుంది. ఇక భారత్‌లో డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 దాటగానే కొత్త ఏడాది ప్రారంభం అవుతుంది. అయితే, కొన్ని దేశాల్లో ఇప్పటికే కొత్త సంవత్సరం మొదలైపోయింది.

పసిఫిక్ సముద్రంలోని కిరిబాటి దీవి ప్రజలు అందరికంటే ముందుగా కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకే వాళ్లకు న్యూఇయర్ మొదలైపోయింది. కిరిబాటి దీవి తర్వాత న్యూజిలాండ్ కూడా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టింది. భారతీయ కాలమాన ప్రకారం 4.30 గంటలకు వాళ్లకు కొత్త సంవత్సరం మొదలయ్యింది. అద్భుతమైన ఫైర్‌వర్క్స్, హోరెత్తించే మ్యూజిక్‌తో ఆక్లాండ్ ప్రజలు న్యూఇయర్‌కు వెల్‌కమ్ చెప్పారు.న్యూజిలాండ్ తర్వాత ఆస్ట్రేలియాలో కొత్త ఏడాది ప్రారంభం అవుతుంది. అక్కడ సాయంత్రం 6:30 గంటలకు న్యూఇయర్ మొదలవుతుంది. జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలో రాత్రి 8:30 గంటలకు, చైనా, మలేసియా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్‌లో రాత్రి 9:30 గంటలకు, థాయ్‌లాండ్, వియత్నాం, కాంబోడియాలో రాత్రి 10:30 గంటలకు న్యూఇయర్ మొదలవుతుంది.భారత్ తర్వాత 43 దేశాలు ఒకేసారి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతాయి. వాటిలో జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, ఇటలీ లాంటి ఐరోపా దేశాలతోపాటు కాంగో, అంగోలా, కామెరూన్ లాంటి ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. అయితే, చివరిగా మాత్రం అమెరికానే న్యూఇయర్‌కు స్వాగతం పలుకుతుంది.

# పుణె పబ్ నిర్వాకం.. న్యూ ఇయర్ పార్టీ ఇన్విటేషన్‌లో కండోమ్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు



పుణె-నవభూమి: మరికొన్ని గంటల్లో నూతన సంవత్సర వేడుకలకు తెరలేవనుంది. పాత సంవత్సరానికి ముగింపు పలికి కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలకడానికి అంతా సిద్ధమవుతున్నారు. మంగళ, బుధవారాల్లో జోరుగా పార్టీలు చేసుకునేందుకు యువత సన్నద్ధమవుతున్నది. ఈవెంట్లు, పార్టీల పేరుతో దీన్ని క్యాష్ చేసుకునేందుకు పబ్‌లు, క్లబ్‌లు కూడా రెడీ అయ్యాయి. ఇందులో భాగంగా న్యూ ఇయర్ పార్టీకి సంబంధించి ఓ పబ్ ఇచ్చిన ఆహ్వానం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీసింది. నూతన సంవత్సర వేడుకల ఇన్విటేషన్‌తోపాటు కండోమ్ ప్యాకెట్, ఓఆర్ఎస్ పంపించింది. అది చూసినవారంతా షాక్ అవుతున్నారు.మహారాష్ట్రలోని పుణెలో ఉన్న హై స్పిరిట్స్ పబ్ న్యూ ఇయర్ వేడుల్లో భాగంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో గెస్టులకు దీనికి సంబంధించిన ఇన్విటేషన్‌తోపాటు కండోమ్ ప్యాకెట్, ఓఆర్ఎస్ పంపించింది. ఈ ఇన్విటేషన్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. దీన్ని తీవ్రంగా పరిగణించిన మహారాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పబ్ మేనేజ్‌మెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిటీ పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.పబ్, నైట్ లైఫ్‌కు తాము వ్యతిరేకం కాదని యూత్ కాంగ్రెస్ నేత అక్షయ్ తెలిపారు. అయితే యూత్‌ను తమ పబ్‌కు వచ్చేలా ఇలాంటి దిగజారుడు పనులు, చెత్త మార్కెటింగ్ వ్యూహాలు సరికావని మండిపడ్డారు. సదరు పబ్‌పై వెంటనే పోలీసులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇన్విటేషన్ కార్డును అందుకున్న పలువురిని పిలిచి విచారించినట్లు చెప్పారు.

# ఈ ఏడాదంతా దురదృష్టకరమే.. రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పిన మణిపూర్ సీఎం



న్యూఢిల్లీ-నవభూమి:ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రావణకాష్టంలా రగులుతున్న విషయం తెలిసిందే. రెండు జాతుల మధ్య వైరంతో ఏడాదిన్నరగా అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన దురదృష్టకర పరిణామాలపై ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తాజాగా స్పందించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. 2025లో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు.'ఈ సంవత్సరం మొత్తం చాలా దురదృష్టకరంగా సాగింది. గతేడాది మే 3 నుంచి నేటి వరకు రాష్ట్రంలోని పరిణామాల విషయంలో ప్రజలకు నేను క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను. చాలా మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు. ఇళ్లను కోల్పోయారు. అందుకు నేను చింతిస్తున్నాను. క్షమాపణలు కోరుతున్నాను. అయితే గత నాలుగు నెలలుగా శాంతి భద్రతల పురోగతిని చూసిన తర్వాత 2025 నాటికి రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని నేను భావిస్తున్నాను' అని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటి వరకూ జరిగిన తప్పులను క్షమించి.. మణిపూర్‌లోని 35 తెగలు కలిసి సామరస్యంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు.ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత మే నెలలో చెలరేగిన ఘర్షణలు యావత్ దేశాన్ని కలవరపరిచాయి. మైతీలకు రిజర్వేషన్ల అంశంపై కుకీలు, మైతీల మధ్య చిచ్చు రేగింది. రెండు జాతుల మధ్య వైరం హింసాత్మకంగా మారింది. ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. పార్లమెంట్‌ను కూడా ఈ అంశం కుదిపేసింది. ఈ హింసాత్మక ఘటనల్లో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మందికిపైగా నివాసాలను కోల్పోయారు.

# విమానంలో ఏ సీటు సురక్షితం?



న్యూఢిల్లీ-నవభూమి:గత వారం కజకిస్థాన్, దక్షిణ కొరియాలో జరిగిన ఘోర విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై సర్వత్రా ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ రెండు విమాన దుర్ఘటన పరిస్థితులు, కారణాలు, ప్రదేశాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ప్రమా దం నుంచి సురక్షితంగా బయటపడిన వారి విషయంలో మాత్రం ఒక అంశం పోలి ఉంది.

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ వి మానం వెనుకభాగంలో కూర్చున్న ప్రయాణికులను సహాయక సిబ్బంది రక్షించగా దక్షిణ కొరియా విమాన దుర్ఘటనలో కూడా విమానం వెనుక భాగంలో కూర్చున్న ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. గతంలో జరిగిన విమాన ప్రమాదాలను విశ్లేషించి చూస్తే విమానం ముందు భాగంలో ఉన్న సీట్ల కన్నా వెనుకభాగంలో ఉన్న సీట్లే సురక్షితమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**వెనుక సీట్లే బెటర్?**

1971 నుంచి 2005 మధ్య జరిగిన విమాన ప్రమాదాలను అమెరికాకు చెందిన ఏవియేషన్ డిజాస్టర్ లాకు సంబంధించిన పాపుల్ మెకానిక్స్ మ్యాగజైన్ అధ్యయనం చేసి ఒక నివేదికను తయారుచేసింది. విమానంలోని వెనుక భాగంలో ఉండే సీట్లే అత్య ంత సురక్షితమని ఈ అధ్యయనంలో తేలిం ది. విమానం ముందు భాగంలోని సీట్లలో కూర్చునే ప్రయాణికుల కన్నా వెనుక భాగంలోని సీట్లలోని ప్రయాణికులకే ప్రమాదాల సమయంలో బతికే అవకాశాలు 40 శాతం అధికమని ఈ అధ్యయనం పేర్కొంది. ఇదే అంశంపై అధ్యయనం చేసిన బ్రిటిష్ జర్నలిస్టు మ్యాక్స్ ఫాస్టర్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు విడుదల చేసిన నివేదికను ఉటంకిస్తూ అనేక విమాన ప్రమాదాలను అధ్యయనం చేసి తయారుచేసిన ఈ నివేదిక ప్రకారం విమానం ముందు భాగంలో కూర్చున్న ప్రయాణికులు బతికే అవకాశం 49 శాతం మాత్రమే ఉంటుందని ఫాస్టర్ పేర్కొన్నారు. విమానం మధ్య లో కూర్చున్న వారికి బతికే అవకాశాలు 59 శాతం ఉంటాయని అదే విమానం వెనుక భాగంలో కూర్చునే ప్రయాణికులకు బతికే అవకాశాలు 69 శాతం ఉంటాయని ఆయన తెలిపారు. దీన్ని బట్టి చూస్తే ఎక్కువ రేట్ల కన్నా తక్కువ రేట్లకు దొరికే సీట్లే సురక్షితమని అర్థమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరికొన్ని అధ్యయనాలు ఇలా..1989లో జరిగిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రమాదం విషయానికి వస్తే విమానంలో మొత్తం 269 మంది ప్రయాణికులుండగా అందులో 184 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో ఎక్కువ మంది ఫస్ట్ క్లాస్ వెనుక సీట్లలో కూర్చున్నవారే కావడం గమనార్హం. 2015లో జరిపిన ఓ అధ్యయనం ప్రకారం విమానం వెనుక భాగంలోని మధ్య సీట్లే అత్యంత సురక్షితం. ప్రమాదాల సందర్భంగా ఈ సీట్లలో కూర్చున్నవారు మరణించే అవకాశాలు కేవలం 28% మాత్రమేనని ఈ అధ్యయనం పేర్కొంది.

రెండవ సురక్షిత సీట్లు విమానం మధ్యలోనివని, ఇక్కడ కూర్చున్నవారు మరణించే అవకాశాలు 44 శాతం మాత్రమేనని పేర్కొంది. అయితే చాలా విమానాలలో విమానం రెక్కలను ఇంధన ట్యాంకులుగా ఉపయోగించుకుంటున్నందున రెక్కలు పేలిపోయే అవకాశాలు అధికంగా ఉంటాయి కాబట్టి మధ్యలో ఉండే సీట్లు కూడా సురక్షితం కావని మరి కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

# గతాన్ని మర్చిపోయి నన్ను క్షమించండి..

## మణిపూర్ సీఎం అభ్యర్థన



న్యూఢిల్లీ-నవభూమి:2023 మే నెల నుంచి మణిపూర్‌లో జరుగుతున్న జాతి హింసపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించారు. గతంలో జరిగిన అన్నింటినీ మర్చిపోతూ ప్రజలు తనను క్షమించాలని కోరారు. ఇంఫాల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హింసాకాండను నిర్వహించడంపై ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణ జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది చాలా దురదృష్టకరంగా గడిచిందని సీఎం బిరేన్ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది మే 3వ తేదీ నుంచి నేటి వరకు జరుగుతున్న హింసాకాండకు ప్రజలకు క్షమాపణ తెలియజేయాలనుకుంటున్నట్లు వివరించారు.

ఈ హింసాకాండ వల్ల అనేక మంది తమ ప్రియమైన వారిని కోల్పోయారని, మరికొందరు తమ ఇళ్లు వదిలిపెట్టి మరీ వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే ఈ అల్లర్లలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. దీనంతటికీ తాను చింతిస్తున్నట్లు సీఎం బిరేన్ సింగ్ వివరించారు. అయితే గత మూడు, నాలుగు నెలలుగా రాష్ట్రంలో శాంతి, భద్రతలు ఓ కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. 2023 మే 3వ తేదీ నుంచి కుకీ, మైతేయిల మధ్య ఘర్షణలు చెలరేగగా.. ఈ హింసాకాండలో మొత్తం 200 మందికి పైగా చనిపోయినట్లు సీఎం బిరేన్ సింగ్ తెలిపారు. అలాగే నిరాశ్రయులైన 2 వేల 58 మంది కుటుంబాలను ఇంఫాల్‌లోని పలు ప్రాంతాల్లో పునరావాసం కల్పించినట్లు చెప్పుకొచ్చారు. ముఖ్యంగా జాతీయ రహదారుల వెంట హింసను రికట్టేందుకు %చీఎ-2, చీఎ%-37 లపై వరుసగా అదనపు భద్రతా సిబ్బందిని ఉంచినట్లు పేర్కొన్నారు. నిరసనకారులు ప్రభుత్వం నుంచి దోచుకున్న 6 వేల ఆయుధాల నుంచి 3 వేల ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. అలాగే 625 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు.. మొత్తం 12 వేల 247 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.అంతేకాకుండా మణిపూర్ ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ను 32 నుంచి 39 శాతానికి పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ ప్రకటించారు. అలాగే వివిధ పథకాల ద్వారా హింసాకాండలో ప్రభావితమైన నిర్వాసితులకు సాయం చేసేందుకు తమ సర్కారు ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. నివాసితులపై ప్రభావం చూపుతున్న అధిక విమాన ఛార్జీలను తగ్గించేందుకు పలు సేవలు ప్రారంభించినట్లు వివరించారు. ముఖ్యంగా విమాన ఛార్జీలు రూ.5 వేలు దాటితే మణిపూర్ ప్రభుత్వం ప్రయాణికులకు రాయితీలు కల్పిస్తుందని అన్నారు. ఇంఫాల్-గౌహతి, ఇంఫాల్-కోల్ కతా, ఇంఫాల్-దిమాపూర్ మార్గాల్లో వారానికి రెండుసార్లు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
బుధవారం
01 । జనవరి । 2025





## కొత్త ఏడాదిలో కొత్త నిబంధనలు.. ఏం మారుతున్నాయంటే?

**న్యూఢిల్లీ-నవభూమి:** ఫీచర్ ఫోన్లలో ఇప్పటివరకు ఉన్న 'యూపీఐ 123పే' చెల్లింపుల పరిమితిని కేంద్రం పెంచింది. రూ.5 వేల నుంచి రూ.10వేలకు యూపీఐ 123పే ద్వారా లావాదేవీలు జరపవచ్చు.రైతు రుణాలు : ఎలాంటి గ్యారెంటీ చూపకుండా రూ.2లక్షల వరకు రైతులు బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవచ్చునని ఆర్బీఐ తెలిపింది. జనవరి 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి.మూడు రకాల బ్యాంకు ఖాతాలు మూసివేత: మూడు రకాల బ్యాంకు ఖాతాలకు బ్యాంక్ సేవల్ని వెంటనే ఆపేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఎక్కువ కాలంపాటు 'జీరో బ్యాలెన్స్' కలిగివుంటే.. ఆ ఖాతాలను నిలిపివేయనున్నది. రెండేండ్లు అంతకన్నా ఎక్కువ కాలంపాటు లావాదేవీలూ లేని బ్యాంక్ ఖాతాల్ని కూడా నిలిపివేస్తున్నది. 'ఇనాక్టివ్ అకౌంట్స్'గా నిర్ధారించిన బ్యాంక్ ఖాతాల్ని మూసివేసే అవకాశముందని తెలిపింది.ఏటీఎం నుంచి పీఎఫ్ సొమ్ము : ఈపీఎఫ్‌వోలోని 7 కోట్ల సభ్యులకు కొత్త ఏడాదిలో కొత్త సదుపాయం అందుబాటులోకి రాబోతున్నది. తమ ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) సొమ్మును 'డెబిట్ కార్డు' (ఏటీఎం)తో విత్‌డ్రా చేసుకోవచ్చునని కేంద్ర కార్మికశాఖ ఇప్పటికే ప్రకటించింది. అయితే దేశవ్యాప్తంగా ఈ సేవలు ఎంతమేరకు అందుబాటులోకి వస్తాయన్న దానిపై స్పష్టత లేదు. అలాగే సభ్యుల పెన్షన్ చెల్లింపులను మరింత సులభతరం చేస్తున్నట్టు కేంద్రం తెలిపింది. అదనంగా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండానే ఏ బ్యాంక్ నుంచైనా ఈపీఎఫ్‌వో పెన్షన్‌ను సభ్యులు పొందే సదుపాయం తీసుకొస్తున్నట్టు ప్రకటించింది.



## జనభాషలో తీర్పులే న్యాయం!

న్యాయం చెయ్యడమే కాదు, చేస్తున్నట్లూ కనిపించాలన్నది సమున్నత న్యాయసూత్రం. కాలానుగుణ సంస్కరణలకు నోచక, కొందరు న్యాయమూర్తులే లోగడ చెప్పినట్లు ఇంకా ఎడ్లబండి కాలంలోనే ఉన్న న్యాయపాలికలో- కక్షిదారులకు అర్థంకాని భాషలో సాగే వాదోపవాద విన్యాసాలు న్యాయార్థుల్ని ఏ దరికి చేరుస్తున్నాయన్నది అగమ్యగోచరం! సర్వోన్నత, ఉన్నత న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల కొండలు కొద్దిగా కరుగుతుంటే, దిగువకోర్టుల్లో వాటి తాకిడి పెరుగుతోందని సర్కారీ లెక్కలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, 'సుప్రీం' ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాలు వెలువరించిన సూచనలు, హితోక్తులు ఎంతో విలువైనవి. ప్రజలకోసం న్యాయస్థానాలున్నాయిగాని, కోర్టులకోసం ప్రజలు కాదన్నదే న్యాయపాలిక సేవాగుణ మౌలిక లక్షణం కావాలని భారత ప్రధాన న్యాయమూర్తి ఉద్బోధించారు. అందుకు అనుగుణంగా- కక్షిదారులకు తెలిసిన, అర్థమయ్యే భాషలోనే హైకోర్టుల తీర్పులు ఉండాల్సిన అవసరాన్ని ప్రథమ పౌరుడు రామ్‌నాథ్ కోవింద్ నొక్కి చెప్పారు! దేశవ్యాప్తంగా 24 ఉన్నత న్యాయస్థానాలున్నాయి. వాటిలో న్యాయ విచారణ ప్రక్రియ కక్షిదారులకు అవగతం కాని ఆంగ్లభాషలోనే సాగుతుండటంపట్ల దశాబ్దాలుగా వాద వివాదాలు రేగుతున్నాయి. పూర్వాశ్రమంలో న్యాయవాదిగా ఆ సమస్య లోతుపాతులు తెలిసిన కోవింద్- కనీసం తీర్పుల సారం కక్షిదారులకు అవగాహనకు వచ్చేలా వారి వారి భాషల్లో ఆయా న్యాయ నిర్ణయాల అనువాద ధ్రువీకృత ప్రతుల్ని అందించే యంత్రాంగం ఏర్పాటు కావాలని సూచిస్తున్నారు! అంతవరకు అది బాగానే ఉన్నా- ఆయా రాష్ట్రాల పరిధిలోని దిగువ కోర్టుల్లో స్థానిక భాషల్లో న్యాయ విచారణ ప్రక్రియ ఇంకా అమలుకాకపోవడం ఏమిటి? తాము వెళ్లబోసుకొనే గోడు ధర్మపీఠాల దృష్టికి సజావుగా చేరుతోందో లేదో తెలియక, విచారణ ప్రక్రియలో, తీర్పుల్లో ఆంగ్ల భాష అర్థంకాక కక్షిదారులు పడే వేదనకు దశాబ్దాలుగా పరిష్కారం ఏదీ?

సామాన్యుడు సైతం తన కేసును తానే వాదించుకొని సరైన పరిష్కారం పొందగల న్యాయవ్యవస్థ ఉండాలని పూజ్య బాపూజీ ఆకాంక్షించారు. వివాద పరిష్కారంకోసం బక్క రైతు బస్తీకి వెళ్ళి కొన్ని వారాల పాటు బస చేయాల్సిన పరిస్థితి రాకూడదని గాంధీజీ అభిలషించినా- పలుపు కోసం కోర్టుకెక్కి బర్రెను అమ్ముకొనే దుస్థితి దాపురించిందిప్పుడు! తమ తరఫున నల్లకోటు వకీళ్లు తమకే మాత్రం తెలియని భాషలో ఏం వాదిస్తున్నారో గుడ్లప్పగించి చూడటమేగాని, తమ గుండె ఘోష వాళ్ల గళాల్లో పలుకుతున్నదీ లేనిదీ తెలుసుకోగల అవకాశం కోట్లాది కక్షిదారులకు లేదు. రాజ్యాంగంలోని 348 అధికరణ సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఆంగ్ల భాషే చెల్లుబాటు కావాలని తీర్మానించింది. ఆయా హైకోర్టుల్లో ప్రాంతీయ భాషల వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వచ్చే వినతుల్ని ఆమోదించరాదని సర్వోన్నత న్యాయపాలిక 1997, 1999, 2012లో గట్టిగా నిర్ణయించింది. కోర్టుల తీర్పుల్ని హిందీతోపాటు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యులులో పొందుపరచిన భాషల్లో తర్జుమా చేసి అందుబాటులో ఉంచాలన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2015 డిసెంబరులో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కోర్టుల భాష ఆంగ్లమేనంటూ 'సుప్రీం' గట్టిగా స్పష్టీకరించిన నేపథ్యంలో- రాష్ట్రపతి తాజా సూచనకు ఏ పాటి మన్నన దక్కుతుందో చూడాలి. అంతకు మించి, దిగువ కోర్టుల్లో ఆంగ్లభాష వినియోగాన్ని కక్షిదారులపట్ల క్రూర పరిహాసంగానే సంభావించాలి! సూటిగా సరళంగా స్పష్టంగా ఉండాల్సిన తీర్పులు ఆంగ్ల భాషా పటాటోప ప్రదర్శనగా నివ్వెరపరుస్తున్నాయంటూ మొన్న మే నెలలో వెలుగు చూసిన వార్తాకథనాలు- నాణేనికి ఒక పార్శ్వం. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో పోగుపడిన రెండుకోట్ల 68 లక్షల కేసుల్లో స్థానిక భాషల్లో విచారణ జరిగినప్పుడే కక్షిదారులకు దక్కుతుంది- పారదర్శక న్యాయం!

'అసలు న్యాయస్థానాల్లో వాదనలు, ఇతర కార్యకలాపాలు ఆంగ్లంలో కొనసాగడం ఏమిటి? ఇంకా ఎంతకాలం ఈ దారుణం?'- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జీఎస్ సింఘ్వి 2006లో వ్యక్తీకరించిన ధర్మాగ్రహమది! జిల్లా సెషన్స్ కోర్టు, అంతకు దిగువనున్న న్యాయాలయాల్లో స్థానిక భాషలోనే తీర్పులు వెలువడాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 1974లోనే ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాల జారీతోనే తన బాధ్యత తీరిపోయిందని భావించిన ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి నిదర్శనగా, న్యాయాలయాల్లో ఆశ్రితులకు అర్థంకాని ఆంగ్లమే నేటికీ రాజ్యమేలుతోంది. తెలుగు గడ్డపై తెలుగులో న్యాయపాలనకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని, న్యాయ పదకోశాలు, న్యాయ శాస్త్ర గ్రంథాలు, చట్టాలను అనువదించడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉందని 2013 ఫిబ్రవరిలో ప్రధాన న్యాయమూర్తిగా పినాక చంద్రఘోష్ ప్రకటించారు. దాదాపు అదే సమయంలో- స్థానిక న్యాయస్థానాల్లో తెలుగు వెలుగులీనేలా చేయడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులున్నాయన్న జస్టిస్ ఎన్.వి.రమణ- తెలుగులో న్యాయ పదకోశం సరిగా అందుబాటులో లేకపోవడం వాటిలో ఒకటంటూ రాష్ట్ర న్యాయ అకాడమీ అధ్యక్షులుగా తనవంతు ప్రయత్నం చేశారు. రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణాల్లో సామాన్య జన భాషలోనే తీర్పులుంటాయంటున్నప్పుడు ఆ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలూ వెనుకబడటం ఏమిటి? న్యాయపాలన క్రతువు తేట తెనుగులో సాగితే పారదర్శకత ఇనుమడించి కేసుల సత్వర పరిష్కారమూ సాధ్యపడుతుంది. మాతృభాషకు మంగళారతులు పడతామంటున్న ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలూ దిగువ కోర్టుల్లో తెలుగు వెలుగుకు దివిటీలు పట్టే కార్యాచరణను సత్వరం పట్టాలకెక్కించాలి!

# నిన్న మిత్రుడు! నేడు శత్రువు!!

## కామ్రేడ్స్‌లో కనిపిస్తున్న వింత పోకడలు



మానవత్వం మంటగలుస్తుందో, సాటి మనిషి అసలు మనిషి లాగా కనిపిస్తున్నాడో లేదో, అంతా తమకే తెలుసని అనుకుంటున్నారో ఏమో! లేక మానసిక పరిపక్వత దిగజారుతోందో, లేదా ఈగో అడ్డం వస్తుందో ఏమో తెలియదు గానీ, కామ్రేడ్స్, అదే మన ఎర్రజెండా అన్నల్లో వింత వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నదని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నిన్న మొన్నటి వరకు చెట్టపట్టాలేసుకుని తిరిగిన మిత్రుడు (స్నేహితుడు) కాస్తా తెల్లారేసరికి శత్రువుగా, అపరిచిత వ్యక్తి లాగా కనిపిస్తున్నాడు. నిన్న సాయంత్రం కలిసి తాగిన చాయ్, ఈరోజు విషంగా అనిపిస్తుంది. ఈ గమ్మత్తైన, వింతైన పోకడల వెనుక ఏమైనా కారణాలు ఉన్నాయా అంటే, సమాధానమే దొరకని వాస్తవ స్థితి. అదంతే. కట్ చేస్తే, ఒక్కసారి రెండు దశాబ్దాల వెనక్కు వెళదాం. సిపిఐ (ఎంఎల్) పార్టీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. నాటి



నుంచి నేటి వరకు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ క్రమంలో ఎంఎల్ పార్టీ వర్గాలుగా విడిపోవడం, కొత్తగా పార్టీలు ఏర్పాటు కావడం, గ్రూపులుగా చీలిపోవడం జరుగుతూ వస్తోంది. తిరిగి విడిపోయిన గ్రూపులు కానీ, వర్గాలు కానీ, ఒకటిగా కలిసిపోయి పనిచేస్తున్న క్రమాన్ని కూడా ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అలా కలిసి ఉన్నప్పుడు పార్టీల అగ్రనాయకత్వం నుంచి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, పార్టీ కార్యక్రమాలు కలిసి నిర్వహించేవారు. ప్రదర్శనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసనలు, భారీగానే చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పోడు భూములకు పట్టాల సాధన, కరెంటు చార్జీలు, నిత్యావసర ధరల పెరుగుదల, ఇలా అనేక సమస్యల మీద అలుపులేని పోరు సలిపారు. అప్పుడు వారి మధ్య ఎలాంటి విభేదాలు కనిపించేవి కావు. ఒకరినొకరు గౌరవించుకునేవారు. ఆప్యాయంగా పలకరించుకునేవారు. కలిసి టీలు, కాఫీలు తాగారు. భోజనాలు చేసేవారు. కలిసి ప్రయాణించేవారు. ఇలా సాగుతున్న నేపథ్యంలో సిద్ధాంతాల పరంగానో, మరే ఇతర కారణాలతోనో పార్టీ గ్రూపులుగా విడివడింది. అలా ఎందుకు విడివడుతోందో మనకు ఇక్కడ అప్రస్తుతం. ఇప్పుడు తిరిగి అసలు విషయంలోకి వద్దాం. విడిపోయిన తరువాత ఒకరినొకరు శత్రువుగా, అపరిచిత వ్యక్తులుగా, అసలు పరిచయం లేని వారిగా మారిపోతున్నారు. నిన్న మొన్నటి సాటి కామ్రేడ్ అన్న కాస్త, ఈరోజు శత్రువుగా మారిపోతున్నాడు. అతని మీద ఆరోపణలు, విమర్శలు చేయడం, నిందలు వేయడం, ఎదురుపడినా పలకరించకపోవడం, సీరియస్ గా చూడడం తదితర అవలక్షణాలు వ్యక్తమవుతున్నాయని పౌర సమాజం స్పష్టంగా పేర్కొంటుంది. ప్రధానంగా ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఇలాంటి వింత వైఖరి కనిపిస్తోందని వారు విశ్లేషిస్తున్నారు. కామ్రేడ్, అన్నలకు సమాజంలో ఒక ప్రత్యేకమైన ఆరాధన భావం, నమ్మకం, విశ్వాసం, అచంచలమైన సదభిప్రాయం ఉంది. సమాజ నిర్దేశకులు, పోరాటయోధులు, త్యాగాల గుర్తులుగా జనం గుండెల్లో నిలిచి ఉన్నారు. ఇంతటి మహోన్నతమైన స్థానంలో ఉండి, అలా ప్రవర్తించడంతో కామ్రేడ్ల పట్ల సమాజంలో కాస్త చిన్న చూపు వ్యక్తం అవుతుంది. విడిపోయిన తర్వాత ఎవరి సిద్ధాంతాలు వారివి, ఎవరి పార్టీ లైన్ వారిది. దాని ప్రకారం తమ పనులు తాము చేసుకుంటే సరిపోతుంది కదా! సహజమైన మానవ స్వభావం ప్రకారం, అందరితో మాట్లాడ మాట్లాడుకునే విధంగానే, విడిపోయిన వారితో కూడా ఎందుకు మాట్లాడకూడదు? విభేదాలు దేనికి? శత్రుత్వం ఎందుకు? అపరిచితుల్లా మారిపోవడం అవసరమా! ఏమో నేటి శత్రువు కాస్త రేపు మిత్రుడు కావచ్చు కదా కామ్రేడ్స్! ఆలోచించండి.

### ఆత్మగౌరవం కోసం బానిసత్వం పై తిరుగుబాటు

# బీమా కోరేగాం విజయోత్సవం



**- దేశమంతట 207 వ శౌర్య దివస్ విజయోత్సవం**
**- జనవరి 1న అమరవీరులకు ఘన నివాళి**
**- రోజు రోజుకు ప్రజా ఆదరణ పొందుతున్న బీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలు**











ప్రపంచ చరిత్రలో ఎక్కడైనా బానిసత్వం, వివక్షత పై ఎప్పుడు కూడా తిరుగుబాట్లు పోరాటం ద్వారానే విజయాలు సాధించి ఆత్మగౌరవం ఆత్మస్థైర్యాన్ని వ్యక్తి - ప్రాంత అస్తిత్వాలను నిలుపుకున్న ఘటనలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఒక దేశంలో ఒక ప్రాంతంలో రాజులుగా పరిపాలన చేసిన వారిని రకరకాల కారణాలు చెప్పి బానిసలుగా చేసి సమాజానికి గ్రామాలకు దూరంగా ఉంచి అస్పృశ్యులుగా చిత్రీకరించి వారి నీడను పాద ధూళిని కూడా తాకనివ్వకుండా అంటరాని వాళ్ళుగా చిత్రీకరించి రకరకాల వివక్షలకు గురిచేసి వేధించిన వారి పై తిరుగుబాటు తో చేసి విజయం సాధించిన చరిత్ర భారతదేశంలో జరిగింది. భారతదేశాన్ని పరాయి పాలకులైన ఆర్యా బ్రాహ్మణులు, తురకలు, సుల్తానులు , బ్రిటిష్ వారు , డచ్ ఇతర విదేశీయులు రకరకాలుగా దాడులు చేసి మూలభారతీయులను అంటరాని వారిగా చేసి పరిపాలన సాగించారు . 1757 లో ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలకు బెంగాల్ నవాబ్ సిరాజుద్దీన్ దౌలా సైన్యాలకు మధ్య యుద్ధం జరిగింది . యుద్ధంలో బ్రిటిష్ దళాలు గెలిచాయి చరిత్రలో దీనికి ప్లాసీ యుద్ధం అని పేరు పెట్టారు. దేశంలో చివరిసారి పరాయి పాలనలో 1818 లో జరిగింది ఇదే బీమా కోరేగావ్ యుద్ధం . ఈ యుద్ధంలో మొరాట్వాడ పీష్వా బ్రాహ్మణుల సామ్రాజ్యం ధ్వంస చేసి బ్రిటిష్ సామ్రాజ్యం స్థాపించబడింది . 1757 నుండి 1818 మధ్యకాలంలో దుస్సాద్ ల నుండి మహర్ సైనికుల వరకు అందరూ మూల భారతీయుల సహాయం తోటి తమ తమ రాజ్యాలను స్థాపించారు. మూలభారతీయులు అంటరాని వారిగా ఆర్య బ్రాహ్మణులు వారి మనువాద సిద్ధాంతంతో దూరం ఉంచటంతో మూలభారతీయుల ఆత్మ గౌరవం కోసం ఆయా ప్రాంతాల్లో సైన్యంలో చేరారు. చరిత్రకారులు తెలిపిన ఆధారాల ప్రకారం నాటి అఖండ భారత దేశంలోని మహారాష్ట్రలో జరిగిన ఈ ఘటన భీమా కోరేగావ్ మహర్ సైనికుల వీర చరిత్ర విజయ దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 1 న బీమా కోరేగాం ప్రాంతంలో ఘనంగా నిర్వహించి యుద్ధంలో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించి వారి త్యాగాల చరిత్రను కథలు కథలుగా వివరించి ప్రజాక్షేత్రంలో తెలుపుతున్నారు. చరిత్రకారుల కథనం ప్రకారం భారతదేశాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ పేరు మీద బ్రిటిష్ తెల్లదొరలు పరిపాలిస్తున్న రోజుల్లో ముంబై రెసిడెన్స్ లోని బీమా కోరేగాం ప్రాంతంలో పీష్వాల ఆధీనంలో ఉన్న ప్రాంతాన్ని బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకోవాలని పథకం వేశారు. భారతదేశంలో అప్పటికే మూలవాసుల పరిపాలన పోయి దేశంలోని రకరకాల ప్రాంతాల్లో నవాబుల పరిపాలనకు వెళ్ళింది.ఆధిపత్య పోరులో భాగంగా ఒకరి పై ఒకరు దాడులు చేసుకొని దాడులకు మద్దతుగా ముస్లిం రాజుల సహాయం తీసుకొని మూలవాసులందరినీ బానిసలుగా మార్చి వేశారు. పిష్వాల స్వాధీనంలో ఉన్న ప్రాంతంలో కూడా అణగారిన వర్గాలను గ్రామాలలోకి రాకుండా వివక్షత చూపి వారి కాళ్ల దూలి వాలే తుడుచుకునే విధంగా చీపురు వారి నోటి నుంచి వచ్చే ఉమ్మి ని కూడా వారే మూతికి ముంత లో వేసుకోవాలని వారు నడిచే ప్రాంతాన్ని వారే శుభ్రం చేసుకోవాలని రకరకాల బానిస నిబంధన విధించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసి వేధిస్తున్నారు. అదే సమయంలో బ్రిటిష్ వారు వివక్షతను గుర్తించి మూలవాసులను అంటరాని వారిని బ్రిటిష్ సైన్యంలో చేర్చుకోవడం ప్రారంభించారు. అందులో భాగంగా ఏర్పడింది " మహర్ రెజిమెంట్ " పూనాకు సమీపంలోని భీమా నది అంచున ఉన్న కోరే గ్రామం పీష్వాల ప్రాంతాన్ని బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకోవాలంటే మహర్ రే జి మెంట్ తోటే సాధ్యమవుతుందని ముందే గ్రహించారు. బ్రిటిష్ వారు 28 డిసెంబర్ 1817 న పీష్వాలపై యుద్ధానికి పంపింది. మహర్ రే జి మెంట్ లో ఉన్న మహర్లు పీష్వాలు చేస్తున్న దాష్టికాల పైన దాడి చేసి ఆత్మగౌరవం నిలుపుకోవాలని అవకాశం కోసం ఎదురు చూశారు. బ్రిటిష్ ఆదేశాలతో 46 కిలోమీటర్లు వర్షంలో ఏకధాటిగా నడిచి భీమా నది దాటుకొని కేవలం 500 మంది మహర్ రెజిమెంట్ సైనికులు 12 గంటల సమయంలో 28 వేల మంది సైన్యం ఉన్న పీష్వా రాజులపై వీరోచితంగా పోరాడి సైనికులు అందర్నీ వదించి 1 జనవరి 1818 న విజయం సాధించారు . భీమా నది ఒడ్డున కోరేగాంలో జరిగిన పోరాట చరిత్రను తెలుసుకున్న . డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తాను కూడా స్వయంగా ప్రతి సంవత్సరం జనవరి ఒకటి న బీమా కోరేగాం యుద్ధం అమరుల కు స్తూపం వద్ద నివాళులర్పించే వారు. దీంతో బీమా కోరేగావ్ విజయోత్సవ చరిత్ర ప్రచారంలో కొచ్చింది. ఆయన మహర్ రేజి మెంట్ గొప్పతనాన్ని అనేక సందర్భాలు వివరించారు. 1919లో సైమన్ కమిషన్ భారతదేశాన్ని పర్యటించిన సందర్భంగా కూడా ఆయన స్వయంగా సైమన్ కమిషన్ కలిసి అప్పటికే నిలిపి వేసిన మహర్ రేజిమెంట్ ను తిరిగి ప్రారంభించి మహర్ జాతి కులస్తులకు అవకాశాలు ఇయ్యాలని అభ్యర్థించారు. అంబేద్కర్ అభ్యర్థన మేరకు బ్రిటిష్ ఇండియా మిలిటరీలో మహర్ రేంజ్ మెంట్ ని ఏర్పాటు చేశారు. నేటికీ మన ఇండియన్ ఆర్మీలో కొనసాగుతుంది. నాటి నుండి సుమారు 2006 సంవత్సరాలుగా ప్రతి ఏటా బీమా కోరేగావ్ విజయోత్సవం శౌర్య దివస్ గా నేటికీ జరుపుకుంటున్నారు. బానిసత్వంతో కొందరు ఆందోళన చెందుతుంటే, మనిషికి మనిషిని మధ్య రకరకాల ఆంక్షలు సృష్టించి వేధించి నా వారిపై తిరుగుబాటు బాహుట ఎదిరించి అతి తక్కువ సైన్యంతో ఎక్కువమంది ఉన్న సైనికులను ఓడించిన ఘన చరిత్ర నేటికీ విజయోత్సవ దినంగా జరుపుకుంటున్నారు.

**అస శ్రీరాములు,**
**సీనియర్ జర్నలిస్ట్**

# 'సినిమా సంస్కరణ'లకు సరైన సమయం ఇదే



ఏదైనా ఒక సామాజిక సమస్య ఏర్పడ్డప్పుడు దానిపై ప్రజలు మాట్లాడుతారు, విభిన్న కోణాలలో చర్చిస్తారు. ఇలాంటి సమయంలో వార్తాపత్రికలలో, సామాజిక మాధ్యమాలలో, టి.వి లాంటి ప్రసార సాధనాలలో ఆ సమస్య కొన్నాళ్లు నలుగుతుంది. ఇక్కడ రెండు రకాలుగా ఆ సమస్య సమాజం నుండి మాయమవుతుంది. ఒకటి సమస్యకు తగిన పరిష్కారం దొరకడం, రెండు పరిష్కారం లభించకుండానే నీరుగారిపోవడం. ఇప్పుడు ఎందుకు ఈ ప్రస్తావన అంటే ఈ మధ్యన 'పుష్ప 2' సినిమా అనేక రకాలుగా హల్చల్ చేస్తూనే ఉంది. ఈ సినిమా 'బెనిఫిట్ షో'లో జరిగిన సంఘటనలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో చేసిన ప్రసంగం నిజంగా ' నిజాలు ' ను ప్రతిబింబించింది. ఇటువంటి తరుణంలోనే తెలుగు 'సినిమా' సమస్యలకు పరిష్కారం వెతకవలసిన బాధ్యత ఇటు సమాజం, అటు ప్రభుత్వాలపైన ఉంది.

**తెలుగు సినిమా ప్రత్యేకతలు:**

దేశ వ్యాప్తంగా మన తెలుగు సినిమాకు ప్రత్యేకత ఉంది. సామాజిక దురాచారాలను అంతమొందించే చిత్రాలను రూపొందించిన ఘన చరిత్ర మన తెలుగు సినిమాది. తెలుగువాడి 'వాడిని, వేడిని ' తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ స్థాయిలో ఇనుమడింపజేసే మహానటుడు నందమూరి తారకరామారావు లాంటి వారిని అందించింది. అనేక పేరుపొందిన నటులను, దర్శకులను, స్వరకర్తలను, గాయకులను, రచయితలను, అనేక సాంకేతిక నిపుణులను పరిచయం చేసిన చరిత మన తెలుగు సినిమాదే. ఇప్పటికీ ఆ పేరు ఉంది. కానీ కొన్ని సినిమాలు చేసే ' సిత్రాల ' మూలాన ఆ చరిత్ర కొంచెం మసకబారే పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి తరుణంలో తెలుగు సినిమా పేరును నిలబెట్టుకోడానికి సంస్కరణలు చేయవలసిన సమయం ఆసన్నమైంది. మనం అవునన్నా, కాదన్నా సమాజంలో ఉన్న ప్రజలపైనే కాకుండా వివిధ వర్గాలపై, వ్యవస్థలపై సినిమా ప్రభావం మెండుగా ఉంటుంది. అది మంచినా లేదా చెడైనా సరే !

సినిమాలు అవసరమా ?

**ఈ ప్రశ్నకు సమాధానం విలువలుతో సందేశాత్మక**

సినిమాలు అవసరమే! టికెట్ కొనుక్కుని ప్రేక్షకుడు థియేటరకు ఎందుకు వస్తాడు? హాయిగా, సంతోషంగా వినోదాన్ని పొందడానికి! సినిమా ప్రధాన లక్ష్యం ప్రేక్షకులకు విలువలతో కూడిన వినోదాన్ని, ఆనందాన్ని అందించడం. కొన్ని సామాజిక సమస్యలను స్పృశించి ప్రజలలో మార్పు తేవడం. సమాజానికి ' మంచి సందేశాన్ని ' అందించడం. కానీ ప్రస్తుతం వస్తున్న కొన్ని సినిమాలలో వినోదం మాట దేవుడెరుగు ! యువత పెడ త్రోవను పట్టిస్తున్నాయి. ఇప్పుడు సినిమా పక్కా వ్యాపారం. అధిక లాభాలు సంపాదించే ఒక అందమైన బిజినెస్.



వినోదం తక్కువ ! అశ్లీలం ఎక్కువ:ప్రజాస్వామ్య సమాజాలలో ప్రభుత్వ వ్యవస్థలే పట్టుగొమ్మలు. అటువంటి వ్యవస్థలను తప్పుడుగా చూపించే కథాంశంగా ఉండే సినిమాలు వస్తున్నాయి. వీటిలో వాస్తవానికి దూరంగా ఉండే అంశాలు ఉంటున్నాయి. " సినిమాలో హీరో అన్నింటికీ అతీతుడు. ఎంతమందినైనా ఒంటి చేత్తో కొడతాడు. అలా కొడితేనే మరి హీరో ! ఎన్నో వికృత చేష్టలు చేసినా తప్పులేదు. అశ్లీల పదాలు వాడొచ్చు. తప్పుచేసే వ్యక్తులకు న్యాయస్థానాలతో పనిలేకుండా శిక్షిస్తాడు. వీలైతే ఆగ్రహావేశాలతో చంపేస్తాడు. ఇటువంటి చిత్రాలు వలన వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలే ఒక నెగిటివ్ భావనను కలిగిస్తున్నాయి. హీరో పాత్ర సమాజం దృష్టిలో పాజిటివ్గా ఉండాలి. అంతే తప్ప ఒక స్మగ్లర్ని కూడా హీరోగా చూపిస్తే సమాజానికి ఆ సినిమా ఇచ్చే ' సందేశం ' ఏమిటి ? విద్యాపరంగా ఉన్నత స్థానాల్లో ఉండే ఉపాధ్యాయులపై సెటైర్లు, కౌంటర్లు వేస్తూ గురువులను ఒక జోకర్లా చూపించే పాత్రలను మన దర్శకులు సృష్టిస్తున్నారు. ఇదేనా చిత్రాలు గురువులకు ఇచ్చే గౌరవం ! ఇటువంటివి విద్యార్థులు చూసి నిజ జీవితంలో ఆచరించారా ? గురువు మాట వినేదెవరు. ఒక హీరో ( స్మగ్లర్ ) తన తోటి స్మగ్లర్లను జైలు నుండి తీసుకుపోడానికి పోలీస్ స్టేషన్లో ఉన్న పోలీసులను కొంటాడా? ఇది దుర్మార్గమైన చర్య కాదా ? వ్యవస్థలను డబ్బుతో కొనేస్తాడా? ఒక ముఖ్యమంత్రి తనతో కలిపి ఫోటో తీయుంచకోలేదని సియం నే మార్చుతాడా? ఈ చర్యకోసం ఎర్ర చందనాన్ని విదేశాలకు అక్రమంగా తరలించి సంపాదించిన డబ్బును ఉపయోగించడమా ? వారి దృష్టిలో ఒక ప్రజానాయకుడును డబ్బుతో మార్చేస్తారా! వాళ్ళకే తెలియాలి. దేశ చరిత్రలో ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా జరిగిందా?కొన్ని సినిమాలలో జుగుప్సాకరమైన, ద్వంద్వర్థాలు వచ్చే భాషను వాడుతున్నారు. ఇక ప్రతీ సినిమాలలో ఒక ఐటెం సాంగ్ ఉండాలి ! వంటి మీద చాలీ చాలనట్లుగా కురచ దుస్తులుతో మహిళలు నృత్యాలు ! వెనుక కల్లు తాగిన కోతుల్లా సొంగ కార్చుకుంటూ యువత ! నిజ జీవితంలో ఇలాంటివి ఉన్నాయా ? నాయిక వాలకం చూస్తే ఫుల్ఎక్స్పోజింగ్ (అశ్లీలత) ! ఇది మహిళలను అవమానించడం కాదా ! కించపరచడం కాదా ! ' శృంగార నైషధం ' కావ్యాన్ని రచించిన శ్రీనాథుడు ఇప్పుడు ఉండి ఉంటే ఏమి చేసే వారో ?..విద్యార్థులు మద్యపానం త్రాగినా తప్పు లేదు అన్న భావంతో కొన్ని సీన్స్ ఉంటున్నాయి. 'మద్యపానం సేవించడం పొగత్రాగడం హానికరం' అని ఒక వాక్యం చూపించేస్తే సరిపోతుందా ! సినిమాలలో ఇటువంటి అశ్లీల దృశ్యాలు చూసి యువత ఎందుకు పెడతోవపట్టరు? దీనికి కారకులెవరు? అధిక బడ్జెట్ అవసరమా ?..వందల కోట్లు ధనాన్ని వృధా చేసి ఒక చిత్రాన్ని నిర్మించాలా? ఓకే! అది నిర్మాతలు ఇష్టం అనుకుందాం. వారు నష్టపోకుండా ఉండాలంటే కొన్ని వారాలు పాటు సినిమా టికెట్ ధరలు పెంచే వెసులుబాటు కావాలా వారికి ? వచ్చిన లాభాలుతో దేశానికి వీరు ఏమి చేస్తున్నారని రాయితీలు కావాలి ? విలువలతో కూడిన సందేశాత్మక చిత్రాలు తీసే సినిమాలను ప్రోత్సహించడానికి రాయితీలు ఇవ్వడం తప్పు కాదు. అటువంటివాటికి రాయితీలు ఇవ్వాలి కూడా. పెద్ద పెద్ద నిర్మాతలు సిండికేట్ అయి ఒక 'చిన్న సినిమా'లకు కనీసం విడుదల చేసే అవకాశం రాకుండా చేస్తున్నారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు.సినిమా వ్యూహం:సినిమా విడుదలకాక ముందే రకరకాలైన పేర్లతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ షోలలో విడుదల కాబోయే సినిమా గురించి లేనిపోని ఒక కృత్రిమ హైప్ సృష్టిస్తున్నారు. ఫట్ అయిన చిత్రాల్ని కూడా హిట్ చేసే కొన్ని ఏజెన్సీలు ఉన్నాయి. వీరు వివిధ సామాజిక మాధ్యమాల్లో చెత్త సినిమాలకోసం ఊదర కొట్టి కొట్టిమన కర్ణభేరిలకు కన్నాలు పెడుతున్నారు. " ఆహా ! ఓహో ! ఇటువంటి చిత్రం ఇంతవరకు రాలేదు ! గొప్ప స్టోరీ ! హీరో యాక్టింగ్ విరగతీసేసాడు ! " లాంటి పలుకులు పలుకుతూ సామాజిక మాధ్యమాల్లో పనికిరాని దుస్తులు ధరించిన హీరోయిన్ బొమ్మ ఒక అర సెకెను చూపిస్తారు. ఇది వీళ్ళ ట్రిక్. ఇంకా ఒక సినిమాని పార్ట్ 1, పార్ట్ 2 అని విడదీసి రెండుసార్లు ప్రేక్షకులును సినిమాహాళ్ళకు రప్పించి వాళ్ళ జేబులకు చిల్లు వేస్తున్నారు. ఏమీ తెలియని సామాన్యప్రేక్షకులు ఇవి నిజాలని నమ్మి సినిమాలు చూసేస్తున్నారు. సెన్సార్ వాళ్ళు ఈ సినిమాలను చూసి సర్టిఫికేట్ ఇస్తున్నారా? లేక చూడకుండా ఇస్తున్నారా ? అనే సందేహం ఇటువంటి అనైతిక, అశ్లీల సినిమాలను చూసే సామాన్యుడి మెదడులో మెదులుతున్న ప్రశ్న. సంస్కరణలు అవసరం:ప్రభుత్వం, భారీ బడ్జెట్తో తీసిన సినిమాలపై ఎక్కువ శాతం పన్నును ప్రభుత్వం విధించాలి. ఇంకా ఎట్టి పరిస్థితులలో కూడా సినిమా టికెట్ ధరలు పెంచుకోడానికి అవకాశం ఇవ్వకూడదు. ఒక నగరంలో సగం కంటే ఎక్కువ సినిమా హాళ్లలో రిలీజ్ కాకుండా చేసి చిన్న సినిమాలను బ్రతికించాలి. ప్రి రిలీజ్ ఈవెంట్స్ జరిపేటప్పుడు ఏవైనా జరగరాని సంఘటనలు జరిగితే ఆ సినిమా యూనిట్ వారిని బాధ్యులు చేయాలి.

**మార్గదర్శకాలు అవసరం:**

ప్రతీ సినిమా కొన్ని మార్గదర్శకాలను అనుగుణంగాచిత్రీకరించేటట్లుగా ప్రభుత్వాలుఉండేటట్లు చట్టం చేయాలి. అవి 'ఒక చిత్రం వినోదాత్మకంగా ఉండాలి. సమాజానికి కీడు చేసే విధంగా ఉండగూడదు. చట్ట వ్యతిరేక పనులు చేసే వారిని హీరోలుగా చూపించగూడదు.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

5 హైదరాబాద్ బుధవారం 01 । జనవరి । 2025


## చలికి పెరిగే గుండెపోటు ముప్పు



మిగతా కాలాలతో పోలిస్తే, చలి కాలంలో గుండె పోటు ముప్పు 53% పెరుగుతుంది. కుంచించుకుపోయిన రక్తనాళాలతో శరీరానికి వెచ్చదనాన్ని సమకూర్చే క్రమంలో శరీరం ఒత్తిడికి లోనవుతుంది. అంతే కాకుండా ఈ కాలంలో శారీకక శ్రమ కొరవడడం, క్యాలరీలు ఎక్కువ కలిగి ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవడం లాంటి కారణాలు కూడా గుండె పోటు ముప్పును అదనంగా తోడవుతాయి. కాబట్టి ఈ కాలంలో గుండె జబ్బు రోగులు, గుండెను సురక్షితంగా ఉంచుకోవడం కోసం విపరీతమైన చలి నుంచి రక్షణ పొందుతూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకునే ప్రయత్నం చేయాలి. గుండె మీద ఒత్తిడిని నివారించడం కోసం శరీరం వెచ్చబడే, చల్లబడే ప్రక్రియల్లో ఒక క్రమాన్ని పాటించాలి. ఒకేసారి చల్లని వాతావరణంలో నుంచి వేడి వాతావరణంలోకి, లేదా వేడి వాతావరణంలో నుంచి చల్లని వాతావరణంలోకీ వెళ్లకూడదు. అలాగే ఈ కాలంలో దొరికే ఆకుకూరలు, పుల్లని పండ్లు, ఒమేగా3 ఫ్యాట్స్ కలిగి ఉండే వాల్‌నట్స్, అవిసె గింజలు తీసుకోవాలి. నూనెలో వేయించిన అల్పాహారాలు, తీయని పానీయాలు మానేయాలి. రక్తపోటును పరీక్షించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో మెలుగుతూ ఉండాలి. ఛాతీ నొప్పి, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది, విపరీతంగా చమట పట్టడం, అలసట మొదలైన లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

## పిల్లలు గొడవపడుతుంటే..



ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే ఫైటింగ్స్‌కి కొదువుండదు. వాళ్లను సముదాయించడం తల్లిదండ్రులకు రోజూ సవాలుగానే ఉంటుంది. ఈ విషయంలో పేరెంటింగ్ ఎక్స్‌పర్ట్స్ చేస్తున్న సూచనలు ఇవి...

పిల్లలు గొడవపడినప్పుడు “వాళ్లు చూడు ఎంత బాగా కలిసుంటారో, ఎంత బాగా చదువుకుంటారో” అంటూ ఇతర పిల్లలతో ఎప్పుడూ పోల్చవద్దు. ఇంట్లో పిల్లలతో కూడా పోల్చకూడదు.

పిల్లలు ఏ విషయంలో దెబ్బలాడుకుంటున్నారో గమనించాలి. గొడవకు కారణం ఎవరో తెలుసుకోవాలి. ఒక సందర్భంలోనే కాకుండా ఇండివిడ్యువల్ అటెన్షన్ పెట్టి పరిశీలించాలి.

ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే వాళ్లను వేర్వేరుగా కూర్చోబెట్టాలి. ఒకేరూమ్‌లో కూర్చోబెట్టినప్పుడు గొడవ పడటానికి అవకాశం ఉంటుంది.

పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల విషయంలో తరచుగా గొడవపడుతుంటారు. ఒకరివి మరొకరు తీసుకోకుండా పేరెంట్స్ గమనించాలి.

పిల్లలకు ఒకరినొకరు గౌరవించడం నేర్పించాలి. కోపంలో కూడా అగౌరవపరిచేలా తిట్టుకోకూడదని గట్టిగా చెప్పాలి. పిల్లలు కొట్లాడుకునే సమయంలో ఒకరినొకరు తిట్టుకోవడం చూస్తూనే ఉంటాం. అలాంటి మాటలకు ఈ ఇంట్లో చోటు ఉండదు అని చెప్పాలి.

పిల్లలు కలిసి ఆడుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఆడేటప్పుడు వాళ్లను గమనిస్తుండాలి.

కొడితే పిల్లలు మారతారనుకోవడం సరైనది కాదు. కొడితే మరింత కోపానికి గురవుతారు. వారి మధ్య గొడవ పెరగడానికి దారి తీస్తుంది.

పిల్లలకు సెల్ఫ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ గురించి నేర్పించాలి. కోపాన్ని ఎలా హ్యాండిల్ చేయాలో చెప్పాలి. డ్రమ్స్ వాయించడం, పది నుంచి ఒకటి వరకు అంకెలు వెనక్కి కౌంట్ చేయమనడం, సౌండ్ ఎక్కువగా పెట్టి డ్యాన్స్ చేయడం... ఇలాంటి పనుల ద్వారా కోపాన్ని డైవర్ట్ చేసుకొమ్మని చెప్పాలి. ఎంత కోపంగా ఉన్నారో ఒక పేపర్ తీసుకుని షార్ట్ స్టోరీ రాయమనాలి. అంతేకానీ కొట్టడం, గిల్లడం, కొరకడం చేయకూడదని వివరించాలి.

ఇతర పిల్లల ఫీలింగ్స్‌పై కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానభూతి పెంపొందేలా చేయాలి. “బన్నీని చూడు. ఎలా ఏడుస్తున్నాడో... పాపం కదా!” అని కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానుభూతి పెరిగేలా చేయాలి.

రాత్రి డిన్నర్‌ను కుటుంబసభ్యులందరూ కలిసి చేయాలి. ఆ సమయంలో ఆ రోజు ఎవరు ఏం చేశారో తెలుసుకుని అభినందించుకునేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పును తీసుకురావచ్చు.

పిల్లలిద్దరూ గొడవ పడుతున్నా వాళ్లు కిడ్స్ అని తల్లిదండ్రులు గుర్తుపెట్టుకోవాలి. ఏదో ఒక టైంలో ఏ పిల్లవాడైనా తమ సిబ్లింగ్స్ పట్ల కోపంగా వ్యవహరిస్తారు, కొట్లాడతారు. పెద్దవాళ్లు అవుతున్న కొద్దీ వాళ్లలో మార్పు కనిపిస్తుంది.

## పాదాలు పగలకుండా...



శీతాకాలంలో పాదాల పగుళ్లు చాలామందిలో ఎదురయ్యే సమస్య. దీనివల్ల నొప్పిగా ఉండడం, నడవడం ఇబ్బంది కావడమే కాదు... పాదాలు అందవికారంగా కూడా కనిపిస్తాయి. వాతావరణం కారణంగా ఈ సీజన్‌లో కాళ్ళు పొడిబారుతాయి. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే మడమల దగ్గర చర్మానికి పగుళ్ళు వస్తాయి. పాదాలను సరిగ్గా శుభ్రపరుచుకోకపోవడం, వాతావరణంలోని కాలుష్యం, మధుమేహం, సొరియాసిస్, థైరాయిడ్, చర్మ సంబంధమైన సమస్యల వల్ల పాదాలు ఎక్కువగా పగులుతూ ఉంటాయి. మొదట్లోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవచ్చు.



అవేమిటంటే...

పాదాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పొడిబారిన పాదాలపై దుమ్ము పేరుకుపోతే పగుళ్ళు రావడానికి ఆస్కారం ఉంటుంది. అలాగే పగుళ్ళలోకి దుమ్ము వెళితే ఇన్ఫెక్షన్లు రావచ్చు. కాబట్టి పాదాలను తరచూ శుభ్రం చేసుకోవాలి. తడి లేకుండా తుడుచుకోవాలి. సాక్సులు వేసుకుంటే మరింత రక్షణ ఉంటుంది.

నూనె చక్కటి మాయిశ్చరైజర్. పాదాలకు నూనె రాసుకొని, కాసేపు ఉంచాక కడుక్కుంటే, చర్మం పొడిబారకుండా నిరోధించవచ్చు. పగుళ్ళు రాకుండా కాపాడుకోవచ్చు. అలాగే నూనెతో మసాజ్ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

తులసి ఆకులు, వేపాకులను ఫంగస్, బ్యాక్టీరియా నివారిణులుగా పనిచేస్తాయి. వాటిని నూరి ముద్ద చేసి, కాస్త పసుపును కలిపి పాదాలకు రాసుకుంటే... పాదాలూ, మడమలూ మృదువుగా మారుతాయి. అంతేకాదు, పాదాలకు పగుళ్ళు పడి, వాటి నుంచి రక్తం వస్తున్నప్పుడు ఈ మిశ్రమాన్ని ఉపయోగిస్తే త్వరగా నయం అవుతుంది.

గ్లిజరిన్‌లో రోజ్‌వాటర్ కలిపి పాదాలకు రాస్తే పగుళ్ళు తగ్గుతాయి. నిద్రపోయే ముందు ఈ మిశ్రమాన్ని రాసి, రాత్రంతా అలా ఉంచేస్తే మంచిది. పగుళ్ళు తగ్గిన తరువాత మళ్ళీ ఆ సమస్య తలెత్తకుండా ఉండాలంటే గ్లిజరిన్-రోజ్‌వాటర్ మిశ్రమాన్ని రాస్తూ ఉండాలి.

## ఇలా చేస్తే ‘అధర’హెూనే!



ముఖారవిందం అదరాలంటే... అధరం దొండ పండులా మెరవాలి. మరి దాని కోసం ఏం చేయాలి? మార్కెట్‌లో దొరికే ఓ లిప్‌స్టిక్ తీసుకొచ్చేసి... పూసుకొంటే సరిపోదు. అలా చేస్తే ఉన్న అందం పోయి, వయసుకు మించి కనిపిస్తారు. అందుకే మన పెదాలకు నప్పేది... సున్నితమైన చర్మానికి హాని చేయనిది ఎంచుకోవాలనేది బ్యూటీషియన్ల

అలాగే అద్దవద్దు: మన పెదాలపై సున్నితమైన చర్మం ఉంటుంది. కనుక ఎక్కువ తేమను సంగ్రహించలేవు. దీంతో పెదాలు పొడిబారి పెచ్చుల్లా వస్తాయి. అది గమనించకుండా లిప్‌స్టిక్ వేసుకొంటే... మృదుత్వం పోయి, ముఖం మరింత కళావిహీనంగా తయారవుతుంది. అలాంటప్పుడు లిప్ స్క్రబ్‌తో మీ పెదాలను మృదువుగా చేసుకోండి. లేదంటే పెదాలపై వ్యాజ్‌లైన్ రాసి, బేబీ టూత్‌బ్రష్‌తో నిదానంగా రుద్దితే పొడిబారిన చర్మం తొలగిపోతుంది. ఆ తరువాత లిప్‌స్టిక్ ఉపయోగిస్తే పెదాలు చూడచక్కగా ఉంటాయి.

పొడిబారనీయద్దు: అప్పుడప్పుడూ కాకుండా పెదాల పోషణపై కూడా రోజూ శ్రద్ధ పెట్టాలి. పొడిబారకుండా మాయిశ్చరైజింగ్ చేస్తుండాలి. సాధారణంగా చాలా లిప్‌స్టిక్స్ మాయిశ్చరైజర్లుగా కూడా ఉపయోగపడతాయి. అలా కాని పక్షంలో లిప్‌బామ్ తీసుకోండి. అందులోని కొబ్బరి నూనె, వెన్న వంటివి మంచి మాయిశ్చరైజర్లుగా ఉపయోగపడతాయి. అలాంటిదే మరో ఉత్పత్తి లిప్ స్లీపింగ్ మాస్క్. పగిలినట్టుండే పెదాలను సజీవంగా మారుస్తుంది.

లిప్ లైనర్: లిప్ లైనర్లు వయసు మళ్లిన మహిళలకే అనుకొంటే పొరపాటే. నిజానికి లిప్ లైనర్ మీ పెదాల అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. అధరాలు కొట్టొచ్చినట్టు కనిపించడానికి హాలీవుడ్ మేకప్ ఆర్టిస్టులు కూడా తరచూ లిప్ లైనర్లు వాడుతుంటారు. అయితే మీ పెదాల రంగును బట్టే షేడ్స్ ఉపయోగిస్తే సరిగ్గా నప్పుతుంది. ఒకవేళ మీ పెదాలు విశాలంగా కనిపించాలంటే న్యూడ్ కలర్ షేడ్ అద్దాలి.

అతిగా వద్దు: ఒకవేళ లిప్‌స్టిక్ ఎక్కువైందనిపిస్తే... టిష్యూతో పైపైన అద్ది తొలగించవచ్చు. లేదంటే మూసివున్న పెదాల మధ్యలో నుంచి మీ వేలిని నోట్లో పెట్టి, నిదానంగా బయటకు లాగండి. అప్పుడు అదనంగా అద్దిన లిప్‌స్టిక్ మీ వేలికి అంటుకుని వచ్చేస్తుంది.

రబ్ చేయండి: లిప్‌స్టిక్ వేసుకున్న తరువాత దానిపై మృదువుగా రుద్దండి. దానివల్ల లిప్‌స్టిక్

# స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య.. ఈ పీసీఓఎస్!

ఆమెకు ప్రపంచం తల్లకిందులు అయినట్లుంటుంది.

పేరుకే ‘నెల’సరిగానీ అది ఎప్పుడొస్తుందో తెలీదు. వచ్చినప్పుడు అంతా గందరగోళం. మరోవైపు ముఖం మీద, ఒంటి మీద మగవారిలా అవాంఛిత రోమాలు. మొత్తం జీవితమే ఏదో అయోమయంలో పడినట్లు అనిపిస్తుంటుంది. నేడు ఎంతోమంది యుక్తవయసు ఆడపిల్లలు, స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య.. ఈ పీసీఓఎస్!

చాలామంది గడ్డాలు, మీసాల వంటి వాటినే చూసుకుంటూ వాటి గురించే ఎక్కువ ఆందోళన చెందుతుంటారుగానీ వాస్తవానికి పీసీఓఎస్ ఈ పైపై చికాకులకు మాత్రమే పరిమితమయ్యేది కాదు. మొత్తం ఆరోగ్యంపైన కూడా దీని ప్రభావం కొంత లోతుగా ఉంటుంది. వీరికి మధుమేహం, గుండె జబ్బుల వంటి ముప్పులు ఎక్కువగా ఉంటున్నాయని వైద్యరంగం ఇప్పుడు స్పష్టంగా హెచ్చరిస్తోంది. పైగా ఇది మిగిల్చే మానసిక వేదనా అనంతం. అయితే.. సమస్య ఇంత విస్తృతమైనదైనా.. దీన్ని సత్వరమే గుర్తించి చికిత్స తీసుకుంటే చాలా వరకూ ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. అందుకే దీనికి సంబంధించిన సమగ్ర వివరాలను మీ ముందుకు తెస్తోంది

పాలీ సిస్టిక్ ఓవరీ సిండ్రోమ్.. పీసీఓఎస్.. మన సమాజంలో ఎంతోమంది స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇది! మహిళల్లో దాదాపు నూటికి ఐదుగురు దీంతో బాధపడుతున్నారని అంచనా. కొత్తగా రజస్వల అయిన యుక్తవయసు ఆడపిల్లల నుంచి నడి వయసు మహిళల వరకూ.. ఎంతోమంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. చూడటానికి, చెప్పుకోవటానికి ఇదొక వ్యాధిలాగా అనిపించకపోవటం ‘పీసీఓఎస్’ ప్రత్యేకత. నెలసరి అస్తవ్యస్తం కావటం.. అవాంఛిత రోమాలు పెరగటం.. గర్భం రాకపోవటం.. ఇలా లక్షణాలన్నీ వేర్వేరుగా కనిపిస్తుంటాయి. ఆ లక్షణాలన్నింటినీ కలిపి సమగ్రంగా చూస్తేనేగానీ.. వాటన్నింటికీ మూలం ‘పీసీఓఎస్’లో ఉందని పట్టుకోలేం. అందుకే చాలామంది దీని విషయంలో రకరకాలుగా పొరబడుతుంటారు కూడా.

పైకి కనిపించే లక్షణాలకు తోడు.. దీనితో కనిపించని ముప్పులూ చాలానే ఉంటాయన్న విషయాన్ని విస్మరించకూడదు. చాలామంది పీసీఓఎస్ బాధితులకు అధిక బరువు/వూబకాయం కూడా ఉంటుంది. అలాగే చాలామందిలో హైబీపీ, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం, ఇన్సులిన్ నిరోధకత, భవిష్యత్తులో మధుమేహం వచ్చే అవకాశాల వంటి ముప్పులూ ఎక్కువే. అందుకే దీన్ని ఒక రుగ్మతగా, విస్తృత సమస్యగా అర్థం చేసుకోవటం అవసరం. నిజానికి పీసీఓఎస్ పూర్తిగా నయమైపోయే సమస్య కాదు. అయితే దీని కారణంగా తలెత్తే చికాకులన్నింటినీ చాలా వరకూ తగ్గించేందుకు ఇప్పుడు సమర్థమైన చికిత్సలున్నాయి. వీటితో పీసీఓఎస్ బాధితులు చాలా వరకూ పూర్తి సాధారణ జీవితం గడిపే వీలుంది.

లక్షణాల్లోనే ఉంది కీలకం!

- పీసీఓఎస్‌లో కనిపించే ప్రధాన లక్షణం- నెలసరి సరిగా రాకపోవటం. ఒక్కోసారి నెలల తరబడి కూడా రాకపోవచ్చు. ఏడాది మొత్తమ్మీద 8 కంటే తక్కువసార్లే వస్తుంటుంది. ఆ వచ్చినప్పుడు రుతుస్రావం చాలా ఎక్కువగా ఉండొచ్చు, ఎక్కువ రోజులూ ఉండొచ్చు.
- చర్మం జిడ్డు కారుతూ యుక్తవయసు దాటినా కూడా మొటిమలు వేధిస్తుంటాయి. అన్నింటినీ మించి అద్దంలో ముఖం చూసుకోవాలంటేనే ఇబ్బంది పెట్టేలా పెదాల మీద, చెంపల మీద.. వెంట్రుకలు పెరుగుతుంటాయి. ఏదో నూనూగుగా ఉంటే ఫర్వాలేదుగానీ క్రమేపీ గడ్డం, మీసం కాస్త దట్టంగా కూడా వస్తుంటాయి. మగవారిలా ఛాతీ మీద, పొట్ట మీద, మోచేతులు, తొడల లోపలి వైపు..చివరికి పొట్ట మీద మధ్యలో నిలువు గీతలా కూడా వెంట్రుకలు వస్తుంటాయి. ఇది చాలదన్నట్టు తల మీదేమో జుట్టు రాలిపోతుంటుంది.
- బరువు పెరిగి వూబకాయులుగా తయారవ్వచ్చు. కొందరిలో గర్భధారణ కూడా కష్టంగా తయారవుతుంది.

ఈ లక్షణాల్లో అన్నీ అందరికీ ఉండాల్సిన పని లేదు. కొన్ని ఉన్నా కూడా పీసీఓఎస్‌ను అనుమానించాల్సి ఉంటుంది. ఇవి రజస్వల అయిన తర్వాత యుక్తవయసులో ఎప్పుడైనా మొదలవ్వచ్చు. కొందరికి మొదట్లో అంతా బాగానే ఉన్నా క్రమేపీ బరువు పెరిగి, దాంతో సమస్యలు ఆరంభం కావచ్చు.

ఏమిటీ లక్షణాలు.. ఎందుకీ బాధలు?

పీసీఓఎస్‌ను అర్థం చేసుకోవాలంటే ముందు ప్రతినెలా స్త్రీ శరీరంలో ఏం జరుగుతుందో స్థూలంగా తెలుసుకోవటం అవసరం. ఆడపిల్లలకు పుట్టుకతోనే అండాశయాల్లో బోలెడన్ని కుదుళ్లు, వాటిల్లో సూక్ష్మరూపంలో అండాలు ఉంటాయి. సాధారణంగా ప్రతి నెలా అండాశయాల్లోని ఈ కుదుళ్లలో ఏదో ఒక్కటి పరిపక్వమై.. దాని నుంచి ఒక అండం బయటకు విడుదల అవుతుంటుంది. దీన్నే ‘ఓవ్యులేషన్’ అంటారు. కానీ ‘పీసీఓఎస్’ సమస్య ఉన్న స్త్రీలలో మాత్రం- నెలనెలా ఒక కుదురు పెద్దగా తయారై అండం పరిపక్వమవటానికి బదులు- చిన్నచిన్న కుదుళ్లు బోలెడన్ని సిద్ధమైపోతుంటాయి. వీటిలో నీరులాంటి స్రావం చేరి, ఇవి చిన్న చిన్న తిత్తుల్లా (సిస్ట్) తయారవుతాయి. అందుకే ఈ సమస్యను ‘పాలీ సిస్టిక్’ అంటారు. అయితే కుదుళ్లు ఇలా చాలానే సిద్ధమైనా.. చివరికి ఇవేవీ కూడా ఒక అండాన్ని పూర్తిగా పక్వానికి తీసుకొచ్చి బయటకు విడుదల చెయ్యలేవు. దీంతో వీరిలో ప్రతి నెలా క్రమం ప్రకారం ‘అండం’ పక్వం కావటం, విడుదల కావటమన్నది ఉండదు. ఫలితంగా నెలసరి అస్తవ్యస్తంగా తయారవుతుంది.

రెండోది- ఆ చిన్నచిన్న తిత్తులు ప్రమాదకరమైనవేం కాదుగానీ అవి అండాశయాల పనితీరును దెబ్బతీస్తాయి. దానివల్ల వీరిలో హార్మోన్లు అస్తవ్యస్తమైపోతాయి. చాలామంది- స్త్రీ హార్మోన్లు స్త్రీలల్లోనే ఉంటాయి, పురుష హార్మోన్లు పురుషుల్లోనే ఉంటాయని అనుకుంటుంటారుగానీ.. అది నిజం కాదు. వాస్తవానికి ఆడవారిలోనూ పురుష హార్మోన్లుంటాయి, పురుషుల్లోనూ స్త్రీ హార్మోన్లుంటాయి, కాకపోతే కాస్త తక్కువ మోతాదులో ఉంటాయి. కానీ పీసీఓఎస్ బాధితుల్లో అండాశయాల పనితీరు అస్తవ్యస్తం కావటం వల్ల- పురుష హార్మోన్లు (ఆండ్రోజెన్స్) కాస్త అధికంగా తయారవుతుంటాయి. వాటి ప్రభావం పెరిగిపోతుంది. దానివల్ల వీరిలో అండం విడుదల కాకపోవటమే కాదు.. మగవారిలాగా గడ్డాలు, మీసాలు, ఛాతీ వంటి ప్రదేశాల్లో కూడా పురుషుల్లా వెంట్రుకలు పెరగటం వంటివి మొదలవుతాయి. కొందరిలో తల మీద జుట్టు రాలిపోతూ మగవారిలా బట్టతల లక్షణాలు కనబడటమూ కనిపిస్తుంది.

మూడోది.. సాధారణంగా నెలనెలా గర్భాశయం లోపల గోడల వెంట పెరిగే ఎండోమెట్రియం పొర.. నెలసరి సమయంలో మొత్తం వూడిపోయి, రుతుస్రావం రూపంలో బయటకు వచ్చేస్తుంటుంది. అయితే పీసీఓఎస్ బాధితుల్లో నెలనెలా సక్రమంగా అండం విడుదల కావటం లేదు కాబట్టి.. గర్భాశయం లోపలి ఈ ఎండోమెట్రియం పొర కూడా పూర్తిగా విడివడదు. పైగా అది మందంగా తయారై అస్తవ్యస్తంగా వూడుతుంటుంది. అందుకని నెలసరి వచ్చినప్పుడు- రుతుస్రావం చాలా ఎక్కువగా కావటం, లేదూ చాలా ఎక్కువ రోజులు కావటం జరుగుతుంటుంది.

**వీటినీ చూసుకోవాల్సిందే!**

మధుమేహం ..పీసీఓఎస్ బాధితుల్లో తప్పకుండా పట్టించుకోవాల్సిన కీలకమైన సమస్య మధుమేహం. ఎందుకంటే వూబకాయం ఉన్నా, లేకున్నా, పీసీఓఎస్ బాధితుల్లో 65-80% మందికి ‘ఇన్సులిన్ నిరోధకత’ మాత్రం కచ్చితంగా ఉంటోందని అధ్యయనాల్లో గుర్తించారు. చాలామంది పీసీఓఎస్ బాధితుల్లో రక్తంలో ఈ ఇన్సులిన్ ఎక్కువగానే ఉంటోందిగానీ.. రక్తంలో గ్లూకోజు మాత్రం సరిగా నియంత్రణలో ఉండదు. ఇలాంటి వారు క్రమేపీ మధుమేహంలోకి వెళతుంటారు. కాబట్టి బరువు ఎక్కువగా ఉన్న పీసీఓఎస్ బాధితులకు లేదా పెద్దవయసులో పీసీఓఎస్ బారినపడిన వారికి, కుటుంబ చరిత్ర ఉన్నవారికి ఇన్సులిన్ నిరోధకత ఎలా ఉంది? మధుమేహం కూడా వచ్చిందా? అన్నది తెల్సుకునేందుకు గ్లూకోజు తాగించి చేసే రక్తపరీక్షను (జీటీటీ) తప్పనిసరిగా చూడాలి.

గుండె జబ్బు ..వూబకాయం, ఇన్సులిన్ నిరోధకత లేదా మధుమేహం వంటి సమస్యలున్న వారికి గుండెలోని రక్తనాళాలు మూసుకుపోయి, గుండె జబ్బువచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పీసీఓఎస్ బాధితులందరికీ ఈ గుండెపోటు ముప్పు ఎక్కువగా ఉంటుందా? లేదా? అన్నది కచ్చితంగా చెప్పలేకపోయినా పీసీఓఎస్‌తో పాటు వూబకాయంగానీ, మధుమేహంగానీ ఉన్న మహిళలు ఈ గుండె జబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. బరువు, ఇన్సులిన్ నిరోధకతలతో పాటు కొలెస్ట్రాల్ కూడా ఎక్కువగా ఉంటోందేమో పరీక్ష చేయించుకుని, అది ఎక్కువగా ఉంటే తగ్గించుకునేందుకు చికిత్స తీసుకోవటం అవసరం.

**గురక, నిద్రలో శ్వాస సమస్య**

పీసీఓఎస్ బాధితుల్లో కనీసం సగం మందికి నిద్రా సమయంలో మధ్యమధ్యలో ‘శ్వాస’ తీసుకోవటం ఇబ్బందికరంగా ఉంటోందని గుర్తించారు. దీన్నే ‘స్లీప్ అప్నియా’ అంటారు. దీనివల్ల నిద్రలో తరచూ మెలకువ వచ్చేస్తుంటుంది. ఇలా రాత్రి నిద్ర కరవై... పగలంతా విపరీతమైన అలసట, మత్తుగా ఉండటం వంటి లక్షణాలు మొదలవుతుంటాయి. ఈ రకం శ్వాస సమస్య ఉన్నవారిలో- ఁబకాయం, ఇన్సులిన్ నిరోధకత, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె కొట్టుకునే లయలో తేడాల వంటి ఇతరత్రా ముప్పులూ పెరుగుతాయి. కాబట్టి పీసీఓఎస్ నిర్ధారణ అయినప్పుడు వారికి గురక వస్తోందా? పగటిపూట మగతగా అనిపిస్తోందా? వంటి లక్షణాల మీదా ధ్యాస పెట్టాలి.

కుంగుబాటు, ఆందోళన ...చాలామంది పట్టించుకోని విషయం ఇది. పీసీఓఎస్ అనేది మానసికంగా తీవ్ర వేదన మిగిల్చే సమస్య. దీనివల్ల ఎంతోమంది మానసికంగా కుంగుబాటు, ఆందోళన వంటివాటిలో కూరుకుపోతుంటారు. కాబట్టి వీటి గురించీ పట్టించుకోవటం, అవసరమైతే కౌన్సెలింగ్ ఇవ్వటం అవసరం.

**క్యాన్సర్ ముప్పును మరువకూడదు**

నెలసరి క్రమంగా రాకపోవటం, రుతుక్రమం అస్తవ్యస్తంగా తయారవటం వల్ల పీసీఓఎస్ బాధితుల్లో- ఎండోమెట్రియం పొర చాలా మందంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీన్నే ‘ఎండోమెట్రియల్ హైపర్‌ప్లేసియా’ అంటారు. అరుదుగానే అయినా కొందరిలో ఇది ఎండోమెట్రియం క్యాన్సర్‌కు కూడా దారి తియ్యొచ్చు. కాబట్టి అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి, ఎండోమెట్రియం పొర మందం ఎంత ఉంటోందీ పరిశీలించటం అవసరమని తాజా మార్గదర్శకాలు స్పష్టంగా చెబుతున్నాయి.

గర్భధారణ..పీసీఓఎస్ బాధితుల్లో గర్భధారణ అంత తేలిక కాదు. నిజానికి చాలామంది గర్భం ధరిస్తారు గానీ దానికి కొంత సమయం పట్టొచ్చు. బరువు ఎక్కువగా గలవారు దాన్ని తగ్గించుకుంటే నెలసరి క్రమబద్ధమై, గర్భధారణ అవకాశాలు మెరుగవుతాయి. బరువు తగ్గినా కూడా రుతుక్రమం గాడిలో పడకపోతే వైద్యులు అండాల విడుదల కోసం ప్రత్యేకంగా హార్మోన్ మాత్రలు, ఇంజెక్షన్ల వంటివి ఇస్తారు, దాంతో గర్భధారణ అవకాశాలు బాగా పెరుగుతాయి. అండాశయాల్లో తిత్తులు మరీ ఎక్కువగా ఉన్న వారికి ల్యాప్రోస్కోపీ విధానంలో సర్జరీ చేసి, ఈ తిత్తులను చిదిపెయ్యటం ద్వారా హార్మోన్ల అసమతౌల్యాన్ని బాగా తగ్గించొచ్చు. దీంతో గర్భధారణ అవకాశాలు బాగా మెరుగవుతాయి.

అలాగే గర్భధారణ తర్వాత వీరికి గర్భిణీ మధుమేహం వస్తోందేమో చూడటం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే పీసీఓఎస్ ఉన్న స్త్రీలకు ‘గర్భిణీ



## వాట్సాప్‌నకు గుడ్ న్యూస్.. పేమెంట్ సర్వీసుల పరిమితిని ఏత్తేసిన కేంద్రం..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ మెసేజింగ్ యాప్ అయిన వాట్సాప్ నకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. వాట్సాప్ అందిస్తున్న పేమెంట్ సేవలపై పరిమితులను ఎత్తేసింది. ఆ మేరకు తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%్రీూజ×%) కీలక ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఉన్న వాట్సాప్ యూజర్లందరికీ ఈ పేమెంట్ సర్వీస్ త్వరలోనే అందుబాటులోకి రాబోతోంది. ప్రస్తుతం భారత్‌లో కేవలం పది కోట్ల మంది మాత్రమే వాట్సాప్ పేమెంట్ సేవలను వినియోగిం చుకుంటున్నారు. భారత్‌లో ప్రస్తుతం 50 కోట్ల మందికి పైగా వాట్సాప్ సేవలను ఉపయోగించుకుంటున్నారు. గతంలో మెసేజింగ్ సేవలకు మాత్రమే పరిమితమైన వాట్సాప్ ఆ తర్వాత పేమెంట్ సేవలను కూడా ప్రారంభించింది. అయితే వాట్సాప్ పేమెంట్ సేవలపై కేంద్రం ఆంక్షలు విధించింది. 2020లో వాట్సాప్ పేమెంట్ సేవలను కేవలం 4 కోట్ల మంది వినియోగించుకునేందుకే అవకాశం కల్పించింది. 2022లో ఆ పరిమితిని పది కోట్ల వ ం ద ి క ి పెంచింది. తాజాగా ఆ పరిమితిని పూర్తిగా ఎత్తివేసింది. దీంతో త్వరలోనే వాట్సాప్ పేమెంట్ సేవలు అందరికీ అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ సేవలను ఉపయోగించుకోవాలంటే మీ ఐఓఎస్ లేదా ఆండ్రాయిడ్‌లో వాట్సాప్ లేటెస్ట్ వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. వాట్సాప్ ద్వారా పేమెంట్ చేయాలంటే భారత్‌లో అకౌంట్ ఉండాలి. అలాగే వాడుకలో ఉన్న డెబిట్ కార్డు ఉండాలి. వాట్సాప్‌లో కూడా చెల్లింపుదారు, లబ్ధిదారుల మధ్య లావాదేవీలు యూపీఐ ద్వారానే జరుగుతాయి.

## ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్.. ఏప్రిల్ 1, 2025 నుంచి కొత్త నిబంధనలు.. అవి ఏంటంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ ను మరింత పటిష్టం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురాబోతోంది. ఏప్రిల్ 1, 2025 నాటికి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను ఉపయోగించే అన్ని బ్యాంకులు ఈ కొత్త నిబంధనలను ఫాలో కావాల్సి ఉంటుంది. నిధుల బదిలీలో పొరపాట్లను నివారించడానికి, మోసాలను అరికట్టడం కోసం లబ్ధిదారుల ఖాతా పేరును ధ్రువీకరించే సదుపాయాన్ని తీసుకురాబోతున్నట్టు ఆర్బీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కొత్త సదుపాయం ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే వ్యక్తి లబ్ధిదారుల పేరును తెలుసుకునే వీలు కలుగుతుంది. చెల్లింపుదారు నమోదు చేసిన ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఆధారంగా, లబ్ధిదారుని బ్యాంక్ సీబీఎస్ నుంచి ఖాతాదారుడి పేరు బదిలీ చేసే వ్యక్తికి ఈ పేరు కనిపిస్తుంది. ఆ పేరు సరైనదేనని ధ్రువీకరించుకున్న తర్వాత చెల్లింపుదారుడు ట్రాన్సాక్షన్‌ను పూర్తి చేయవచ్చు. ఒకవేళ లబ్ధిదారుడి పేరు కనిపించకపోతే, ఆ ట్రాన్సాక్షన్ చేయాలా? వద్దా? అనేది చెల్లింపుదారుడి ఇష్టం. ఎలాంటి ఛార్జీలు లేకుండానే కస్టమర్లకు ఈ సేవను అందిస్తామని ఆర్బీఐ స్పష్టం చేసింది. కస్టమర్ల గోప్యతను దృష్టిలో ఉంచుకుని, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ సదుపాయానికి సంబంధించిన ఎలాంటి డేటాను నిల్వ చేయదు. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత సురక్షితమైన, వినియోగదారు-స్నేహపూర్వకంగా మార్చడానికి ఆర్బీఐ ఈ ముఖ్యమైన చొరవ తీసుకుంటోంది. ఇది ఫండ్ ట్రాన్స్‌ఫర్‌లో తప్పులను తగ్గించడమే కాకుండా, కస్టమర్ విశ్వాసాన్ని కూడా పెంచుతుంది. ఒకవేళ ట్రాన్సాక్షన్ సంబంధిత వివాదాలు తలెత్తినప్పుడు, చెల్లింపుదారు బ్యాంక్, లబ్ధిదారుడి బ్యాంక్ వివాదాన్ని ప్రత్యేక లుకప్ రిఫరెన్స్ నంబర్, సంబంధిత లాగ్‌లను ఉపయోగించి పరిష్కరిస్తారని కూడా ఆర్బీఐ తెలిపింది.

## కొత్త సంవత్సరంలో హెూం లోన్ తీసుకోవాలనుకుంటున్నారా? ఇవి కచ్చితంగా తెలుసుకోవాల్సిందే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** సొంత ఇల్లు కొనుగోలు చేయాలన్నా.. కట్టుకోవాలన్నా చాలా మంది లోన్ల కోసం చూస్తుంటారు. చాలా బ్యాంకులు ఇప్పుడు హెూం లోన్లు ఆఫర్ చేస్తుంటాయి. అయితే వడ్డీ రేట్లు మాత్రం.. బ్యాంకుల్ని బట్టి వేర్వేరుగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. ఇంకా ఎన్నో విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పెద్ద మొత్తంలో హెూం లోన్ తీసుకోవాలనుకుంటే.. ఏయే అంశాల్ని పరిశీలించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**హెూంలోన్ ఈఎంఐ**

గృహ రుణం: చాలా మంది ఇంటిని సొంతం చేసుకోవాలనుకునే కలను నెరవేర్చుకునేందుకు బ్యాంకు లోన్‌పై ఆధారపడతారు. అయితే వీరు హెూం లోన్ దరఖాస్తు చేసే ముందు కొన్ని విషయాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. అవేంటో మనం ఇప్పుడు చూద్దాం. ముందుగా క్రెడిట్ స్కోరు కీలకంగా ఉంటుంది. మీ క్రెడిట్ స్కోరు రుణ దరఖాస్తుపై నేరుగా ప్రభావం చూపుతుందని చెప్పొచ్చు. బ్యాంకులు 700 లేదా అంతకంటే ఎక్కువ స్కోరు కలిగి ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇస్తాయన్న సంగతి తెలిసిందే. కాబట్టి.. మీ క్రెడిట్ హిస్టరీ, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టును లోన్‌కు దరఖాస్తు చేసే 6 నెలల ముందు నుంచే తప్పనిసరిగా చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా హెూం లోన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు.. దరఖాస్తుదారుల అకౌంట్ స్టేట్‌మెంట్స్ తీసుకుంటాయి. గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా బ్యాంకులు మీ రీపేమెంట్ సామర్థ్యం అంచనా వేస్తాయి. మీ అకౌంట్ సగటు బ్యాలెన్స్ కనీసం హెూం లోన్ ఈఎంఐకి సమానంగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. చాలా మంది హెూం లోన్ తీసుకునేటప్పుడు ఇంటి విలువకు సరిపడా మొత్తం లోన్ పొందొచ్చని అనుకుంటుంటారు. కానీ బ్యాంకులు ఇంటి విలువలో కనీసం 10 నుంచి 20 శాతం మొత్తాన్ని డౌన్ పేమెంట్ చెల్లించాలని అడుగుతాయి. మిగతా మొత్తానికి సరిపడా లోన్ అందిస్తాయి. అందుకే.. ఈ డౌన్ పేమెంట్ మొత్తం సమకూర్చుకునేందుకు ముందు నుంచే పొదుపు చేయడం ఉత్తమం. ఇక రూ. 50 లక్షల హెూం లోన్‌ను 20 ఏళ్ల కాల వ్యవధితో ప్రస్తుత 9 శాతం వడ్డీ రేట్ల ప్రకారం చూస్తే ఈఎంఐ దాదాపుగా రూ. 45 వేలు పడుతుంది. అందుకే.. లోన్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు దాదాపుగా ఈ మొత్తాన్ని ఈఎంఐగా చెల్లించేందుకు సిద్ధపడి ఉంటేనే లోన్ కోసం అప్లై చేయాలి. కొన్ని బ్యాంకులు మీ ఇంటి పత్రాల్ని వారి వద్ద డిపాజిట్ చేయమని.. దీని కోసం రిజిస్ట్రేషన్ కూడా చేయించమని కోరుతుంటాయి. దీనినే మెమోరాండమ్ ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ అంటారు.

లోన్ మొత్తంలో ఇది 0.5 శాతం నుంచి 0.60 శాతం వరకు ఉంటుంది. మరీ ముఖ్యంగా హెూం లోన్ తీసుకునే ముందుగా పలు బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లు, ఆఫర్లను పోల్చుకోవాలి. దీని కోసం సమగ్ర ఆన్ లైన్ పరిశోధన చేయాలి. బ్యాంకులు కొన్ని పండగ సీజన్లలో ప్రాసెసింగ్ ఛార్జీల్ని మాఫీ చేస్తుంటాయి. ఇంకా వడ్డీ రేట్లపైనా డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. మరోవైపు ఫ్లోటింగ్ లేదా ఫిక్స్‌డ్ రుణాల వడ్డీ రేట్ల గురించి కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. వీటి గురించి ముందుగానే తెలుసుకొని అప్పుడు సరైన లోన్ ప్లాన్ ఎంచుకోవాలి.

## ఎంట్రీతోనే దుమ్మురేపిన షేర్లు.. 90 శాతం ప్రీమియంతో లిస్టింగ్.. ఒక్కో షేరుపై రూ.700 లాభం!




**న్యూఢిల్లీ-నవభూమి:** వైమానికి రంగానికి చెందిన ప్రముఖ కంపెనీ యూనిమెక్ ఏరోస్పేస్ షేర్లు ఎంట్రీతోనే అదరగొట్టాయి. పబ్లిక్ ఇష్యూ ధరతో పోలిస్తే ఏకంగా 90 శాతం ప్రీమియంతో షేర్లు లిస్టయ్యాయి. దీంతో ఇన్వెస్టర్లకు ఒక్కో షేరుపై ఏకంగా రూ.700 మేర లాభం వచ్చింది. ఈ ఐపీఓ పూర్తి వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. ఈ ఏడాది చివరి రోజున స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది యూనిమెక్ ఏరోస్పేస్ స్టాక్ . మార్కెట్లలోకి అడుగుపెడుతూనే దుమ్మురేపింది. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌లో షేర్లు దక్కించుకున్న వారికి బంపర్ రిటర్న్స్ అందించింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలో ఈ కంపెనీ స్టాక్ రూ. 1460 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. పబ్లిక్ ఇష్యూ గరిష్ఠ ధర రూ. 785తో పోలిస్తే 90 శాతం ప్రీమియంతో షేర్లు లిస్టయ్యాయి. ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈలో రూ. 1491 వద్ద లిస్టయ్యాయి. దీంతో ఒక్కో షేరుపై రూ. 700 పైన లాభమొచ్చినట్లయింది. యూనిమెక్ ఏరోస్పేస్ కంపెనీ రూ.500 కోట్లు సమీకరించే లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఈ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ. 745 నుంచి రూ. 785గా నిర్ణయించారు. సబ్‌స్క్రిప్షన్ మొదలైన మొదటి రోజు నుంచే ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. సబ్‌స్క్రిప్షన్ ముగిసే నాటికి మొత్తంగా 175.31 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఈ ఐపీఓల భాగంగా రూ. 250 కోట్లు విలువైన తాజా షేర్లు జారీ చేయగా.. ఆఫర్ ఫర్ సేల్ కింద రూ. 250 కోట్లు విలువైన షేర్లను జారీ చేసింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 150 కోట్లు సమీకరించింది. మొదటి నుంచి గ్రేమార్కెట్లో మంచి ప్రీమియంతో ట్రేడింగ్ నిర్వహించింది. అంచనాలను మించి 90 శాతం ప్రీమియంతో మార్కెట్లలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా సేకరించిన రూ.500 కోట్ల నిధుల్ని వ్యాపార విస్తరణ కోసం ఉపయోగిస్తామని యూనిమెక్ ఏరోస్పేస్ ముందుగానే ప్రకటించింది. బెంగళూరు కేంద్రంగా సేవలందిస్తున్న యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ కంపెనీ ప్రధానంగా ఏరోస్పేస్, సెమీ కండక్టర్, ఎనర్జీ పరిశ్రమల్లో అగ్రగామిగా ఉంది. ఏరో టూలింగ్, డిఫెన్స్, ఎనర్జీ, గ్రౌండ్ సపోర్ట్ పరికారలు వంటి క్లిష్టమైన ఉత్పత్తుల తయారీ, సరఫరాలో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ కంపెనీ షేర్లు 90 శాతం ప్రీమియంతో లిస్టయిన తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో లిస్టింగ్ తర్వాత కొద్ది సేపటికే 6 శాతం మేర ఈ షేర్లు క్షీణించాయి. అయితే, ఆ తర్వాత మళ్లీ క్రమంగా పుంజుకున్నాయి.

## బంగారం ధగధగలు.. 2024లో 23 శాతం రిటర్న్స్.. వెండిపై 28 శాతం లాభాలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**పండుగలు.. పబ్బాలు.. పెండ్లిండ్లు.. శుభకార్యాలకు భారతీయులు బంగారం కొనుగోలు చేయాలని తలపోస్తారు. దీంతోపాటు పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి తప్పించుకునేందుకు ఇన్వెస్టర్ల పెట్టుబడులకు స్వర్గధామం బంగారం. భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక రంగంలో ఒడిదొడుకులు ఇలాగే కొనసాగడంతోపాటు అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం వంటి కారణాలతో 2025లో దేశీయ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.85 వేల నుంచి రూ.90 వేల వరకూ దూసుకెళ్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**23 శాతం పెరిగిన బంగారం ధరలు**

ప్రస్తుతం దేశ రాజధానిలో స్పాట్ మార్కెట్లో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.79,350 వద్ద పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పది గ్రాముల బంగారం రూ.76,600 వద్ద ట్రేడయింది. 2024 జనవరి ఒకటో తేదీన తులం బంగారం ధర రూ.63,870 పలికింది. నాటి నుంచి ఇప్పటి వరకూ బంగారం ధర 23 శాతం పెరిగింది. అక్టోబర్ 30న తులం బంగారం ధర రూ.82,400లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఈ ఏడాది ప్రారంభంలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం 2062 డాలర్లు పలికితే.. అక్టోబర్ 31న 2790 డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. గ్లోబల్ మార్కెట్ ధరల ప్రకారం బంగారంపై 28 శాతం రిటర్న్స్ లభిస్తాయి.

**రూ.1.25 లక్షలకు కిలో వెండి ధర**

మరోవైపు, జనవరి ఒకటో తేదీన కిలో వెండి ధర రూ.94,700 పలికింది. 2024లో వెండిపై 30 శాతం రిటర్న్స్ లభించాయి. అక్టోబర్ 23న హైదరాబాద్‌లో రూ.1,12,000లకు చేరింది. తిరిగి తగ్గుతూ వచ్చిన వెండి ధర ప్రస్తుతం రూ.98 వేల వద్ద కొనసాగుతున్నది. దేశీయంగా కిలో వెండి ధర రూ.1.1 లక్షల నుంచి రూ.1.25 లక్షల జీవిత కాల గరిష్ట స్థాయిని తాకింది.

**ట్రంప్ విధానాలకు అనుగుణంగా బులియన్ ధోరణులు**

నవంబర్ లో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హయాంలో పన్నులు, ఆర్థిక విధానాలతోపాటు ద్రవ్యోల్బణాన్ని రెండు శాతానికి కుదించాలన్న యూఎస్ ఫెడ్ రిజర్వ్ నిర్ణయాన్ని బట్టి బంగారం, వెండి ధరలు ఆధార పడి ఉంటాయి. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొంటే తక్షణం 2-3 శాతం ధరలు పెరుగుతాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన తర్వాత డాలర్, యూఎస్ బాండ్ల విలువ పెరగడంతో బంగారం ధర స్వల్పంగా తగ్గుతూ వచ్చింది. బేరిష్ ధోరణులు కొనసాగితే దేశీయ మార్కెట్లో తులం బంగారం ధర (ఎంసీఎక్స్) రూ.73,000%-%రూ.73,500 మధ్య, అంతర్జాతీయ మార్కెట్లో 2455 డాలర్ల వద్ద తచ్చాడు తుందని భావిస్తున్నారు. మరోవైపు, రూపాయి విలువ పతనమైతే దేశీయంగా బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పెరుగుతాయి.

**దిగుమతి సుంకం తగ్గింపుతో బంగారానికి ఫుల్ గిరాకీ**

గత జూలైలో కేంద్ర బడ్జెట్లో బంగారం దిగుమతిపై సుంకం ఆరు శాతం తగ్గించిన తర్వాత ధరలు ఏడు శాతం తగ్గాయి. పది గ్రాముల బంగారం ధర రూ.5000 తగ్గింది. దీంతోపాటు పండుగలు, పెండ్లిండ్ల సీజన్ లో బంగారానికి డిమాండ్ పెరిగింది. దిగుమతి సుంకం తగ్గింపుతో బంగారం లభ్యం కాగా, కొనుగోళ్లకు గిరాకీ పెరిగింది. జ్యువెల్లరీ ఆభరణాల వినియోగం 17 శాతం పెరిగింది. ఈ ఏడాది బంగారం దిగుమతులు 500 టన్నులు దాటతాయని చెబుతున్నారు.

## అదానీ విల్మార్ 8 శాతం నష్టం.. జాయింట్ వెంచర్ నుంచి వైదొలగనున్న అదానీ గ్రూప్..!




**న్యూఢిల్లీ-నవభూమి:**అదానీ విల్మార్ నుంచి అదానీ గ్రూప్ వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో మంగళవారం అదానీ విల్మార్ షేర్లు దాదాపు ఎనిమిది శాతం పతనమైంది. ఎఫ్ఎంసీజీ జాయింట్ వెంచర్ అదానీ విల్మార్ నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం అదానీ ఎంటర్ ప్రైజెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 200 కోట్ల డాలర్లకు పైగా విలువ గల 31.06 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తామని అదానీ ఎంటర్ ప్రైజెస్ పేర్కొంది. దీంతో మంగళవారం బీఎస్ఈలో అదానీ విల్మార్ షేర్ 7.95 శాతం నష్టంతో రూ.303.30, ఎన్ఎస్ఈలో 7.80 శాతం నష్టంతో రూ.303.10 లకు పతనమైంది. అదానీ విల్మార్ నుంచి ఓపెన్ మార్కెట్లో 31.06 శాతం వాటాను విక్రయించడంతోపాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద 13 శాతం వాటాను అదానీ ఎంటర్ ప్రైజెస్ విక్రయిస్తుంది. దీంతో అదానీ ఎంటర్ ప్రైజెస్ సంస్థకు సుమారు రూ.17,100 కోట్ల నిధులు సమకూరుతాయి. అదానీ విల్మార్ నుంచి పూర్తి వాటా విక్రయించడంతోపాటు అందులో అదానీ గ్రూప్ నామినీ డైరెక్టర్లు గౌతం అదానీ మేనల్లుడు ప్రణవ్ వీ అదానీతోపాటు మలయ్ మహదేవియా కూడా వైదొలుగుతారు. 2025 మార్చి 31 లోపు ఈ ప్రక్రియ పూర్తి కానున్నది. 2024 సెప్టెంబర్ 30 నాటికి అదానీ విల్మార్ సంస్థలో అదానీ ఎంటర్ ప్రైజెస్, విల్మార్ గ్రూప్ సంస్థలు 43.94 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. అంతకు ముందు 2022 ఫిబ్రవరిలో ఐపీఓ ద్వారా అదానీ విల్మార్ దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టయింది. ఐపీఓ ద్వారా రూ.3,600 కోట్ల నిధులు సేకరించింది. 1999 జనవరిలో అదానీ విల్మార్ అనే జాయింట్ వెంచర్ సంస్థను అదానీ ఎంటర్ ప్రైజెస్, విల్మార్ గ్రూప్ ఏర్పాటు చేశాయి.

## ట్యాక్స్ పేయర్లకు బిగ్ రిలీఫ్.. జనవరి 31 వరకు గడువు పెంపు..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రత్యక్ష పన్ను వివాదాల్ని పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించేలా తీసుకొచ్చిన వివాద్ సే విశ్వాస్ పథకం కింద ట్యాక్స్ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన గడువును మరోసారి కేంద్రం పొడిగించింది. డిసెంబర్ 31వ తేదీ వరకు ఉన్న గడువును జనవరి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆదాయపు పన్ను శాఖ సోమవారం ఓ ప్రకటన చేసింది. ఆ వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. ప్రత్యక్ష పన్ను చెల్లింపులకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ మొత్తంలో ట్యాక్స్ చెల్లించేందుకు పన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం కల్పించింది. ప్రత్యక్ష పన్ను చెల్లింపుల వివాదాల పరిష్కారం కోసం తీసుకొచ్చిన వివాద్ సే విశ్వాస్ స్కీమ్-2024 గడువును పొడిగిస్తున్నట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగుస్తున్న ఈ గడువును జనవరి 31, 2025 వరకు పొడిగిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకట చేసింది. దీంతో ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి మరో అవకాశం లభించినట్లయింది. ఒక వేళ గడువు పొడిగించకుంటే స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 10 శాతం అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024కి దరఖాస్తు చేసుకోని ట్యాక్స్ పేయర్లకు ఇది బిగ్ రిలీఫ్ అని పన్ను అధికారులు చెబుతున్నారు. 'ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం 1961లోని సెక్షన్ 90లోని టేబుల్ కాలమ్ 3 ప్రకారం చెల్లించాల్సిన పన్నును నిర్ధారించేందుకు డైరెక్ట్ ట్యాక్స్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024 గడువును డిసెంబర్ 31, 2024 నుంచి జనవరి 31, 2025కు పొడిగిస్తున్నాం. డైరెక్ట్ ట్యాక్స్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024లోని సెక్షన్ 97, సబ్ సెక్షన్ 2కి దఖలు పడిన అధికారల మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ సీబీడీటీ ఈ నిర్ణయం తీసుకుంది.' అని డిసెంబర్ 30, 2024 రోజున ఓ సర్క్యులర్ జారీ చేసింది ఆదాయపు పన్ను శాఖ.

**వారిపై 10 శాతం అదనపు పన్ను**

వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024 కోసం దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 31, 2025 వరకు అవకాశం లభించింది. ఆలోపు అప్లై చేసుకున్నట్లయితే ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 90 టేబుల్ కాలమ్ 3 ప్రకారం పన్ను ఎంత చెల్లించాలి అనేది నిర్ణయిస్తారు. కానీ, ఫిబ్రవరి 1, 2025 తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లియితే కాలమ్ 4 నిబంధనల ప్రకారం పన్ను లెక్కింపు చేస్తారు. జనవరి 31లోపు దరఖాస్తు చేస్తే వివాదంగా మారిన పన్ను, వడ్డీ, పెనాల్టీ (కొత్త అప్పిలేట్ ప్రకారం)తో మొత్తంగా 100 శాతం మాత్రమే వివాదం ఉన్న ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అదే ఫిబ్రవరి 1 తర్వాత అయితే అదనంగా 10 శాతం అంటే 110 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. అదే పాత అప్పిలేట్ నిబంధనల ప్రకారం అయితే ఫిబ్రవరి నుంచి 20 శాతం అదనంగా ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024లో రెండు ఫారాలు ఉంటాయి. ఫారమ్-1 అనేది ట్యాక్స్ పేయర్లు తమ సమస్యను ఏ విధంగా పరిష్కరించాలనుకుంటున్నామే తెలిపేందుకు ఉపయోగిస్తారు. ఇక ఫారమ్-2 అనేది ఫారం 1 ప్రకారం ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే సెటిల్మెంట్ సర్టిఫికెట్. ట్యాక్స్ పేయర్లు విజయవంతంగా ట్యాక్స్ చెల్లింపులు చేసిన తర్వాత దీనిని జారీ చేస్తారు. జనవరి 31వ తేదీలోపు ఫారమ్ 1 సబ్మిట్ చేసినట్లయితే వారు అదనంగా 10 శాతం ట్యాక్స్ చెల్లించనక్కర్లేదు. అయితే, ఫారమ్ 2 జారీ చేసిన 15 రోజుల్లోపు అందులో సూచించిన ట్యాక్స్ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

## కొత్త ఏడాది వేళ.. పేరు మార్చుకున్న ఎలాన్ మస్క్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తన పేరును మార్చుకున్నారు. తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన ఎక్స్ లో తన పేరును మస్క్‌కు బదులుగా 'కేకియస్ మాక్సిమస్' గా మార్చుకున్నారు. ఇది చూసిన నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అవుతున్నారు. ఆ పేరుకు అర్థం ఏంటా..? అని ఆరా తీయడం మొదలుపెట్టారు. అయితే, కేకియస్ అనేది ఓ క్రిప్టో కరెన్సీ టోకెన్. పలు బ్లాక్ చెయిన్ ప్లాట్‌ఫామ్స్‌లో ఇది అందుబాటులో ఉంది. కాగా, ఎలాన్ మస్క్ ఇటీవలే ఓ అరుదైన రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రపంచ కుబేరుడిగా విరాజిల్లుతున్న మస్క్.. ఓ అరుదైన ఘనతను సాధించారు. మస్క్ వ్యక్తిగత సంపద ఏకంగా 400 బిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ఇప్పటిదాకా ఈ మైలురాయిని ఎవరూ అధిగమించలేదు. దీంతో ఈ రికార్డును సొంతం చేసుకున్న తొలి వ్యక్తిగా మస్క్ నిలిచారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా వివరాల ప్రకారం మస్క్ సంపద విలువ 447 బిలియన్ డాలర్లకు చేరింది.

## 2024 సంవత్సరాంతపు ట్రేడింగ్ సెషన్.. కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత స్టాక్ మార్కెట్లు ) 2024 సంవత్సరం చివరి రోజైన నేడు (డిసెంబర్ 31న) ట్రేడింగ్ సెషన్‌లో భారీ పతనంతో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు మంగళవారం మొత్తం నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం 10 గంటలకు సెన్సెక్స్ దాదాపు 508 పాయింట్లు బలహీనపడింది. నిఫ్టీ 114 పాయింట్ల నష్టంతో ట్రేడవుతోంది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీలో 155 పాయింట్ల క్షీణత కనిపించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 474 పాయింట్లు నష్టపోయింది. ప్రధానంగా ఐటీ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. ప్రైవేట్ బ్యాంక్ రంగం కూడా బలహీనంగా ఉంది. అయితే లోహాలు స్వల్ప పెరుగుదలతో తెరవబడ్డాయి. మార్కెట్‌కు ప్రభుత్వ షేర్ల నుంచి మద్దతు లభించింది. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే కొన్ని లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు.

టాప్ 5 స్టాక్స్

ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, అదానీ ఎంటర్‌ప్రైస్ కంపెనీల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా, భారత్ ఎలెక్ట్రిక్, కోల్ ఇండియా, స్టీల్ వంటి కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. గత త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలు, నిరంతర విదేశీ అమ్మకాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. మొత్తం 13 ప్రధాన రంగాలు క్షీణతను నమోదు చేశాయి. 0.8% క్షీణతతో టాప్ సెక్టార్‌గా ఉంది. దేశీయంగా ఫోకస్ చేసిన స్మాల్‌క్యాప్‌లు, మిడ్‌క్యాప్‌లు వరుసగా 0.25%, 0.5% క్షీణించాయి.

**స్టాక్ మార్కెట్ పతనానికి కారణం?**

ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలతో సహా ఆసియా మార్కెట్ల పతనం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపించింది. %ఖూ (ఖ.ూ%. ట్రెజరీ)లో బాండ్ ఈల్డ్స్ పెరగడం అభివృద్ధి చెందుతున్న స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో మార్కెట్లలో క్షీణత కనిపిస్తోంది. ఈ కారణంగా విదేశీ పెట్టుబడిదారులు మార్కెట్ల నుంచి డబ్బును ఉపసంహరించుకుంటున్నారు. విదేశీ పెట్టుబడిదారులు సోమవారం రూ. 240.45 బిలియన్ల విలువైన షేర్లను విక్రయించారు. వరుసగా 10వ ట్రేడింగ్ సెషన్‌లో కూడా నికర అమ్మకందారులు పెరిగారు. దీనికి విరుద్ధంగా, దేశీయ పెట్టుబడిదారులు వరుసగా 9వ ట్రేడింగ్ సెషన్‌లో నికర కొనుగోలుదారులుగా మిగిలిపోయారు.

**సోమవారం మార్కెట్ ఎలా ఉంది?**

సోమవారం కూడా భారత బెంచ్‌మార్క్ సూచీలు పడిపోయాయి. ఆ క్రమంలో 30 షేర్ల సెన్సెక్స్ సోమవారం (డిసెంబర్ 30న) 450.94 పాయింట్ల పతనంతో 78,248.13 వద్ద ముగిసింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 50 కూడా 168.50 పాయింట్లు క్షీణతతో 23,644.90 వద్ద ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకు నిఫ్టీ, సెన్సెక్స్‌లు వరుసగా 8.8%, 8.3% చొప్పున పెరిగాయి. ఇది 2023లో దాదాపు 20% జంప్ కంటే చాలా తక్కువ కావడం విశేషం.

## డిజిటల్ లావాదేవీలు జోరు.. దేశంలో పెరిగిన సైబర్ మోసాలు: ఆర్బీఐ

**ముంబై-నవభూమి:** దేశంలో సైబర్ మోసాలు పెరిగాయి. డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికే ఇందుకు నిదర్శనం. డిసెంబర్ నెలకుగాను ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్) పేరిట సోమవారం ఆర్బీఐ రిపోర్టు విడుదల చేసింది. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబర్) 18,461 సైబర్ మోసాలు జరిగాయని, వీటి విలువ రూ.21,367 కోట్లని తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే వ్యవధిలో 14,480 కేసులు నమోదయ్యాయని, వాటి విలువ కేవలం 2,623 కోట్లేనన్నది. ఈ క్రమంలోనే సైబర్ మోసాల గురించి అందరిలోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. అంతేగాక మనీ లాండరింగ్‌కు దారితీసే మ్యూల్ అకౌంట్స్‌ను గుర్తించడం కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నది.





## రహదారిపై ఆగిన కారు.. రంగంలోకి ఎద్దులు



**జైపూర్ -నవభూమి:** అత్యంత ఖరీదైన ఓ ఎలక్ట్రిక్ కారును ఎద్దులు లాగుతున్నాయి. ఎద్దుల మెడపై ఉన్న కర్రకు.. కారుకు తాడుతో గట్టిగా కట్టారు. ఎద్దులు ముందుకు కదులుతుండగా.. ఆ వెనుక కారు వెళ్తుంది. ఆ క్రమంలో ఎద్దులు ముందుకు కదలకుండా మొరాయిస్తుంటే.. వాటిని ఓ యువకుడు అదిలిస్తున్నాడు. అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోను అత్యధిక మంది నెటిజన్లు వీక్షించారు. ఇంతకీ ఈ వీడియోలో సంఘటన ఎక్కడ చోటు చేసుకుందంటే.. రాజస్థాన్‌లో దీద్వానా జిల్లాలో. కుచామన్ నగర పరిషత్‌లో అనిల్ సింగ్ మెడ్తియా ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రయాణిస్తున్న కారు రహదారిపై ఆగిపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సమీపంలో ఎద్దులను తీసుకు వచ్చి.. రహదారిపై నిలిచిపోయిన కారును గమ్యస్థానానికి తరలించారు. అయితే ఈ ఘటనపై నాయకుడు అనిల్ సింగ్ స్పందించారు. ఏడాదిలో 16 సార్లు.. ఈ కారును సర్వీస్ సెంటర్‌కు పంపినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. అయినా తరచూ కారులో సమస్యలు తలెత్తుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు కంపెనీకి ఫిర్యాదు చేసినా.. సంస్థ నుంచి సరైన స్పందన మాత్రం కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కారు మైలేజ్ ఇస్తుందని తయారీదారులు తాను కొనుగోలు చేసే సమయంలో హామీ సైతం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కానీ తరచూ కారులో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు.

## హైవేపై కూలిన ఐరన్ బోర్డు.. 50కిపైగా కార్లకు పంచర్.. భారీగా ట్రాఫిక్ జామ్



**ముంబై -నవభూమి:** మహారాష్ట్రలోని ముంబై-నాగ్‌పూర్ సమృద్ధి మహామార్గ్ పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మాలేగావ్, వనోజా టోల్ ప్లాజా మధ్య హైవేపై ఓ ఐరన్ బోర్డు విరిగిపడింది. దీంతో సుమారు 50కిపైగా ట్రక్కులు, కార్లు పంచర్ కావడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించకపోవడంతో అర్ధరాత్రి వరకు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సమృద్ధి మహామార్గ్‌ను నాగ్‌పూర్-ముంబై మధ్య నిర్మిస్తున్నారు. మొత్తం 701 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారిని ప్రస్తుత సీఎం ఫడ్నవీస్ కలల ప్రాజెక్టుగా పేర్కొంటారు. ఇప్పటికే ఈ ఎక్స్‌ప్రెస్ వేలో రెండు దశలు పూర్తయ్యాయి. దీంతో 600 కిలోమీటర్లు అందుబాటులోకి వచ్చినట్లయింది. అయితే డిజైన్ లోపాలతో హైవేపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

## ప్రధాని మోదీ మాకు చాలా దగ్గర.. కాంట్రాక్టులు ఇప్పిస్తాం.. జనానికి కిలాడీ జంట టోకరా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజకీయ నాయకులు తమకు తెలుసని, వారిని కలిపిస్తామని చెబుతూ అమాయక ప్రజల నుంచి డబ్బులు గుంజేవాళ్ల గురించి మనం చాలా సందర్భాల్లో విన్నాం. కానీ ఓ కిలాడీ జంట మాత్రం అంతకంటే హైప్రొఫైల్ మోసాలకు పాల్పడింది. ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ పేరును అడ్డంపెట్టుకుని కోట్లు కొల్లగొట్టింది. ప్రధాని మోదీ కార్యదర్శి కుటుంబ సభ్యులమని నమ్మించి, కాంట్రాక్టుల పేరుతో అనేక మంది నుంచి కోట్లల్లో కమిషన్‌లు తీసుకుంది. చివరకు బండారం బయటపడటంతో కటకటాలపాలైంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన 38 ఏళ్ల హన్సితా అభిలిప్సా అనిల్ మొహంతిఇద్దరూ భార్యాభర్తలు. వీరు భువనేశ్వర్‌లోని ఇన్ఫోసిటీ ప్రాంతంలో ఓ విలాసవంతమైన భవనం అద్దెకు తీసుకుని కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అభిలిప్సా తాను ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి పీకే మిశ్రా కూతురునని చెప్పి పలువురిని పరిచయం చేసుకుంది. అందరినీ నమ్మించేందుకు అనేక మంది రాజకీయ ప్రముఖులతో కలిసి దిగిన ఫొటోలను కార్యాలయంలో పెట్టుకుంది. ఆమె భర్త మొహంతి కూడా తాను మిశ్రా అల్లుడినని పలువురిని నమ్మించాడు. ఈ విధంగా వారు ప్రభుత్వం నుంచి టెండర్లు ఇప్పిస్తామని, ఏవైనా పనులు కావాలన్నా చేసిపెడుతామని ప్రచారం చేసుకున్నారు. వారి మాటలు నమ్మిన వారి నుంచి కమిషన్‌ల పేరుతో కోట్ల రూపాయలు పిండుకున్నారు. అభిలిప్సా.. మైనింగ్, నిర్మాణం, వ్యాపార రంగాలకు చెందిన ధనవంతులను లక్ష్యంగా చేసుకుని వారితో పరిచయాలు పెంచుకుంది. వారి నుంచి కోట్లు వసూలు చేసింది. అయితే కమిషన్ ముట్టజెప్పినా కాంట్రాక్టులు ఇప్పించకపోవడంతో వారిపై ఈ నెల 26న ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దాంతో కిలాడీ జంట బాగోతం బయటపడింది. పోలీసులు ఆ జంటను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## భారీగా బీమా క్లెయింల తిరస్కరణ.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నవారికి ఆసుపత్రులు షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆరోగ్య బీమా తీసుకున్న వారికి ఆసుపత్రులు గట్టి షాకిస్తున్నాయి. క్లెయిం సెటిలమెంట్లలో చాలా కొరివిలు పెడుతున్నాయి. దీంతో వేలాది కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు తిరస్కరణకు గురవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్లు హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింల తిరస్కరించబడ్డాయని తెలిపింది. మొత్తం క్లెయిం సెటిల్‌మెంట్లలో వీటి వాటా 12.9 శాతంగా ఉన్నదని పేర్కొంది.

రూ.1.17 లక్షల కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్లలో రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిపారని తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. వీటితోపాటు బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల క్లెయింలను తిరస్కరించగా, రూ.7,584.57 కోట్లు చెల్లింపులు జరుపాల్సివున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 3.26 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు క్లెయింలుకాగా, వీటిలో 2.69 కోట్లు(82.46 శాతం) చెల్లింపులు జరిగాయి. ఒక్కో క్లెయిం సరాసరి రూ.31,086గా ఉన్నట్లు తెలిపింది. క్లెయిం సెటిల్‌మెంట్లలో 66.16 శాతం క్యాష్‌లెస్ పద్ధతిన సెటిల్ కాగా, 39 శాతం రియంబర్స్‌మెంట్ పద్ధతిన జరిగాయని పేర్కొంది.

2023-24లో జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.1,07,681 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి.

ప్రస్తుతం 25 జనరల్ ఇన్సూరెన్స్, 8 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నాయి

ప్రభుత్వరంగ సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్ అండ్ ఒరియంటల్ ఇన్సూరెన్స్‌లు హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సేవలు అందిస్తున్నాయి.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 165.05 కోట్ల మంది వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. 90.10 కోట్ల మందికి ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన పథకాలైన ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, ఐఆర్‌సీటీసీల కింద బీమా పొందుతున్నారు.

## మనిషి ఒంటరిగా కనబడితే చెంపలు వాయించుడే.. ఓ యువకుడి వింత ప్రవర్తన..!




**న్యూఢిల్లీ-నవభూమి:** 'జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి' అంటుంటారు. అన్నట్టే అందరి నాలుకలు ఒకే రుచిని ఇష్టపడవు. అందరి మెదళ్లు ఒకేలా ఆలోచించవు. మనిషి మనిషి మధ్య అన్ని విషయాల్లో కొంత బేధాలు ఉండటం సహజం. కానీ కొందరు మాత్రం మరీ భిన్నంగా ఉంటారు. వారి ప్రవర్తన, లక్షణాలు సమాజానికి వింతగా అనిపిస్తాయి. తాజాగా అలాంటి ఓ వ్యక్తి ప్రవర్తనే ఇప్పుడు అందరినీ విస్తుపోయేలా చేసింది. ఒంటరిగా కనిపించిన ప్రతి ఒక్కరి చెంపలు వాయిస్తున్న అతడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌కు చెందిన కపిల్ కుమార్ అనే 23 ఏళ్ల యువకుడు ఇటీవలే డిగ్రీ పూర్తిచేశాడు. ప్రస్తుతం ఉద్యోగ వేటలో ఉన్నాడు. అయితే గత ఐదారు నెలల నుంచి అతని ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చాయి. చాలా వింతగా ప్రవర్తిస్తున్నాడు. రోడ్లపై ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని చెంపలు వాయిస్తున్నాడు. బాధితులకు ఏం జరిగిందో అర్థమయ్యేలోపే తన బైకుపై అక్కడి నుంచి జారుకుంటున్నాడు.

కపిల్ కుమార్ రోడ్లపై ఒంటరిగా నడిచిపోతున్న వారిని గమనించి బైకుపై వారి దగ్గరికి వెళ్తాడు. చెంపపై ఒక్కటిచ్చి అక్కడి నుంచి తుర్రుమంటాడు. ఇలా ఇప్పటివరకు చాలా మందిని కొట్టాడు. కొంతమంది తిట్టుకుని వదిలేయగా.. కొందరు పోలీసులను ఆశ్రయించారు. అయితే గత కేసుల్లో పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో నిందితుడు కనిపించిన వారి చెంపలు వాయిస్తూ మరికొన్నాళ్లు ఎంజాయ్ చేశాడు.

అయితే తాజాగా కపిల్ కుమార్.. రిటైర్డ్ పీసీఎస్ అధికారి చెంప పగులగొట్టాడు. అతను రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బైకుపై వెనుక నుంచి వచ్చి.. ఎడమ చేతితో గట్టిగా చెంపపై కొట్టాడు. క్షణాల్లో అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితుడు వృద్ధుడు కావడంతో కపిల్ కుమార్ బలంగా కొట్టిన దెబ్బకు నిలబడలేక కిందపడిపోయాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కపిల్ దాడిలో స్వల్పంగా గాయపడ్డ వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధుడి ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడున్న సీసీ కెమెరాను ఫుటేజ్ ఆధారంగా నిందితుడు కపిల్ కుమార్ అని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కపిల్ అరెస్ట్ విషయం తెలుసుకున్న అతని పేరెంట్స్ హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కపిల్ మానసిక పరిస్థితి గురించి పోలీసులకు వివరించారు. కపిల్‌ను చిన్నప్పటి నుంచి అందరూ పిరికోడా, అదురోడా అంటూ గేలి చేసేవారని, దాంతో అతను మనుషులపై కోపం పెంచుకుని ఒంటరిగా ఉండటానికి అలవాటు పడ్డాడని అతని తల్లి చెప్పారు. కేవలం నా భర్తతో, నాతో మాత్రమే అతను మాట్లాడేవాడని ఆమె తెలిపారు. ఐదేళ్ల క్రితం తన భర్త మరణించాడని, తండ్రి మరణంతో అతను మరింత ఒంటరి అయ్యాడని వెల్లడించారు.

ఈ క్రమంలోనే ఐదారు నెలల క్రితం తాను రెండో పెళ్లి చేసుకున్నానని, దాంతో కపిల్ డిప్రెషన్ మరింత పెరిగిందని అతని తల్లి తెలిపారు. ప్రస్తుతం తాను రెండో భర్తతో కలిసి సూరజ్ కుంద్‌లో ఉంటున్నానని, కపిల్ కూడా తమతోనే ఉంటున్నాడని ఆమె చెప్పారు. చిన్నప్పటి నుంచి అందరూ ఎగతాళి చేయడం, తాను రెండో పెళ్లి చేసుకోవడం అతడికి మనుషులపై కోపం తెప్పించాయని, అందుకే అతను అందరినీ కొడుతూ తిరుగుతున్నాడని కపిల్ తల్లి వివరించారు.

కపిల్ మానసిక పరిస్థితిని పరిశీలించిన వైద్యులు.. అతను ప్రస్తుతం 'డోపమైన్ రష్' అనే మానసిక సమస్యతో బాధపడుతున్నాడని తెలిపారు. అతడికి చికిత్స చాలా అవసరమని చెప్పారు. అతడిని మరికొన్ని రోజులు అలాగే వదిలేస్తే తీవ్ర డిప్రెషన్‌కు గురై.. ఆత్మహత్య చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాంతో పోలీసులు తగిన చికిత్స చేయంచాలని చెప్పి నిందితుడిని పేరెంట్స్‌కు అప్పగించారు.

## చడీ చప్పుడూ లేకుండా గెంటివేతలు



**ముంబై-నవభూమి:** సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకంగా మారిపోతూ ఉండడంతో ఉద్యోగుల ఉద్వాసనకు కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చాయి. ఇంతమందిని తీసేస్తాం...అంత మందిని పంపేస్తాం అనే భారీ ప్రకటనలు ఏవీ లేకుండా...ఉద్యోగులు తమంత తామే ఉద్యోగాలు వదిలిపెట్టి పారిపోయేలా పరోక్షంగా ఒత్తిడి (సైలెంట్ ఫైరింగ్) చేస్తున్నాయి. తాజాగా ఈ ధోరణి బాగా పెరిగిందని స్టాఫింగ్ సొల్యూషన్స్, హెచ్‌ఆర్ సర్వీసెస్ కంపెనీ జీనియస్ కన్సల్టెంట్స్ తాజా నివేదికలో తెలిపింది. అవసరాన్ని మించి ఉన్న ఉద్యోగులను తొలగించడానికి లేఆఫ్ బాట పడుతున్నట్టు 10% కంపెనీలు తెలిపాయి. 79% కంపెనీలు మాత్రం కొత్త టెక్నాలజీలు అలవరచుకునేలా తమ ఉద్యో గుల నైపుణ్యాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించాయి. పనితీరు సంతృప్తికరంగా లేని వారిపై అధిక పనిభారం వేసి వారు ఉద్యోగం వదులుకుని పోయేలా వ్యూహాన్ని తాము అనుసరిస్తున్నట్టు 6% కంపెనీలు తెలిపాయి. మొత్తం 1,223 కంపెనీలు, 1,069 మంది ఉద్యోగులను ఈ సర్వే సందర్భంగా ప్రశ్నించి నివేదిక రూపొందించారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఆధునిక టెక్నాలజీల వినియోగాన్ని పెంచి ఉద్యోగుల అవసరం కనిష్ఠ స్థాయికి తగ్గించుకోవాలనుకుంటున్నట్టు 39% యాజమాన్యా లు తెలిపాయి. అయితే 31% మంది మాత్రం ఆధునిక టెక్నాలజీలు ఉపయోగించుకుంటూనే సమాంతరంగా మానవ వనరులను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి.

**కొత్త టెక్నాలజీల్లో 10 లక్షల ఉద్యోగాలు**

క్వాంటమ్ కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ రంగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని క్వెస్ ఐటీ స్టాఫిం గ్ తాజా నివేదికలో అంచనా వేసింది. అదే కాలంలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, బ్లాక్ చెయిన్ వంటి ఆధునిక టెక్నాలజీలు ఆర్థిక వ్యవస్థకు 15 వేల కోట్ల డాలర్ల (రూ.12.75 లక్షల కోట్లు) వాటాను అందిస్తాయని అంచనా వేసింది. 43.5 శాతం వాటాతో టెక్నాలజీ రంగంలో నియామకాలకు బెంగళూరు కేంద్ర స్థానంగా కొనసాగుతుందని కూడా తెలిపింది. 13.4 శాతం వాటాతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలుస్తుందని పేర్కొంది.

## 'మహా' కుంభమేళా!




**మహాకుంభ్‌నగర్-నవభూమి:** పరమ పవిత్ర గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద జనవరి 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాకుంభ మేళాకు సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచస్థాయి మహా పర్వంగా ఈ కుంభమేళాను నిర్వహించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. గత రెండు మాసాలుగా రేయింబవళ్లు కార్మికులు ఇక్కడి పనుల్లో నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగానే కాకుండా పలు ప్రపంచ దేశాల నుంచి కూడా భక్తులు వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లను కూడా అదే స్థాయిలో చేస్తున్నారు. రహదారుల వెడల్పు నుంచి సంగమ ఘాట్ల సుందరీకరణ వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా మహా కుంభమేళా నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకం భావిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'మన్‌కీ బాత్'లో మహాకుంభ మేళాను.. 'ఐక్యతా మహాకుంభ్'గా అభివర్ణించిన విషయం తెలిసిందే. "ద్వేషం, విభజన వాదాలను పరిత్యజించాలనే ధ్రుఢ సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఐక్యతా మహాకుంభ్‌కు తరలి రావాలి" అని మోదీ పిలుపునిచ్చారు. "మహాకుంభ్ సందేశం.. యావత్ దేశాన్నీ ఐక్యంగా ఉంచడమే" అని తేల్చి చెప్పారు. కాగా, మహాకుంభ మేళాకు ప్రస్తుతం ఏర్పాట్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. జనవరి 10వ తేదీనాటికి పూర్తిచేయాలన్న లక్ష్యంతో వడివడిగా పనులు చేస్తున్నట్టు మేళా అధికారి విజయ్‌కిరణ్ ఆనంద్ తెలిపారు. కాగా, ఆక్రమణలు, కోత కారణంగా సంగమం వద్ద గంగా నది 200 నుంచి 500 మీటర్ల వరకు తగ్గిపోయిందని చెప్పారు. ఇదిలావుంటే, 2024 ప్రారంభంలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లను మించి మహాకుంభ మేళాకు ఇప్పుడు ఏర్పాట్లు జరుగుతుండడం గమనార్హం. 2019లో కుంభమేళాకు చేసిన ఏర్పాట్ల కంటే రెట్టింపు ఏర్పాట్లను చేస్తున్నారు. మహాకుంభమేళాను హరిత మేళాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటు చూసినా పచ్చని చెట్లు, నవ్వులు విరబూసినట్టుగా ఉండే పూల మొక్కలతో సంగమ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తంగా 3 లక్షల మొక్కలను ఇక్కడ నాటుతున్నారు. అదేవిధంగా 12 కిలో మీటర్ల మేర అతిపెద్ద ఘాట్‌ను నిర్మిస్తున్నారు. అదేవిధంగా మేళాకు వచ్చే భక్తుల మనసులు దోచుకునేలా సంగమ ప్రాంతంలోని లక్షా 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రామాయణ, మహాభారతాల్లోని పలు అంశాలతో కూడిన కుడ్య చిత్రాలు, తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు స్వాగతాలు పలికే చిత్రాలు కూడా మనసును దోచుకునేలా చిత్రీకరిస్తున్నారు. మహాకుంభమేళాకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. మొత్తంగా ఏడంచల్లో భద్రతా ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీసులు 13 తాత్కాలిక పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం స్టేషన్ల సంఖ్య 57కు చేరింది. మహాకుంభమేళా జరిగే జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలు సహా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ల వద్ద 23 తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయుధ కానిస్టేబుళ్లు, 4 జాతీయ విపత్తు స్పందనా దళాలను, 21 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. ఒక్క రాష్ట్ర పోలీసులే 10 వేల మంది భద్రతా విధుల్లో ఉండనున్నారు.

## క్రెడిట్ కార్డుతో రెంట్ కడుతున్నారా? లాభాలే కాదు.. ఈ నష్టాలూ ఉంటాయి చూసుకోండి!




**ముంబై-నవభూమి:** క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగింది. అలాగే ఇటీవల రెంట్ చెల్లింపుల కోసం క్రెడిట్ కార్డు ఎక్కువ వాడుతున్నారు. అయితే, ఇలా క్రెడిట్ కార్డులతో అద్దె చెల్లింపులు చేయడంతో లాభాలతో పాటు కొన్ని నష్టాలూ ఉన్నాయి. అవేంటో కార్డు వినియోగదారులు కచ్చితంగా తెలుసుకోవాలి. ప్రస్తుతం డిబిట్ కార్డుల కంటే క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. బ్యాంకులు సులభంగా క్రెడిట్ కార్డులు జారీ చేస్తుండడం, పలు ప్రత్యేక ప్రయోజనాలు ఉండడం వంటి కారణాలతో ఎక్కువ మంది వీటిని తీసుకుంటున్నారు. ఇక షాపింగ్, డైనింగ్, బిల్ పేమెంట్లకు విరివిగా వాడేస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఇంటి అద్దె చెల్లింపులకు సైతం క్రెడిట్ కార్డు వినియోగిస్తున్నారు. నగదు కొరత ఉన్న సందర్భంలో క్రెడిట్ కార్డులు వినియోగించుకోవడం సహజమే. కానీ, కొందరు చేతిలో డబ్బులు ఉన్నా రెంట్ పేమెంట్ ఆప్షన్ వినియోగించుకుంటున్నారు. మరి రెంట్ పేమెంట్ల కోసం క్రెడిట్ కార్డులు ఉపయోగిస్తే ఎలాంటి లాభనష్టాలు ఉంటాయో తెలుసుకుందాం.

**క్రెడిట్ కార్డుతో రెంట్ పే చేస్తే లాభాలు..**

రెంట్ పేమెంట్ చేసేటప్పుడు క్రెడిట్ కార్డులను బట్టి క్యాష్ బ్యాక్‌లు, ట్రావెల్ పాయింట్లు వంటి రివార్డ్స్ లభిస్తాయి. అయితే, కార్డు, బ్యాంకును బట్టి మారుతుంటాయి. క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ చేసి ఆ బిల్లు చెల్లించేందుకు 20- 45 రోజుల వరకు గడువు ఉంటుంది. ఎలాంటి వడ్డీ ఉండదు. ఈలోగా తిరిగి చెల్లించేస్తే సరిపోతుంది. ఆ వ్యవధిలో చేతిలో ఉన్న డబ్బులను ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. క్రమంగా క్రెడిట్ కార్డు ద్వారా రెంట్ చెల్లిస్తే దీర్ఘకాలంలో మంచి క్రెడిట్ స్కోర్ నిర్మించుకునే అవకాశం ఉంటుంది. చేతిలో డబ్బులు లేని సమయంలో క్రెడిట్ కార్డ్ రెంట్ పేమెంట్ ఆప్షన్ ఉపయోగపడుతుంది. దీంతో ఇంటి ఓనర్‌కు సకాలంలో రెంట్ ఇచ్చినవారమవుతాం.

**ఈ నష్టాలూ ఉంటాయ్..**

క్రెడిట్ కార్డు ద్వారా రెంట్ పేమెంట్ చేస్తే థర్డ్ పార్టీ యాప్స్ కొంత ఛార్జీలు వసూలు చేస్తుంటాయి. దీంతో పాటు కొన్ని బ్యాంకులు సైతం రెంట్ పేమెంట్లపై 1 శాతం మేర ఫీ వసూలు చేస్తున్నాయి. ఇది అదనపు భారమేనని చెప్పాలి. ఇక రెంట్ చెల్లించి ఏదైనా కారణంతో సకాలంలో క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లించకపోతే దాదాపు 30-42 శాతం వరకు వడ్డీ పడుతుంది. మరోవైపు క్రెడిట్ స్కోర్ లెక్కించడంలో క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో కీలకంగా మారుతుంది. అది 30 శాతం లోపే ఉండాలని నిపుణులు సూచిస్తుంటారు. ఒక వేళ రెంట్ పేమెంట్లతో పెద్ద మొత్తంలో పేమెంట్లు చేస్తే యుటిలైజేషన్ రేషియోపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. సీయూఆర్ రేషియో 30 శాతం మించితే క్రెడిట్ స్కోర్ పై ప్రభావం పడుతుంది. అలాగే క్రెడిట్ కార్డు ఉంది కదా అని చేతిలో ఉన్న డబ్బులను ఇతర అవసరాలకు వాడుకుంటుంటారు. దీంతో ఆర్థిక క్రమ శిక్షణ దెబ్బతింటుంది. క్రెడిట్ కార్డుతో రెంట్ పేమెంట్ చేసేటప్పుడు ఎలాంటి లాభాలు ఉన్నాయి? నష్టాలను మించే రివార్డులు లభిస్తున్నాయా? అనే విషయాలు చూడాలి. మంచి రివార్డులు వస్తాయని అనుకుంటేనే రెంట్ పేమెంట్ చేయడం మంచిది. నగదు లేని సందర్భాల్లో, క్రెడిట్ కార్డ్ టార్గెట్ చేరుకునేందుకు వాడితే ప్రయోజనకరమే. కానీ, డబ్బులు అవసరమైన ప్రతి సారీ క్రెడిట్ కార్డు వాడేస్తే అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు. క్రెడిట్ కార్డును ఎంతో క్రమశిక్షణగా ఉపయోగించాలి. అప్పుడే ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## సార్వత్రిక ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లు పోలైన నియోజకవర్గాలు.. టాప్-3లో హైదరాబాద్!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగడం లేదని.. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి బీజేపీ అడ్డదారిలో అధికారం చేపడుతోందని ప్రతిపక్షాలు విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తున్నాయి. దీనిపై పలువురు కోర్టులో వ్యాజ్యాలు కూడా దాఖలు చేయడంతో వివాదం చెలరేగుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలు.. తర్వాత జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఈసీ వెల్లడించింది. మొదటిసారి ఈసీ ఇలా ప్రకటన చేసింది. ఎవరికి అత్యధిక మెజార్టీ.. అత్యల్ప ఓటింగ్ ఎక్కడ అనేది బయటపెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక వివరాలను సోమవారం వెల్లడించింది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించడం లేదని ప్రతిపక్షాలు విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో ఏ పార్లమెంట్ స్థానంలో ఎక్కువ శాతం?.. ఎక్కడ తక్కువ ఓటింగ్ పోలైంది? ఎవరికి అత్యధిక మెజార్టీ వచ్చింది? తదితర గణాంకాలను ఈసీ బయటపెట్టింది. అత్యల్పంగా ఓటింగ్ నమోదైన తొలి రెండు పార్లమెంట్ స్థానాలు బిహార్‌లోనే ఉన్నాయి. అక్కడ నవాడలో (43.37 శాతం), పాట్నా సాహిబ్ (46.87 శాతం) ఓటింగ్ నమోదు కాగా... తర్వాత తెలంగాణలోని హైదరాబాద్ నియోజకవర్గం (48.91 శాతం) మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో మథుర (యూపీ), రేవా (మధ్యప్రదేశ్) సికింద్రాబాద్ (తెలంగాణ), ఫుజియాబాద్ (యూపీ), నలంద (బిహార్) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ స్థానాల్లో 50 శాతంలోపే పోలింగ్ నమోదయ్యింది.

హైదరాబాద్ నియోజకవర్గంలో ఏఐఎంఐఎం తరఫున అసదుద్దీన్ ఒవైసీ.. బీజేపీ నుంచి కొంపెల్ల మాధవీ లత పోటీచేశారు. అక్కడ మ్మొత్తం 22,17,305 మంది ఓటర్లు ఉండగా.. 10,81,878 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి మాధవీ లతకు 3,23,894 ఓట్లు.. అసదుద్దీన్ ఒవైసీకి 6,61,981 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఒవైసీ 3,38,087 ఓట్ల భారీ మెజార్టీతో విజయ సాధించి.. గతంలో ఉన్న తన రికార్డును తానే బద్దలు కొట్టారు. సికింద్రాబాద్‌లో 21,20,550 మంది ఓటర్లు ఉండగా.. 10,48,604 మంది ఓటు వేశారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి జి కిషన్ రెడ్డి... కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై గెలుపొందారు. ఇక, మొత్తం సార్వత్రిక ఎన్నికల్లో 64.64 శాతం ఓట్లు పోలవ్వగా.. వీటిలో పురుషుల కంటే (65.55 శాతం) మహిళలే (65.78 శాతం) స్వల్పంగా ఎక్కువగా ఉన్నారు. 2019 (11,692) ఎన్నికల కంటే 767 నామినేషన్లు (2024లో మొత్తం 12,459) అధికంగా వచ్చాయి. దీంతో పాటు 2019తో పోల్చితే 360 మంది అధికంగా పోటీ చేశారు. అంతేకాదు, ఈసారి మహిళా అభ్యర్థులు కూడా పెరిగారు. 2019లో 726 మంది పోటీచేయగా.. ఈ ఎన్నికల్లో 800 మంది బరిలో నిలిచారు. అత్యధిక మెజార్టీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి శంకర్‌లాల్ వాణి ( 11.75 లక్షల)ది. స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఇంత భారీ విజయం ఎవరికీ దక్కలేదు. కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఆయనకు ఈ మెజారిటీ సాధ్యమైంది. రెండో స్థానంలో అస్సాం కాంగ్రెస్ అభ్యర్థి రకీబుల్ హుస్సేన్ (10.12 లక్షలు), తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (8.21 లక్షలు), సీఆర్ పాటిల్ (7.73 లక్షలు) అమిత్ షా (7.44 లక్షలు) అభిషేక్ బెనర్జీ (7.10 లక్షలు), హేమాంగ్ జోషి (5.80 లక్షలు), బ్రజ్ మోహన్ అగర్వాల్ (5.79 లక్షలు), కుందూరు రఘువీర్ (5.59 లక్షలు), మహేశ్ శర్మ (5.59లక్షలు) నిలిచారు.

ఇక, 2019 కంటే 2024లో థర్డ్ జండర్ ఓటర్లు 46.4 శాతం పెరిగినట్టు ఈసీ గణాంకాలు వెల్లడించాయి. దివ్యాంగ ఓటర్లు 90,28,696 (2019లో 61,67,482) ఉన్నట్టు తెలిపింది. అయితే, 2019లో 540 చోట్ల రీపోలింగ్ జరిగితే.. ఈసారి కేవలం 40 చోట్ల మాత్రమే జరిగిందని పేర్కొంది. మొత్తం 3,921 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీచేస్తే వారిలో ఏడుగురు మాత్రమే గెలుపొందగా.. మిగతా 3,905 మంది డిపాజిట్లు కోల్పోయారు. అత్యధికంగా అసోంలోని ధుబ్రిలో 92.3 శాతం.. అత్యల్పంగా జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో 38.7 శాతం పోలింగ్ నమోదయ్యింది.

# మరో వివాదంలో ఇరుక్కున్న మంచు ఫ్యామిలీ.. సోషల్‌మీడియాలో వీడియో వైరల్




మంచు ఫ్యామిలీ మరో వివాదంలో చిక్కుకుంది. మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య జరిగిన ఆస్తి వివాదం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంచలనం సృష్టించాయి. ఆ విషయాలు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్నాయనగా.. మంచు ఫ్యామిలీ మరో వివాదంలో ఇరుక్కుంది. మంచు విష్ణు సిబ్బంది అడవి పందులను వేటాడటం ఇప్పుడు వైరల్‌గా మారింది.

హైదరాబాద్ జల్‌పల్లిలోని అటవీ ప్రాంతంలో మంచు విష్ణు మేనేజర్ కిరణ్ చిట్ట అడవి పందులను వేటాడాడు. వేటాడిన అడవి పందిని ఎలక్ట్రీషియన్ దేవేంద్ర ప్రసాద్ బంధించి తీసుకొచ్చాడు. అడవి పందిని వేటాడి తీసుకెళ్లినట్లు మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషియన్ ప్రసాద్‌పై ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చాయని మంచు మనోజ్ తెలిపారు. వారిద్దరి చర్యలను తప్పుబడుతూ పలుమార్లు అభ్యంతరాలు కూడా వ్యక్తం చేశానని చెప్పారు. అయినప్పటికీ వారిద్దరూ పట్టించుకోకుండా ఇలాగే చేశారని చెప్పారు.

నవచిత్ర





# బాలయ్య అలక.. 'బ్రో' అని పిలవాలంటూ చరణ్‌కు స్వీట్ వార్నింగ్!

నటసింహం నందమూరి బాలకృష్ణ హోస్టుగా వ్యవహరిస్తున్న 'అన్‌స్టాపబుల్ షో' సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఆహా ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతోన్న నాలుగో సీజన్ లో ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు గెస్టులుగా సందడి చేశారు. లేటెస్ట్ ఎపిసోడ్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం ఈ ఎపిసోడ్ షూటింగ్ జరిగింది. బాలకృష్ణతో కలిసి చరణ్ సందడి చేసిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొగుడితో కాపురం కంటే దానిపైనే ఇంట్రెస్ట్: పూరీ జగన్నాథ్ అన్‌స్టాపబుల్ షో సెట్స్‌లో బాలకృష్ణ – రామ్ చరణ్ ఇద్దరూ ఒకరినొకరు ప్రేమగా హగ్ చేసుకొని, చాలా ఆప్యాయంగా పలకరించుకున్నారు. అంతకముందు చరణ్ 'సార్' అని పిలవగా.. "నా సెట్‌లోకి అనుమతి లేదు" అంటూ బాలయ్య అలక బూనడం నవ్వు తెప్పిస్తుంది. అలానే తనను 'బ్రో' అని పిలవమని చెప్పడం సరదాగా అనిపిస్తుంది. ఇక బాలకృష్ణ ఈ సందర్భంగా చెర్రీ చెయ్యి పట్టుకొని "సంక్రాంతికి వస్తున్నాం.. 'గేమ్ చేంజర్', 'డాకు మహారాజ్' సినిమాలు రెండూ తప్పకుండా గ్రాండ్ సక్సెస్ అవ్వాలి. మనం ఇండస్ట్రీకి మంచి సక్సెస్ ఇవ్వాలి. చిత్ర పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలి" అని అన్నారు. దీనికి చరణ్ సరే అంటూ బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' సినిమా సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి రాబోతోంది. చరణ్ నటిస్తున్న 'గేమ్ చేంజర్', వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు కూడా అదే సీజన్ లో రెండు రోజుల గ్యాప్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. దీంతో మూడు చిత్రాల మధ్య పొంగల్ ఫైట్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే అన్‌స్టాపబుల్ టాక్ షో ఈ క్లాష్ ను ఆహ్లాదకరమైన పోటీగా మార్చేసిందని చెప్పాలి. సంక్రాంతికి వస్తున్నాంబొబ్బిలిరాజా టచ్ ఇప్పటికే వెంకటేష్ తన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా టీమ్ తో కలిసి అన్‌స్టాపబుల్ షోలో పాల్గొన్నారు. బాలయ్యతో ఎన్నో సరదా కబుర్లు చెప్పడమే కాదు, రెండు సినిమాలు హిట్ అవ్వాలని ఒకరికొకరు విషెస్ చెప్పుకున్నారు. ఇప్పుడు రామ్ చరణ్ సైతం 'గేమ్ చేంజర్' మూవీ ప్రమోషన్స్ లో భాగంగా బాలకృష్ణ టాక్ షోకి గెస్ట్ గా వచ్చారు. ఇదంతా చూస్తుంటే టాలీవుడ్ హీరోల మధ్య ఎలాంటి సాన్నిహిత్యం ఉంది, పోటీ వాతావరణం ఎలా వుందనేది స్పష్టం అవుతుంది. ఏదేమైనా మెగా, నందమూరి హీరోలు ఒకే వేదికను పంచుకోవడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎందుకంటే ఇరు వర్గాల మధ్య దశాబ్దాలుగా బాక్సాఫీస్ వార్ నడుస్తోంది. రాజకీయాల పరంగా ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. అయినప్పటికీ కలిసినప్పుడు ఆప్యాయంగా మాట్లాడుకుంటూ ఉంటారు. బాలకృష్ణ 50 ఏళ్ల ఇండస్ట్రీ సెలబ్రేషన్స్ లో రామ్ చరణ్ పాల్గొన్నారు. అలానే గతంలో ఒక అన్‌స్టాపబుల్ ఎపిసోడ్ లో చరణ్ ఫోన్ లో మాట్లాడారు. తప్పకుండా ఈ షోకి వస్తానని చెర్రీ అప్పుడే అన్నారు. చెప్పినట్లుగానే ఇన్నాళ్లకు బాలయ్య షోలో అడుగుపెట్టారు. ఎప్పట్నుంచో మెగా, నందమూరి ఫ్యాన్స్ ఈ కలయిక కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, రామ్ చరణ్ తో బాలయ్య చేసిన అన్‌స్టాపబుల్ లేటెస్ట్ ఎపిసోడ్ స్పెషల్ గా నిలిచిపోతుందని అందరూ భావిస్తున్నారు. అయితే వీరిద్దరూ ఎలాంటి విషయాల మీద చర్చిస్తారు? అనే ఆసక్తి నెలకొంది. 'డాకు మహారాజ్' టీమ్ తో ఇప్పటికే అన్‌స్టాపబుల్ షోలో ఓ ఎపిసోడ్ ను షూట్ చేశారు. దీని తర్వాత చరణ్ ఎపిసోడ్ ఆహా వేదికగా స్ట్రీమింగ్ కు రానుంది.

# గేమ్ చేంజర్‌లో అవి ఎక్స్ పెక్ట్ చేయకూడదా?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, శంకర్ కలయికలో తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'గేమ్ చేంజర్' జనవరి 10న థియేటర్స్ లోకి వస్తోంది. భారీ బడ్జెట్ తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమాపై మెగా ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రమోషన్స్ తో సినిమాపైన హైప్ క్రియేట్ చేసే ప్రయత్నం మేకర్స్ చేస్తున్నారు. నిర్మాత దిల్ రాజు ఇప్పటికే మూవీని వీలైనంత స్ట్రాంగ్ గా జనాల్లోకి పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా రిలీజ్ అయిన అన్ని సాంగ్స్ కి ఓ మోస్తరు ఆదరణ లభించింది. అయితే విజువలైజేషన్ పరంగా ఈ సాంగ్స్ అద్భుతంగా ఉంటాయనే మాట బలంగా వినిపిస్తోంది. శంకర్ క్రియేటివ్ విజన్. అతని సినిమాలలో సాంగ్స్ పిక్చరైజేషన్ అంతా కూడా ఒక విజువల్ స్పెక్టక్యులర్ గా ఉంటుందనే సంగతి అందరికి తెలిసిందే. అలాగే ఈ సినిమాలోని కూడా సాంగ్స్ కోసమే ఏకంగా 70 కోట్లకి పైగా బడ్జెట్ పెట్టారని సమాచారం. అయితే ఈ సాంగ్స్ పిక్చరైజేషన్ ని బిగ్ స్క్రీన్ పై చూడాలనుకునే ప్రేక్షకులకి మాత్రం షాక్ తప్పేలా లేదనిపిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్ గా పనిచేసిన రూబెన్ తాజాగా మూవీలో సాంగ్స్ పై ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా రన్ టైం 2 గంటల 45 నిమిషాలు ఉంటుందని చెప్పారు. అలాగే మూవీ ఫైనల్ కాపీలో ఫుల్ సాంగ్స్ కనిపించవని చెప్పారు. కేవలం సాంగ్స్ కి కొంతభాగం మాత్రమే ఉంటుందని అన్నారు. తరువాత వీడియో సాంగ్స్ మొత్తాన్ని యుట్యూబ్ లో రిలీజ్ చేస్తారంట.ఆయన మాటల బట్టి సినిమాలు సాంగ్స్ పూర్తి విజువల్స్ ని చూడటం సాధ్యం కాదని అర్ధమైపోయింది. ఇది నిజంగా ఫ్యాన్స్ కి షాకింగ్ న్యూస్ అనే మాట వినిపిస్తోంది. ముఖ్యంగా చాలా మంది శంకర్ సినిమాలలో సాంగ్స్ పిక్చరైజేషన్స్ చూడటానికి థియేటర్స్ కి వస్తూ ఉంటారు. అయితే ఇందులో పూర్తి నిడివితో సాంగ్స్ ఉండవనే మాట బయటకి రావడంతో ప్రేక్షకులు ఎలా రియాక్ట్ అవుతారనేది వేచి చూడాలి. 'గేమ్ చేంజర్' మూవీలో రామ్ చరణ్ కి జోడీగా కియారా అద్వానీ, అంజలి నటించారు. ఎస్ జె సూర్య ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడు. శ్రీకాంత్ కీలక పాత్ర చేశారు. సంక్రాంతి రేసులో ఈ మూవీ ప్రేక్షకులని ఏ మేరకు మెప్పిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తమిళ అగ్ర కథానాయకుడు శివ కార్తికేయన్ నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ అమరన్ . ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా వచ్చిన ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. శివ కార్తికేయన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.తాజాగా ఈ చిత్రానికి బాలీవుడ్ స్టార్ నటి జాన్వీకపూర్ రివ్యూ ఇచ్చారు. ఈ ఏడాది 'అమరన్' బెస్ట్ మూవీ అని పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'అమరన్' చిత్రాన్ని చూడటం కాస్త ఆలస్యమైనట్లు చెప్పుకొచ్చారు. ఈ చిత్రంలోని ప్రతీ సన్నివేశం తన హృదయాన్ని కదిలించిందని.. ఒక మంచి సినిమాతో ఈ ఏడాదిని ముగించినట్లు జాన్వీ తన స్టోరీస్‌లో రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# ఈ ఏడాది ఇదే బెస్ట్ మూవీ.. అమరన్‌పై జాన్వీ కపూర్ రివ్యూ





'మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్ తెలుగు, తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. వరుణ్ ధావన్‌తో కలిసి 'బేబీ జాన్' చిత్రంలో నటించింది. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 'బేబీ జాన్' చిత్రంలో అవకాశం గురించి మహానటి తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. స్టార్ నటి సమంత కారణంగానే తనకు 'బేబీ జాన్' చిత్రంలో నటించే గొప్ప అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామ్‌కు థ్యాంక్స్ చెప్పింది.బేబీ జాన్' చిత్రం 'తెరి' సినిమాకు రీమేక్‌గా రూపొందించిన విషయం తెలిసిందే. దీని తమిళ వెర్షన్‌లో హీరోయిన్‌గా సామ్ నటించింది. ఈ చిత్రం హిందీ రీమేక్ చేయాలని భావించిన చిత్ర బృందం సమంతను సంప్రదించగా.. సామ్ తన పేరును సూచించిందని కీర్తి సురేశ్ తాజాగా వెల్లడించింది. తమిళంలో సమంత పోషించిన పాత్రను హిందీలో తాను చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ సినిమాతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి అని పేర్కొంది. ఈ సినిమా కోసం సమంత తన పేరు చెప్పగానే తాను భయపడ్డానని%•% అయితే సమంత తనకు ఎంతో మద్దతు ఇచ్చిందని పేర్కొంది. సమంత ఇచ్చిన ధైర్యంతోనే సినిమాను పూర్తి చేశానని చెప్పుకొచ్చింది. ఈ విషయంలో సమంతకు కీర్తి సురేశ్ కృతజతలు తెలిపింది.

# తనవల్లే ఆ అవకాశం వచ్చిందంటూ.. సమంతకు థ్యాంక్స్ చెప్పిన కీర్తి సురేశ్





# పవన్‌పై నెగిటివిటీ దెబ్బకు తా!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పొలిటికల్ ప్రయాణం మొదలైన నాటి నుంచి సినిమా షూటింగ్ లకు సరిగ్గా హాజరు కావడం లేదనే విమర్శ చాలా కాలంగా ఉన్న సంగతి తెలిసిందే. ఆయనకు ఖాళీ ఉంటే వెళ్లడం లేకపోతే లేదు అన్నట్లు గా సన్నివే శం కనిపించింది. పవన్ కోసం దర్శక, నిర్మాతలు వేచి చూసి విసిగిపోతున్నారని, ఆయన ప్లానింగ్ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందనే విమర్శలు సైతం ఎదుర్కున్నారు. ముఖ్యంగాఓజీహరి హరి వీరమల్లు సినిమా షూటింగ్ జాప్యానికి కారకుడు పవన్ కళ్యాణ్ గానే మీడియాలో హైలైట్ అయింది. మొగుడితో కాపురం కంటే దానిపైనే ఇంట్రెస్ట్: పూరీ జగన్నాథ్ ఎన్నికలకు ముందు పొలిటికల్ ప్రచారం...గెలిచిన తర్వాత పదవితోనూ బిజీగా ఉన్నారని.. సినిమాలు పట్టించు కోవడం లేదని..ఆయన కారణంగా సినిమాలు రిలీజ్ లు అవ్వడం లేదని...అభిమానులు ఏదైనా అడగాలంటే నేరుగా పవన్ కళ్యాణ్ నే సూటిగా అడగాలంటూ మీడియాలో పుంకాలు పుంకాలుగా కథనాలు వైరల్ అయ్యాయి. అయితే అసలు సంగతి ఏంటి? అన్నది ఇటీవలే బయట పడింది. పవన్ కళ్యాణ్ డేట్లు ఇచ్చినా దర్శక, నిర్మాతలు ఆ డేట్లలో తనని వాడుకోకపోవడం వల్ల షూటింగ్ లు పూర్తి కానట్లు వెల్లడించారు. దీంతో విషయం క్లియర్ గా అర్ధమైపోతుంది. ఇది పవన్ తప్పు కాదు. దర్శక నిర్మాతల తప్పు అని. పవన్ కళ్యాణ్ సినిమాకి డేట్లు ఇవ్వడమే? మహాభాగ్యంగా భావిస్తారు దర్శక నిర్మాతలు. ఆయన పోర్షన్ ఎంత వీలైంత అంత తొందరగా పూర్తిచేసి పంపిచాలని చూస్తారు. కానీ ఓజీ, వీరమల్లు సినిమా విషయంలో అదే ఏస్టేజ్ లోనూ జరగలేదని తాజాగా పవన్ వ్యాఖ్యల్ని బట్టి తెలుస్తోంది.పవన్ రెడీగా ఉన్నా? పవన్ డేట్లు ఇచ్చిన సమయంలో ఆ రెండు చిత్ర యూనిట్ లు సిద్దంగా లేకపోవడంతోనే ఇలా జరిగిందని తేలిపోయింది. అలాగే హరీష్ శంకర్ సినిమాకు కూడా డేట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పటికీ ఆయన కూడా సిద్దంగా లేకపోవడంతోనే అప్రాజెక్ట్ కూడా డిలే అయిందని తెలుస్తోంది. పవన్ ఇటీవల వ్యక్తం చేసిన అసహనం నేపథ్యంలో నిర్మాతలు ఆయన్ని ఇబ్బంది పెట్టొద్దంటూ అభిమానుల గొంతు నొక్కే ప్రయత్నం చేసిన సంగత తెలిసిందే. దీంతో పవన్ డేట్లు సవ్యంగా ఇవ్వరు! అన్న అపవాద ఆయన పై తాజా క్లారిటీతో తొలిగిపోయినట్లే.

## టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించబోతున్నాడా..? ఊపందుకున్న ఊహాగానాలు..!




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గత కొద్దికాలంగా పేలవమైన ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలోనూ తన చెత్త ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సిరీస్ తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రోహిత్ వరుస వైఫల్యాల నేపథ్యంలో పలువురు మాజీలతో పాటు అభిమానులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. రోహిత్ టెస్టుల్లో కొనసాగడం అవసరమా? అంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐతో పాటు సెలెక్టర్లు సైతం ఈ విషయంలో గురించి మాట్లాడినట్లుగా తెలుస్తున్నది. రోహిత్ తన మనసును మార్చుకునే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయని తెలుస్తున్నది. రోహిత్ ఎప్పుడు తిన నిర్ణయాన్ని ప్రకటిస్తాడన్న విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. కానీ, జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా మొదలయ్యే ఐదో టెస్ట్ అనంతరం రిటైర్మెంట్‌పై ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్లుగా సమాచారం.టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించగలిగితే.. రోహిత్ అప్పటి వరకు కొనసాగేలా సెలెక్టర్లు ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవకాశాలున్నాయి. నాలుగో టెస్ట్ ఓటమి తర్వాత టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు కాస్త దూరమైంది. ప్రస్తుతం, ఫైనల్ ఆశలు కాస్త ఉన్నా.. అది ఇతర జట్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో పరాజయం అనంతరం రోహిత్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నాడు. గతంలో ఏం జరిగిందో ఆలోచించాల్సిన అవసరం లేదని.. సహజంగానే కొన్ని ఫలితాలు తమకు అనుకూలంగా లేదన్నాడు. బాక్సింగ్ డే టెస్ట్‌లో ఓటమి తనకు మానసిక వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఆసుపత్రిలో వినోద్ కాంబ్లి డ్యాన్స్..



భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లి అనారోగ్యంతో పది రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్‌తో అతడు దవాఖానలో చేరగా వైద్య పరీక్షల్లో అతడి మెదడులో రక్తం గడ్డకట్టినట్టు తేలింది . ప్రస్తుతం ఆయన థానే జిల్లాలోని కల్వార్‌లో ఉన్న ఆకృతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనారోగ్యం నుంచి క్రమంగా కోలుకుంటున్నారు. ఈ క్రమంలో కాంబ్లి ఓ హిందీ పాటకు డ్యాన్స్ చేశారు.తన గదిలో అక్కడి సిబ్బందితో కలిసి 'చక్ దే ఇండియా' పాటకు ఎంతో ఉత్సాహంగా స్టెప్పులేశారు. కాంబ్లి డ్యాన్స్ చేస్తున్న వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మరోవైపు తన ఆరోగ్య పరిస్థితిపై కాంబ్లి ఇటీవలే స్పందించిన విషయం తెలిసిందే. వైద్యుల వల్ల తాను బతికే ఉన్నానని తెలిపారు. 'ఇక్కడి డాక్టర్ల వల్ల నేను బతికి ఉన్నాను' అంటూ హాస్పిటల్ బెడ్‌పై నుంచి స్టేట్‌మెంట్ ఇచ్చారు.

నవక్రీడ

## జైస్వాల్ ఔట్‌పై వివాదం



మెల్‌బోర్న్: ఓపెనర్ జైస్వాల్ ఔట్‌పై వివాదం నెలకొన్నది. కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీ క్యాచ్‌పై థర్డ్ అంపైర్ సైకత్ షర్ఫుదుల్లా నిర్ణయం దీనికి కారణమైంది. డ్రా కోసం ఆడుతున్న సమయంలో జైస్వాల్ క్యాచ్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్ విల్సన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆసీస్ డీఆర్‌ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్ సైకత్..బంతి బ్యాట్‌ను తాకినట్లు స్నికోమీటర్‌లో కనిపించకపోయినా ఔట్ అని ప్రకటించాడు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు చీటర్ చీటర్ అంటూ పెద్దగా అరిచారు. దీన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా తీవ్రంగా తప్పుబట్టాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**